


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




బుధవారం | 26-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 329 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి ఉ. 11.08 తదుపరి చతుర్దశి; నక్షత్రం: శ్రవణం సా 5.23 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: రా. 9.06-10.35, దుర్ముహూర్తం: మ. 12.04-12.51, అమృతఘడియలు: ఉ. 7.28-8.59, రాహుకాలం: మ. 12.00-1.30, సూర్యోదయం: 6.39, సూర్యాస్తమయం: 6.17 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



# బిజినెస్

వరంగల్ ● బుధవారం 26 ఫిబ్రవరి 2025

## బీఈ నుంచి చికున్‌గున్యా వ్యాక్సిన్

### బవేరియన్ నార్డిక్‌తో కంపెనీ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బయోలాజికల్-ఈ (బీఈ) లిమిటెడ్. చికున్‌గున్యా వ్యాక్సిన్ తయారీకి సిద్ధమవుతోంది. ఇందు కోసం డెన్మార్క్‌కు చెందిన బవేరియన్ నార్డిక్ కంపెనీతో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద బవేరియన్ నార్డిక్.. చికున్‌గున్యా వ్యాక్సిన్ తయారీకి అవసరమైన టెక్నాలజీ, తయారీ ప్రక్రియలను అందజేస్తుంది. ఈ టెక్నాలజీ ఆధారంగా బయోలాజికల్-ఈ లిమిటెడ్ జీనోమ్ వ్యాలీలోని తన ప్లాంటులో ఈ వ్యాక్సిన్లు తయారు చేస్తుంది. దీని ద్వారా మరో 300 మందికి ఈ ప్లాంటులో ఉద్యోగావకాశాలు ఏర్పడతాయి. ఇక్కడ తయారు చేసే చికున్‌గున్యా వ్యాక్సిన్లను అల్పాదాయ, మధ్య రకం ఆదాయం ఉన్న దేశాలకు సరఫరా చేస్తారు.

### అమర రాజా ఇన్‌ఫ్రాకు 300 మెగావాట్ల

## సోలార్ పీవీ ప్రాజెక్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమరా రాజా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ మరో భారీ ఈపీసీ కాంట్రాక్టును దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్, శ్రీసత్య సాయి జిల్లాలోని రామగిరి వద్ద సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) ఏర్పాటు చేసే 300 మెగావాట్ల సోలార్ పీవీ ప్రాజెక్ట్ కాంట్రాక్టు కంపెనీకి దక్కింది. ఈ కాంట్రాక్టు కింద అమర రాజా ఇన్‌ఫ్రా ఈ ప్రాజెక్టుకు అవసరమైన బ్యాలెన్స్ ఆఫ్ సిస్టమ్స్ (బీఓఎస్), 220 కేవీ పూలింగ్ సబ్‌స్టేషన్, 220 కేవీ పవర్ ట్రాన్స్‌మిషన్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తుంది. మొత్తం 1,100 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ ప్రాజెక్టును అమర రాజా ఇన్‌ఫ్రా 12 నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

### 2047 నాటికి భారత ఫార్మా పరిశ్రమ

# రూ.43 లక్షల కోట్లకు..

### ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్ వ్యయాలకు ప్రోత్సాహకాలివ్వాలి.. జీ 20 షెర్పా అమితాబ్ కాంత్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రపంచానికి జెనరిక్ ఔషధాలు అందించడంలో ముందువరుసలో ఉన్న భారత ఫార్మా రంగం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ), ఇన్నోవేషన్‌పై అధికంగా పెట్టుబడులు పెట్టాలని జీ 20 షెర్పా అమితాబ్ కాంత్ అన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న బయో ఏషియా సదస్సులో మంగళవారం ప్రధానోపన్యాసం ఇస్తూ ప్రస్తుతం 5,000 కోట్ల డాలర్లున్న (రూ.4.3 లక్షల కోట్లు) భారత ఫార్మా రంగం 2047 నాటికి 50,000 కోట్ల డాలర్లకు (రూ.43 లక్షల కోట్లు) చేరుతుందని అంచనా అని చెప్పారు. ఫార్మా ఎగుమతులు 2019 నాటికి 1,900 కోట్ల డాలర్లుండగా (రూ.1.63 లక్షల కోట్లు) 2024 నాటికి 2,800 కోట్ల డాలర్లకు (రూ.2.41 లక్షల కోట్లు) చేరాయన్నారు. ఔషధ పరిశోధన, ఉత్పత్తిలో భారతదేశ సామర్థ్యాలేమిటన్నది కొవిడ్-19 సమయంలో ప్రపంచానికి తెలిసిందని ఆయన చెప్పారు. ఔషధాల ఉత్పత్తిలో పరిమాణపరంగా మన దేశం ప్రపంచంలో మూడో స్థానంలోను, విలువపరంగా 12వ స్థానంలోను నిలుస్తోందని తెలిపారు. అమెరికాలో వినియోగించే చేసే ప్రతి మూడు ఔషధాల్లో ఒకటి, బ్రిటన్‌లో ప్రతి నాలుగింటిలోనూ ఒకటి భారత్‌లో ఉత్పత్తి అవుతున్నవేనని కాంత్ చెప్పారు.

**బయోసిమిలర్స్‌కు మంచి అవకాశాలు**

ప్రపంచంలో నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో మన ఔషధ కంపెనీలు బయోలాజికల్స్, బయోసిమిలర్స్‌పై దృష్టి సారించాలని కాంత్ సూచించారు. 2030 నాటికి ఈ వ్యాధులు మరింతగా విజృంభిస్తాయన్న అంచనాల నడుమ మన ఫార్మా కంపెనీలకు చక్కని వృద్ధి అవకాశాలున్న ఈ విభాగంపై దృష్టి సారించాలని సూచించారు మన ఫార్మా కంపెనీలు కేవలం తయారీదారులుగా కాకుండా ఇన్నోవేటర్లుగా ఎదగాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు. అయితే ఇలాంటి పెట్టుబడుల్లో రిస్క్ అధికంగా ఉంటుందంటూ ఇందుకు కంపెనీలు ముందుకు రావాలంటే అభివృద్ధి దశలోని ఔషధాలు, ఆర్ అండ్ డీ వ్యయాలపై ప్రభుత్వం తగినన్ని ప్రోత్సాహకాలివ్వడం అవసరమని సూచించారు. డిస్కవరీ ఆధారిత ఇన్నోవేషన్‌లో కార్పొరేట్ పెట్టుబడులకు జీఎస్‌టీ మినహాయింపులు కల్పించే విషయం కూడా పరిశీలించాలన్నారు. అలాగే ఈ తరహా ఇన్నోవేషన్‌కు అనుకూల వాతావరణం కల్పించడం కూడా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. నియంత్రణలు మరింతగా సడలించాలని, అనవసరమైన నిబంధనలు రద్దు చేసి తద్వారా నియంత్రణ యంత్రాంగాన్ని పరిశ్రమకు సహాయకారిగా ఉండేలా చూడాలని ఆయన సూచించారు. బయో ఏషియా సదస్సులో ఈ అంశాలన్నింటినీ సమూలంగా చర్చించి తగు సూచనలతో ముందుకు వచ్చినట్టయితే ఇన్నోవేషన్‌కు అనుకూలమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వంతో సంప్రదింపులు జరపవచ్చని కాంత్ చెప్పారు.

### ఇన్నోవేషన్‌లో రిస్క్ అధికం

ఇన్నోవేషన్ అత్యంత రిస్క్‌తో కూడుకున్న అంశమని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ కో చైర్మన్ జీవీ ప్రసాద్ అన్నారు. 1994లో డ్రగ్ డిస్కవరీలో ప్రవేశించిన తాము 30 సంవత్సరాల పాటు శ్రమపడినా ఆశించిన ఫలితాలు సాధించలేకపోయామని చెప్పారు. మంగళవారం సాయంత్రం జరిగిన సీఈఓ కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఇన్నోవేషన్ విభాగంలో కంపెనీలు అధికంగా పెట్టుబడులు పెట్టాలంటే ఆ విభాగంతో ముడిపడి ఉన్న రిస్క్‌లకు సంసిద్ధమై నిధులందించే వెంచర్ క్యాపిటలిస్టులు రావడం కూడా అవసరమని పేర్కొన్నారు. చైనాతో పోల్చితే మన ఇన్నోవేషన్ వ్యవస్థ కూడా చాలా బలహీనంగా ఉన్నదని ప్రసాద్ చెప్పారు. కేవలం దశాబ్ది కాలంలో ఇన్నోవేషన్‌లో చైనా ప్రపంచంలో రెండో స్థానానికి ఎదిగిందని ఆయన అన్నారు. చైనా అనుసరిస్తున్న సానుకూల విధానాలే అందుకు కారణమని ప్రసాద్ చెప్పారు.

## మరింత కట్టుదిట్టంగా ఈక్విటీ డెరివేటివ్స్:సెబీ

న్యూఢిల్లీ: ఈక్విటీ డెరివేటివ్స్‌లో ట్రేడింగ్‌ను మరింత కట్టుదిట్టం చేయాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ భావిస్తోంది. ఇందుకోసం కొన్ని ప్రతిపాదనలతో ఒక చర్చా పత్రం విడుదల చేసింది. ఈ చర్చా పత్రంపై సంబంధిత వర్గాలు వచ్చే నెల 17వ తేదీలోగా తమ సూచనలు, అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. ఎఫ్ అండ్ ఓ, ఓపెన్ ఇంట్రెస్ట్ (ఓఐ) విభాగాల్లో ట్రేడింగ్ సామర్థ్యం, వెసులుబాటు పెంచడం, రియల్ టైమ్ సమాచారం ఆధారంగా ఎప్పటికప్పుడు నష్ట భయ (రిస్క్) పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేసే కృషిలో భాగంగా సెబీ ఈ చర్చా పత్రం విడుదల చేసింది. ఈ ప్రతిపాదనలు అమల్లోకి వస్తే ఎఫ్ అండ్ ఓ, ఓఐ పొజిషన్లపై మదుపరులు రియల్ టైమ్ సమాచారం ఆధారంగా సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. దీనికి తోడు నష్టభయాలను సమర్థవంతంగా నిర్వహించుకోవడంతో పాటు మేలైన నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

## ఐదు రోజుల నష్టాలకు బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం మిశ్రమంగా ముగిసాయి. సెన్సెక్స్ ఐదు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఫైనాన్షియల్, ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్ల లాభాలతో 147.71 పాయింట్ల లాభంతో సెన్సెక్స్ 74,602.12 వద్ద ముగిసింది. ట్రేడింగ్ చివర్లో ఫార్మా, మెటల్, ఐటీ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో నిఫ్టీ మాత్రం వరుసగా ఆరో రోజూ స్వల్పంగా 5.8 పాయింట్లు నష్టపోయి 22,547.55 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లలో 17 కంపెనీల షేర్లు లాభాలతో, 13 కంపెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి. ఆసియా, అమెరికా మార్కెట్లు బలహీనంగా ఉండడం, కొనసాగుతున్న ఎఫ్‌పీఐల అమ్మకాలతో మదుపరులెవరూ కొనుగోళ్లపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం, ట్రంప్ సుంకాల హెచ్చరికలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. కాగా జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ మంగళవారం నాన్ కన్వర్టబుల్ బాండ్ల జారీ ద్వారా రూ.1,100 కోట్లు సమీకరించింది.

**నేడు మార్కెట్లకు సెలవు**

మహా శివరాత్రి సందర్భంగా బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు ప్రకటించారు. ఫారెక్స్, బులియన్ మార్కెట్లు కూడా పనిచేయవు. గురువారం మార్కెట్లు యధావిధిగా పనిచేస్తాయి.

**'బేర్'మన్న రూపాయి**

ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మారకం రేటు మరోసారి 'బేర్'మంది. మంగళవారం ఉదయం డాలర్‌తో 11 పైసల నష్టంతో రూ.86.83 వద్ద ప్రారంభమైన రూపాయి చివరికి 47 పైసల నష్టంతో రూ.87.19 వద్ద ముగిసింది. వచ్చే కొద్ది రోజుల్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు రూ.86.85-87.40 మధ్య ట్రేడయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. ముడి చమురు ధర మరింత తగ్గితే తప్ప ఇప్పట్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు పుంజుకునే అవకాశం కనిపించడం లేదు.

## 'స్టార్టప్స్' ఈక్విటీకీ అనుమతించాలి

**ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి**

ముంబై: స్టార్టప్ కంపెనీల ఈక్విటీలోనూ బ్యాంకుల పెట్టుబడులను అనుమతించాలని ఎస్‌బీఐ చైర్మన్ సీ శ్రీనివాసులు శెట్టి కోరారు. ముంబైలో జరుగుతున్న నాస్కామ్ టెక్నాలజీ అండ్ లీడర్‌షిప్ సదస్సులో ఆయన ఈ సూచన చేశారు. ప్రస్తుతం తమకు ఈ కంపెనీలకు రుణాలు సమకూర్చే స్వేచ్ఛ తప్ప.. ఈక్విటీలో పెట్టుబడులు పెట్టే స్వేచ్ఛ లేదన్నారు. స్టార్టప్ కంపెనీల ఈక్విటీలోనూ బ్యాంకులు పెట్టుబడులు పెట్టే వాతావరణం దేశంలో ఏర్పడాలని తాను కోరుకుంటున్నట్టు తెలిపారు. స్టార్టప్ కంపెనీలకు రూ.100 కోట్ల వరకు ఇచ్చే రుణాల చెల్లింపులకు ఒక హామీ పథకం తీసుకు వచ్చే యోచనలో కేంద్రం ఉన్నట్టు శెట్టి వెల్లడించారు. స్టార్టప్ కంపెనీల రుణ అవసరాల కోసం ఎస్‌బీఐ దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఏడు ప్రత్యేక శాఖలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**

| 26వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 445 | విజయవాడ | 485 |
| వరంగల్ | 447 | గోదావరి | 480 |
| చిత్తూరు | 493 | విశాఖపట్నం | 480 |
| | | డజను గుడ్లు రూ. 60 | |

**ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 70 | విజయవాడ | 71 |
| వరంగల్ | 70 | గుంటూరు | 71 |
| కరీంనగర్ | 70 | ఒంగోలు | 71 |
| మహబూబ్‌నగర్ | 70 | చిత్తూరు | 68 |
| కర్నూలు | 70 | నెల్లూరు | 72 |
| విశాఖపట్నం | 70 | అనంతపురం | 72 |
| గోదావరి | 71 | | |

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 88,090 ▲ | 80,750 ▲ | 1,08,000 ▲ |
| విజయవాడ | 89,500 ▲ | 84,500 ▲ | 99,000 ▲ |
| విశాఖపట్నం | 86,700 ▲ | 79,480 ▲ | 95,840 ▼ |
| రాజమండ్రి | 88,090 ▲ | 80,750 ▲ | 98,800 ▼ |
| ప్రొద్దుటూరు | 88,750 ▲ | 82,140 ▲ | 98,000 ▼ |
| ముంబై | 86,647 ▲ | 79,369 ▲ | 95,769 ▼ |

## మరో పదేళ్లలో రూ.2.2 లక్షల కోట్ల స్థాయికి..

**భారత సీఆర్‌డీఎంఓ మార్కెట్‌పై బీసీజీ గ్రూప్ అంచనా**



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కాంట్రాక్ట్ పద్దతిలో జరిగే పరిశోధన, అభివృద్ధి, తయారీ (సీఆర్‌డీఎంఓ) విభాగాల్లో భారత ఔషధ పరిశ్రమకు మంచి భవిష్యత్ కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రపంచ సీఆర్‌డీఎంఓ మార్కెట్ పరిమాణం 14,000 కోట్ల డాలర్లుగా ఉంది. ఇందులో భారత్ వాటా 2 నుంచి 3 శాతం మాత్రమే. అయితే ప్రస్తుతం భారత సీఆర్‌డీఎంఓ మార్కెట్ ఏటా సగటున 15 శాతం చొప్పున పెరుగుతోంది. వృద్ధి రేటు ఇలానే కొనసాగితే 2035 నాటికి భారత సీఆర్‌డీఎంఓ మార్కెట్ 2,200 కోట్ల డాలర్ల నుంచి 2,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.2 లక్షల కోట్లు) స్థాయికి చేరే అవకాశం ఉందని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) ఒక నివేదికలో తెలిపింది. తక్కువ ఖర్చుతో చిన్నచిన్న మాలిక్యూల్స్ అభివృద్ధి, సరికొత్త బయోలాజిక్స్ అభివృద్ధి చేయడంలో భారత కంపెనీలకు ఉన్న సామర్థ్యం ఇందుకు కలిసి వస్తుందని బీసీజీ అంచనా. పశ్చిమ దేశాల ఫార్మా కంపెనీలు చైనాకు ప్రత్యామ్నాయ సరఫరా మార్గాల కోసం చేస్తున్న అన్వేషణ కూడా భారత సీఆర్‌డీఎంఓ కంపెనీలకు 1,000 కోట్ల డాలర్ల వ్యాపారం తెచ్చిపెట్టనుంది. యాంటీ డ్రగ్ కాంజుగేట్స్ (ఏడీసీ), డీఎన్ఏ, ఆర్ఎన్ఏ చికిత్సా విధానాలు, సీఆర్‌డీఎంఓ ప్రోత్సాహం కోసం ప్రభుత్వం కేటాయించిన రూ.25,000 కోట్ల ప్రత్యేక నిధి ఇందుకు మరింత దోహదం చేస్తాయని బీసీజీ పేర్కొంది.

## వారానికి 47.5 పని గంటలు చాలు

**క్యాప్‌జెమినీ సీఈఓ అశ్విన్**



ముంబై: ఉద్యోగులు వారానికి 70 నుంచి 90 గంటలు పని చేయాలనే వాదనని ప్రముఖ ఐటీ సేవల కంపెనీ క్యాప్‌జెమినీ ఇండియా సీఈఓ అశ్విన్ యార్డి తోసిపుచ్చారు. రోజుకు 9.5 గంటల చొప్పున వారంలో ఐదు రోజుల పని చేస్తే చాలన్నారు. వారాంతాల్లో ఆఫీసు పని కోసం ఉద్యోగులకు ఈ-మెయిల్స్ పంపే విధానానికీ తాను వ్యతిరేకమన్నారు. నాస్కామ్ టెక్నాలజీ అండ్ లీడర్‌షిప్ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సంపన్న భారత్ కోసం ఉద్యోగులు వారానికి 70 గంటలు పని చేస్తే బాగుంటుందని ఇన్ఫోసిస్ వ్యవస్థాపక చైర్మన్ నారాయణ మూర్తి, కాదు 90 గంటలు పని చేయాలని ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రమణియన్ ఇటీవల సూచించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో క్యాప్‌జెమినీ ఇండియా సీఈఓ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. ఉద్యోగులు ఎన్ని గంటలు పని చేశారనిగాక, వారి నుంచి ఎంత ఉత్పాదకత వచ్చిందనేది అత్యంత ముఖ్యమని యార్డి అన్నారు.

# స్పోర్ట్స్



## ఒక్క బంతీ పడలేదు..

**ఆసీస్-దక్షిణాఫ్రికా మ్యాచ్ రద్దు — చాంపియన్స్ ట్రోఫీ**

రావల్పిండి: చాంపియన్స్ ట్రోఫీకి తొలిసారిగా వరుణుడు అడ్డుపడ్డాడు. దీంతో మంగళవారం జరగాల్సిన ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా గ్రూప్ 'బి' మ్యాచ్ ఒక్క బంతీ పడకుండానే రద్దయ్యింది. సరిగ్గా మ్యాచ్‌కు గంట ముందే వర్షం మొదలవడంతో పిచ్‌ను కవర్లతో కప్పేశారు. కనీసం టాస్ వేసేందుకు కూడా వరుణుడు అవకాశమివ్వలేదు. నిరంతరాయంగా వాన కురుస్తూనే ఉండడంతో 20 ఓవర్ల మ్యాచ్ కూడా వీలుపడలేదు. చివరకు భారత కాలమాన ప్రకారం సాయంత్రం 5.43కు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. ఈ ఫలితంతో ఆసీస్-దక్షిణాఫ్రికా జట్లకు చెరో పాయింట్ లభించింది. మరోవైపు చాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియా ఆడిన చివరి ఎనిమిది మ్యాచ్‌ల్లో ఫలితం తేలకుండా ముగియడం ఇది నాలుగోసారి.

**మైదానమంతా కప్పలేరా?**

భారీ వర్షం కురుస్తుంటే కేవలం పిచ్ ప్రాంతం మాత్రమే కప్పి, అవుట్ ఫీల్డ్‌ను కప్పకుండా ఎందుకు వదిలేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏ మాత్రం ఏర్పాట్లు చేయని పాక్ బోర్డు అసలు ఐసీసీ అందించిన నిధులను సక్రమంగా ఖర్చు చేస్తున్నట్టు లేదని భారత మాజీ ఆటగాడు మహ్మద్ కైఫ్ అన్నాడు.

## మ్యాచ్‌లన్నీ ఒక్కచోటే ఆడిస్తే ఎలా?

**టీమిండియా షెడ్యూల్‌పై మాజీల విమర్శ**

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఆడే మ్యాచ్‌లన్నింటినీ దుబాయ్‌లోనే నిర్వహించడాన్ని పలువురు మాజీలు తప్పుపడుతున్నారు. రోహిత్ సేన ఎక్కడికీ వెళ్లకుండా ఒకే వేదికపై మ్యాచ్‌లు ఆడడం వారికి లాభిస్తోందని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్లు గుర్తు చేశారు. 'భారత జట్టు కేవలం దుబాయ్‌లోనే మ్యాచ్‌లు ఆడడం వారికి ఎంతో కొంత లాభిస్తుంది' అని మైక్ అథర్టన్ అన్నాడు. అలాగే యూఏఈలో పిచ్‌లు స్పిన్‌కు అనుకూలమనే అంచనాతో భారత జట్టు ఎక్కువ మంది స్పిన్నర్లను తీసుకుందని నాసిర్ హుస్సేన్ చెప్పుకొచ్చాడు. కాగా, 'భారత్ ఇప్పటికే అన్ని విభాగాల్లో బలంగా ఉన్న జట్టు. దీనికి తోడు మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో ఆడుతుండడం వీరికి మరింత కలిసిరానుంది' అని గాయంతో టోర్నీకి దూరమైన ఆస్ట్రేలియా జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కూడా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్టు మీడియాలో వార్తలు వచ్చాయి.



## కుల్దీప్.. ఫినిషర్

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

భారత పరిమిత ఓవర్ల జట్టులో ఎడమచేతి మణికట్టు మాంత్రికుడు కుల్దీప్ యాదవ్‌ది కీలక స్థానం. అతడి మ్యాజిక్ బంతులను అర్థం చేసుకోలేక ప్రత్యర్థి బ్యాటర్లు బోల్తా పడుతుంటారు. ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడి బంతుల ప్రభావం అంతా ఇంతా కాదు. ఆ మ్యాచ్‌లో పాక్ ఓ దశలో 200/5తో భారీస్కోరు దిశగా వెళుతోంది. మరో 8 ఓవర్లు కూడా ఉన్నాయి. ఆ సమయంలో కెప్టెన్ రోహిత్ లెగ్గీ కుల్దీప్‌నే నమ్ముకున్నాడు. 43వ ఓవర్‌లో బంతి చేతపట్టిన అతను ఫామ్‌లో ఉన్న సల్మాన్ ఆఘాతో పాటు షహీన్‌ను వరుసగా పెవిలియన్ చేర్చి పాక్‌ను కంగారెత్తించాడు. గూగ్లీలతో పాటు బంతిని కాస్త స్వింగ్ చేయగల వైవిధ్యం కారణంగా కుల్దీప్ చివరి 10 ఓవర్లలోనూ ప్రభావం చూపగలుగుతున్నాడు. వాస్తవానికి అతను గాయం నుంచి కోలుకుని జట్టులోకి వచ్చినా, ఇప్పటివరకు మెరుగైన ప్రదర్శనే కనబర్చాడు. 2015 నుంచి 40-45 ఓవర్ల మధ్య కుల్దీప్ 25 వికెట్లు తీశాడు. రషీద్, జంపా మాత్రమే అతడికన్నా ఎక్కువ వికెట్లు తీయగలిగారు. వైవిధ్యంగా బంతులు వేస్తే స్పిన్నర్లను ఎదుర్కోవడం బ్యాటర్లకు కష్టమని, అందుకే డెత్ ఓవర్లలో రోహిత్ తనను ఎంపిక చేసుకుంటున్నట్టు కుల్దీప్ చెబుతున్నాడు. దుబా య్ వికెట్ కూడా నెమ్మదిగా ఉండడం అతడికి కలిసివస్తోంది. అయితే ఇటీవల మరో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి విశేషంగా రాణిస్తుండడంతో కుల్దీప్‌కు చోటు కష్టమేననే భావన వ్యక్తమైంది. చాంపియన్స్ ట్రోఫీలో జడేజా, అక్షర్‌లకు తోడు వరుణ్ ఉంటాడనే అనుకున్నారంతా. 'వైట్‌బాల్ క్రికెట్‌లో కుల్దీప్ రికార్డు చూడండి. అతడు మ్యాచ్‌లో ఏ దశలోనైనా బౌలింగ్ చేసి పరుగులను కట్టడి చేయగలడు. అలాగే భాగస్వామ్యాలను విడదీసే సామర్థ్యం కూడా ఉంది. అందుకే అతను ఫిట్‌గా ఉంటే తుది జట్టులోకి కచ్చితంగా వస్తాడు' అని ఓ మాజీ స్పిన్నర్.. కుల్దీప్‌నకు మద్దతు పలికాడు. పాక్‌తో మ్యాచ్‌లో కుల్దీప్ తొలి పవర్‌ప్లే నుంచి 45 ఓవర్ల మధ్యలో బౌలింగ్ చేశాడు. అతడి 9 ఓవర్లలో మూడు ఫోర్లు మాత్రమే రాగా, 3 వికెట్లు పడగొట్టాడు. పేసర్ మహ్మద్ షమి, టోర్నీలో ఇంకా ఆడని అర్ష్‌దీప్‌లాంటి చక్కటి యార్కర్ బౌలర్లు కలిగిన జట్టులో మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ డెత్ ఓవర్లలో నమ్మదగ్గ ప్లేయర్‌గా మారడం విశేషమే.

## ఒలింపిక్ విజేతకు షాకిచ్చారు

**భారత హాకీ అమ్మాయిల అద్భుత విజయం**

భువనేశ్వర్: భారత మహిళల హాకీ జట్టు ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో అద్భుత విజయం సాధించింది. మంగళవారం జరిగిన పోరులో పారిస్ ఒలింపిక్స్ చాంపియన్, ప్రపంచ నెంబర్‌వన్ నెదర్లాండ్స్‌కు షాకిచ్చింది. నిర్ణీత సమయానికి ఇరుజట్లు 2-2 గోల్స్‌తో నిలిచాయి. దీంతో ఫలితం తేల్చే షూటౌట్‌లో దీపిక, ముంతాజ్ చెరో గోల్ సాధించడంతో భారత్ 2-1తో డిఫెండింగ్ చాంప్ నెదర్లాండ్స్‌ను చిత్తుచేసింది. షూటౌట్‌లో డచ్ తరపున ఏకైక గోల్‌ను మార్టిన్ వీన్ చేసింది. వెటరన్ గోల్‌కీపర్ సవిత పూనియా ప్రత్యర్థి నాలుగు గోల్స్ ప్రయత్నాలను సమర్థ వంతంగా అడ్డుకొని భారత్ విజయంలో కీలకపాత్ర పోషించింది.

హెచ్ఐ నజరానా: ఒలింపిక్ విజేత నెదర్లాండ్స్‌ను ఓడించిన భారత . జట్టులోని ప్రతి సభ్యురాలికి రూ. లక్ష చొప్పున, సహాయ సిబ్బందికి తలో రూ. 50 వేలు రివార్డు ఇవ్వనున్నట్టు హాకీ ఇండియా (హెచ్ఐ) ప్రకటించింది.



## ఓడిన జట్టు ఇంటికే..




**చాంపియన్స్ ట్రోఫీలో నేడు — ఇంగ్లండ్ X అఫ్ఘానిస్థాన్ — మ.2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో**

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీలో గ్రూప్ 'ఏ' నుంచి ఇప్పటికే సెమీస్ బెర్త్‌లు ఖరారయ్యాయి. నాలుగు జట్లకు ఇంకా ఒక్కో మ్యాచ్ మిగిలి ఉన్నా భారత్, న్యూజిలాండ్ జట్లు నాకౌట్‌కు అర్హత సాధించిన విషయం తెలిసిందే. ఇక గ్రూప్ 'బి'లో పోరు మాత్రం రసవత్తరంగా మారింది. ఈ గ్రూప్‌లో భాగంగా మంగళవారం జరగాల్సిన ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా మ్యాచ్ రద్దవడంతో ఈ రెండు జట్లు మూడేసి పాయింట్లతో ఉన్నాయి. దీంతో బుధవారం జరిగే ఇంగ్లండ్-అఫ్ఘానిస్థాన్ మ్యాచ్ కీలకం కాబోతోంది. ఎందుకంటే ఈ రెండు జట్లూ తమ తొలి మ్యాచ్‌లో ఓటమితో పాయింట్ల ఖాతానే తెరవలేదు. అంటే.. నేటి మ్యాచ్‌లో గెలిచిన జట్టుకే సెమీస్ అవకాశాలుంటాయి. ఓడిన జట్టు అధికారికంగా టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. స్టార్లతో కూడిన ఇంగ్లండ్ జట్టు ఆసీస్‌పై 351 పరుగులు సాధించినా మ్యాచ్‌ను కాపాడుకోలేకపోయింది. దీనికి తోడు బౌలింగ్ ఆల్‌రౌండర్ బ్రైడన్ కార్స్ గాయంతో టోర్నీకి దూరమయ్యాడు. అతడి స్థానంలో రెహాన్ అహ్మద్‌ను తీసుకున్నారు. డకెట్, రూట్ ఫామ్‌లో ఉండగా సాల్ట్, కెప్టెన్ బట్లర్, బ్రూక్, లివింగ్‌స్టోన్ బ్యాట్లు ఝుళిపిస్తే అఫ్ఘాన్ బౌలర్లు హడలిపోవాల్సిందే. అందుకే స్థాయికి తగ్గ ఆటతీరుతో రాణించి ప్రత్యర్థిపై భారీ విజయం సాధించాలనే కసితో ఇంగ్లండ్ ఉంది. అటు హష్మతుల్లా షాహిది సారథ్యంలోని అఫ్ఘాన్‌ను తేలిగ్గా తీసుకోవడానికి లేదు. ఆ జట్టు గతేడాది టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాకు షాకిచ్చి సెమీస్ చేరిన విషయం మర్చిపోలేం. రహ్మత్ షా, గుర్బాజ్, ఒమర్జాయ్, జద్రాన్ కీలక బ్యాటర్లు. బౌలింగ్‌లో రషీద్, నబీ, నూర్ అహ్మద్‌లతో స్పిన్ విభాగం పటిష్ఠంగా కనిపిస్తోంది. ఏదేమైనా ప్రత్యర్థిపై తమదే పైచేయి కావాలన్న ధ్యేయంతో అఫ్ఘాన్ బరిలోకి దిగుతోంది.

**బి-జట్టుపై కూడా**

## నెగ్గలేరు!

**పాక్ ఆటతీరుపై గవాస్కర్**

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ రేసు నుంచి నాకౌటైన పాకిస్థాన్ జట్టుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భారత్ చేతిలో చిత్తుగా ఓడిన పాక్‌పై మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ సెటైర్లు వేశాడు. భారత ద్వితీయ శ్రేణి జట్టును ఓడించడం కూడా పాక్ వల్లకాదన్నాడు. 'నాకు తెలిసి ప్రస్తుత ఫామ్‌తో భారత్-బి జట్టుపై గెలవడం కూడా పాక్‌కు కష్టమే. సి-టీమ్ విషయం చెప్పలేను. పాక్ రిజర్వు బెంచ్ బలంగా లేకపోవడం ఎంతో ఆశ్చర్యానికి గురి చేస్తోంది' అన్నా డు. కాగా కెప్టెన్‌గా ధోనీని నియమించినా.. పాక్ తలరాతను మార్చలేడని ఆ దేశ మహిళా జట్టు మాజీ కెప్టెన్ సనా మిర్ విమర్శించింది. 'ధోనీ లేదా యూనిస్ ఖాన్‌ను సారథులుగా నియమించినా.. ఈ జట్టుతో ఏమీ చేయలేరు. టోర్నీ కోసం 15 మంది జట్టు సభ్యులను ప్రకటించినప్పుడే ఆశలు వదిలేసుకొన్నా'నని చెప్పింది.

## హైదరాబాద్‌లో రోయింగ్ లీగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా మిషన్‌లో భాగంగా తొలిసారిగా క్రీడాకారిణుల కోసం కేంద్ర క్రీడాశాఖ రోయింగ్ లీగ్‌కు శ్రీకారం చుట్టింది. బుధవారం నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లో అస్మిత రోయింగ్ లీగ్ పేరిట పోటీలను నిర్వహించనున్నారు. ఇందులో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయి. హైదరాబాద్ క్వీన్స్, భోపాల్ వేవ్స్ క్వీన్స్, చెన్నై రాణీస్, కొచ్చిన్ క్వీన్స్, కటక్ రోయింగ్, డెక్కన్ క్వీన్ పుణె, కోల్‌కతా ఆర్-ఓర్స్, లుధియానా టీమ్ రోయింగ్.. జట్లు ఈ లీగ్‌లో పోటీ పడుతున్నాయి.

## దంచేసిన ఢిల్లీ

**జొనాసెన్ అర్ధ శతకం ● 6 వికెట్లతో గుజరాత్ చిత్తు**



జొనాసెన్ (61 నాటౌట్)

బెంగళూరు: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఢిల్లీ క్యాపిటల్స్.. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో మూడో విజయాన్ని నమోదు చేసింది. జెస్ జొనాసెన్ (32 బంతుల్లో 61 నాటౌట్) అర్ధ శతకంతోపాటు షఫాలీ (27 బంతుల్లో 44) దూకుడుగా ఆడడంతో.. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 6 వికెట్లతో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 127/9 స్కోరుకే పరిమితమైంది. కాప్, సదర్లాండ్, శిఖా పాండే తలో 2 వికెట్లు పడగొట్టారు. టాపార్డర్ వైఫల్యంతో జట్టు 41/5తో పీకల్లోతు కష్టాల్లో పడిన సమయంలో.. డోటిన్ (26), భారతి ఫుల్మాలి (40 నాటౌట్) ఆదుకున్నారు. తనూజ (16)తో కలసి భారతి ఏడో వికెట్‌కు 51 రన్స్ జోడించడంతో జట్టు స్కోరు సెంచరీ దాటింది. ఓపెనర్ హర్లీన్ డియోల్ (5), లిచ్‌ఫీల్డ్ (0), బెత్ మూనీ (10), కష్వీ గౌతమ్ (0), ఆష్లే గార్డ్‌నర్ (3), సిమ్రన్ నిరాశపరిచారు. ఛేదనలో ఢిల్లీ 15.1 ఓవర్లలో 4 వికెట్లకు 131 రన్స్ చేసి గెలిచింది. ఓపెనర్ షఫాలీ, జొనాసెన్ రెండో వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యంతో ఢిల్లీని గెలుపు బాటలో నిలబెట్టారు. షఫాలీ వెనుదిరిగినా.. తుదికంటా క్రీజులో నిలిచిన జొనాసెన్ జట్టును గెలిపించింది.

**డబ్ల్యూపీఎల్‌లో నేడు — ముంబై x యూపీ — రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో**

**సంక్షిప్త స్కోర్లు**

గుజరాత్: 20 ఓవర్లలో 127/9 (భారతి 40 నాటౌట్, డోటిన్ 26; కాప్ 2/17, సదర్లాండ్ 2/20).
ఢిల్లీ: 15.1 ఓవర్లలో 131/4 (జొనాసెన్ 61 నాటౌట్, షఫాలీ 44; కష్వీ గౌతమ్ 2/26).

**నేటి నుంచి రంజీ ఫైనల్ — విదర్భ X కేరళ — ఉదయం 9.30 నుంచి**

www.andhrajyothy.com
వరంగల్
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



బుధవారం | 26-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 329 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## ఐటీ బ్రదర్.. ఫ్యాటీ లివర్!

**దేశంలోని 84% మంది ఐటీ ఉద్యోగులు ఫ్యాటీ లివర్ బాధితులే**

**ఏఐజీ వైద్యులు, హెచ్‌సీయూ రిసెర్చ్ స్కాలర్ల అధ్యయనంలో వెల్లడి**

**చిరుతిండ్లు, నిద్రలేమి, పని ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం ప్రధాన కారణాలు**

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) దాని అనుబంధ రంగాల్లో పని చేస్తున్న వారిలో కాలేయ సంబంధిత అనారోగ్య సమస్యలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 54 లక్షల మంది ఐటీ రంగంలో పని చేస్తుండగా.. వారిలో 84 శాతం మందికి పైగా ఫ్యాటీ లివర్ సహా పలు కాలేయ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. 71 శాతం మంది ఐటీ ఉద్యోగుల్లో ఊబకాయం సమస్య ఉండగా, వీరిలో 34 శాతం మంది జీవక్రియ సిండ్రోమ్‌తో సతమతమవుతున్నట్లు

మిగతా 12వ పేజీలో...



## దుబాయ్‌లో తెలుగు సినీ నిర్మాత మృతి

తన ఫ్లాట్‌లో నిద్రలోనే కన్నుమూసిన కేదార్

ఓ పెళ్లి వేడుకలో పాల్గొన్న అనంతరం విషాదం

ఫ్లాట్‌లో కేదార్‌తో పాటు ఓ మాజీ ఎమ్మెల్యే

గతేడాది ర్యాడిసన్ డ్రగ్స్ కేసులో కేదార్ అరెస్టు

ఇటీవలే గం గం గణేశ సినిమా నిర్మాణం

దుబాయిలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు

అల్లు అర్జున్, విజయ దేవరకొండల సన్నిహితుడు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి/హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): టాలీవుడ్ యువ నిర్మాత కేదార్ సెలగంశెట్టి మంగళవారం దుబాయ్‌లో ఆకస్మికంగా మృతి చెందారు. ఇది సినీ వర్గాల నుంచి వస్తున్న సమాచారమే కానీ ఇంతవరకు అధికారికంగా ఎవరూ ధ్రువీకరించలేదు. ఆనంద్ దేవరకొండ హీరోగా ఇటీవల విడుదలైన గం గం గణేషా చిత్రం ఆయన నిర్మించిందే. టాలీవుడ్ సినీ ఫైనాన్షియర్ కుమారుడి వివాహానికి సంబంధించిన ప్రీ వెడ్డింగ్

మిగతా 9వ పేజీలో...





హెచ్‌ఐసీసీలో ప్రారంభమైన 'బయో ఏషియా 2025' సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివిధ కంపెనీల ప్రతినిధులు

# 5 లక్షల కొత్త ఉద్యోగాలు

**ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ఫార్మా క్లస్టర్లతో భారీ ఎత్తున ఉపాధి**

త్వరలో లైఫ్ సైన్సెస్ విధానం.. లైఫ్ సైన్సెస్ వర్సిటీ

పెట్టుబడులకు మరింత సులభతర విధానం అమలు

ఫార్మా, ఐటీ, డిజిటల్‌హెల్త్‌ల్లో పవర్‌హౌస్‌గా హైదరాబాద్

బయో ఏషియా-2025 ప్రారంభోత్సవంలో సీఎం

11ఫార్మా సంస్థలతో రూ.5400 కోట్ల ఒప్పందాలు

క్వీన్స్‌లాండ్ ప్రతినిధులతో రేవంత్, దుద్దిళ్ల భేటీ

**నొప్పిలేని, మెరుగైన, చౌక వైద్యం.. ఏఐతో సాధ్యం**

బయో ఏషియా చర్చాగోష్ఠిలో నిపుణులు

**ఊబకాయానికి టీకాతో చెక్?**

ఆటిజం, డౌన్ సిండ్రోమ్ పిల్లలకు 'విజన్ నానీ'..

బయో ఏషియా సదస్సులో పలు ఆసక్తికర ఆవిష్కరణలు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): "ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) మధ్య ఫార్మా క్లస్టర్స్ అభివృద్ధి చేస్తున్నాం. వాటి ద్వారా 5 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలను సృష్టించాలన్నది ప్రభుత్వ లక్ష్యం" అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. దేశంలోనే తొలిసారిగా.. త్వరలో తెలంగాణలో 'లైఫ్ సైన్సెస్ పాలసీ'ని తీసుకురానున్నట్టు ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు మరింత సులభతరమైన విధానం రూపకల్పన, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారిస్తామని మంగళవారం ఇక్కడ ప్రారంభమైన 'బయో ఏషియా 2025' సదస్సులో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ సదస్సు మంగళవారం నగరంలోని హెచ్‌ఐసీసీలో ప్రారంభమైంది. సీఎం రేవంత్

మిగతా 11వ పేజీలో..

11

### నేడు ప్రధాని మోదీతో సీఎం రేవంత్ భేటీ

ఆర్ఆర్ఆర్, మెట్రోలకు ఆర్థికసాయం ఎజెండా

పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల మీద కూడా..

రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్ పెంచుతూ రాజ్యాంగ సవరణ కోరే అవకాశం

ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై ఫోన్ చేసినపుడు మోదీ అపాయింట్‌మెంట్ కోరిన రేవంత్‌రెడ్డి

ఆ నేపథ్యంలోనే మోదీతో సమావేశం ఖరారు

ఎమ్మెల్సీ టికెట్లపై ఏఐసీసీ పెద్దలతోనూ భేటీ!

## బడిలో తెలుగుభాష.. ఇక నిక్కచ్చిగా అమలు

**1-10 వరకు అన్ని సిలబస్‌ల స్కూళ్లలో తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించాల్సిందే**

సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ బడుల యాజమాన్యాలతో భేటీలో ప్రభుత్వం స్పష్టీకరణ

9, 10 తరగతులకు సరళమైన తెలుగు పుస్తకం.. సింగిడి స్థానంలో వెన్నెల అమలుకు మెమో జారీ

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటిలో తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. విద్యార్థులకు తెలుగు భాషను తప్పనిసరి చేస్తూ తీసుకొచ్చిన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించింది. అన్ని బోర్డుల స్కూళ్లలో 2025-26 విద్యా సంవత్సరం



నుంచి ఒకటో తరగతి మొదలు 10వ తరగతి వరకు తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించాలని ఆదేశించింది. విద్యార్థులకు తెలుగు భాషపై పరీక్షలను కూడా నిర్వహించాలని తెలిపింది. విద్యార్థులు తెలుగు భాషను అభ్యసించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాలలను ఆదేశించింది. ఈ విషయంలో విద్యాశాఖ

మిగతా 9వ పేజీలో..

## ప్రచారానికి తెర.. ప్రలోభాల ఎర!

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్లు, పట్టభద్రులకు భారీగా డబ్బు పంపిణీ**

ఓటుకు రూ.5 వేల దాకా వెచ్చిస్తున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు!

'గ్రాడ్యుయేట్' ఓటర్లకు రూ.1000-2000 పంపకాలు?

రేపే పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు

కరీంనగర్/నల్లగొండ/నిజామాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగిసింది. హోరాహోరీగా సాగిన ప్రచారానికి మంగళవారం సాయంత్రంతో తెరపడింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి సభలు, సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలతో అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునే పనిలో

మిగతా 11వ పేజీలో..





**శివరాత్రికి** విద్యుత్ దీపకాంతుల్లో కీసరగుట్ట ఆలయం

## సర్వం సిద్ధం

కీసర, యాదగిరిగుట్టల్లో వైభవంగా కల్యాణోత్సవం

కొనసాగుతున్న కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

శివ నామస్మరణతో మార్మోగిన రాజరాజేశ్వరాలయం

మల్లెల తీర్థంలో జలపాతాల సందర్శన షురూ

ఈ నెల 28 వరకు అటవీశాఖ అనుమతి

కీసర/మహేశ్వరం, భువనగిరి అర్బన్, సిరిసిల్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని రాష్ట్రంలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. కీసరగుట్టలోని రామలింగేశ్వరాలయం, మహేశ్వరంలోని రాజరాజేశ్వరాలయం, యాదగిరిగుట్ట పైన శివాలయం, వేములవాడ రాజన్న, బీరంగూడ మల్లికార్జునుడు, ఝరాసంగం సంఘమేశ్వరుడు, షాద్‌నగర్

మిగతా 12వ పేజీలో...

## ఆశలు సన్నగిల్లి..

96 గంటలు గడిచినా అంతుచిక్కని సిబ్బంది ఆచూకీ

టన్నెల్‌లో పేరుకుపోయిన బురద.. ఉబికివస్తున్న ఊట

13.6 కి.మీ నుంచి 13.850 కి.మీ మధ్య మట్టి దిబ్బలే

వాటిని తొలగిస్తే మరో 50 మీటర్ల మేర టన్నెల్ కూలే ప్రమాదం.. సెగ్మెంట్ బ్లాకులకు పగుళ్లు

క్రాక్స్‌ను గుర్తించి, హెచ్చరించిన ర్యాట్ హోల్ మైనర్స్ 8

**బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలు మానాలి**

8 మందిని కాపాడేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తున్నాం

కాళేశ్వరం, శ్రీశైలంలో ప్రమాదాలపై మేం ఏమీ అన్లేదు

కట్టిన మూడేళ్లలోనే కాళేశ్వరం కూలిపోతేనే విమర్శలు చేశాం

ఎస్ఎల్‌బీసీ ద్వారా ఎలాంటి ఖర్చు లేకుండా 30 టీఎంసీలు

ఇది ఎదురుదెబ్బ మాత్రమే.. ప్రాజెక్టు పూర్తిచేస్తాం: ఉత్తమ్ 8



సొరంగంలో బ్యాటరీ లైటు వెలుగులో సిబ్బంది అన్వేషణ





## సీఎం రేవంత్‌కు కనీస అవగాహన లేదు

ఫోన్ ట్యాపింగ్ నిందితులను ప్రధాని నరేంద్ర మోదీ విమానంలో తీసుకొస్తారని అనుకుంటున్నారా?

ముఖ్యమంత్రికి పాలన అనుభవం లేక నవ్వుల పాలు

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వండి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): "ఫోన్ ట్యాపింగ్ నిందితులను ప్రధాని మోదీ ఏమైనా విమానంలో తీసుకువస్తారని రేవంత్‌రెడ్డి అనుకుంటున్నారా..? విదేశాల నుంచి ఒక వ్యక్తిని తీసుకురావాలంటే ఏం చేయాలో ఒక ఐపీఎస్ అధికారినో, న్యాయవాదినో అడిగే చెబుతారు. ఎప్పుడో మూడు

మిగతా 9వ పేజీలో...

**మాది ఇండియా టీం.. కాంగ్రెస్‌ది పాక్ టీం**

ఎమ్మెల్సీ ఎన్నికల మ్యాచ్‌లో పాక్‌ను చిత్తుగా ఓడిస్తాం 9

కేసీఆర్ కుటుంబాన్ని టచ్ చేసే దమ్ము లేదా?: బండి సంజయ్

## మోదీ ప్రభుత్వం ఫాసిస్టు కాదు!!

నయా-ఫాసిజం పోకడలు మాత్రమే ఉన్నాయి

ముసాయిదా రాజకీయ తీర్మానంలో సీపీఎం

దశాబ్దాల వైఖరి మార్చుకున్న మార్క్సిస్ట్ పార్టీ

డాక్యుమెంటు సవరించాలని సీపీఐ డిమాండ్

బీజేపీ-ఎల్‌డీఎఫ్ రహస్య పొత్తు: కాంగ్రెస్

ఆలస్యంగానైనా సీపీఎం గ్రహించింది: బీజేపీ

తిరువనంతపురం, ఫిబ్రవరి 25: కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని తీవ్ర నిరంకుశత్వ జాతీయవాద (ఫాసిస్టు) శక్తిగా పేర్కొంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడే సీపీఎం.. తన వైఖరి మార్చుకుందా? దానిపై ఫాసిస్టు ముద్ర వేసేందుకు నిరాకరిస్తోందా? ..అవునని తాజా పరిణామమే చెబుతోందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. మోదీ సర్కారుకు నయా-ఫాసిస్టు పోకడలు ఉన్నాయని పార్టీ ముసాయిదా తీర్మానంలో అంగీకరిస్తూనే.. ఫాసిస్టు ప్రభుత్వమని మాత్రం అనకుండా సీపీఎం ఆగిపోయింది. దీనిపై సోదర కమ్యూనిస్టు పక్షం సీపీఐ ఆగ్రహం వ్యక్తంచేయగా.. మార్క్సిస్ట్ పార్టీ ఏళ్లతరబడి

మిగతా 10వ పేజీలో...

### పదో తరగతి పరీక్షలు ఇక ఏటా రెండు సార్లు

ఫిబ్రవరిలో మొదటి విడత.. మేలో రెండో దఫా

రెండోవిడత పూర్తయ్యాకే సర్టిఫికెట్ల జారీ

సప్లిమెంటరీలుండవు.. సీబీఎస్ఈ ప్రతిపాదన

2026 నుంచి అమల్లోకి తెచ్చే యోచన

మార్చి 9 వరకు అభిప్రాయ సేకరణ 10

### కాలుష్య దేశాల్లో భారత్ టాప్- 3

తొలి రెండుస్థానాల్లో బంగ్లాదేశ్, పాకిస్థాన్

టాప్-10లో ఏకైక ఆసియాయేతర దేశం ఈజిప్టు

అత్యంత కాలుష్య నగరాల్లో మొదటి పది భారతదేశంలోనే

ఏక్యూఐ-2024 నివేదికలో వెల్లడి 10



### మరో భాషోద్యమం

కేంద్రం నిర్బంధ హిందీకి వ్యతిరేకంగా..

నియోజకవర్గాల పునర్విభజన.. తమిళనాడుపై వేలాడుతున్న కత్తి.. మార్చి 5న అఖిలపక్షం: స్టాలిన్ 10

### సిక్కుల ఊచకోత కేసు.. సజ్జన్‌కు యావజ్జీవం

కాంగ్రెస్ మాజీ ఎంపీకి ప్రత్యేక కోర్టు శిక్ష ఖరారు

ఉరి విధించాలని సిక్కుల డిమాండ్

న్యాయస్థానం ఆవరణలో ఆందోళన

ఇతర నిందితులైన జగదీశ్ టైట్లర్, కమల్‌నాథ్‌లపై కూడా చర్యలు తీసుకోవాలన్న ఢిల్లీ మంత్రి శిర్సా 10

### ఎల్ఆర్ఎస్ ఎవరూ కట్టొద్దు

అధికారంలోకొస్తే ఉచితంగా క్రమబద్ధీకరణ అన్నారు.. ఇప్పుడేమో ఫీజుల వసూళ్లు

చిన్నారెడ్డి వ్యాఖ్యపై ఈడీ, ఐటీ స్పందించదేం?

కాంగ్రెస్, బీజేపీయేతర అభ్యర్థుల్లో మంచి వ్యక్తికే ఓటేయండి

27న ఎస్ఎల్‌బీసీ వద్దకు బీఆర్ఎస్ బృందం

మీడియాతో ఇష్టాగోష్ఠిలో హరీశ్‌రావు 9

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# జర్మనీలో మార్పు

జర్మనీ ఓటర్లు మితవాదులను గెలిపించారు. వలసలు, మందగించిన ఆర్థికాభివృద్ధి, ఉక్రెయిన్ సంక్షోభం ప్రధాన అంశాలుగా ఆదివారం-నాడు బండేస్టాగ్ (పార్లమెంటు)కు జరిగిన ఎన్నికలలో మితవాద పక్షాలు అయిన సిడియు–సిఎస్‌యులకు 29 శాతం ఓట్లు రాగా కరడుగట్టిన మితవాద పక్షం ఎఎఫ్‌డి 21 శాతం ఓట్లతో ద్వితీయ స్థానంలో ఉన్నది. ఎన్నికలకు ముందు ఆపద్ధర్మ ప్రధానిగా ఉన్న ఒలాఫ్ షోల్జ్ నాయకత్వం-లోని సోషల్ డెమొక్రాటిక్ పార్టీకి కేవలం 16 శాతం ఓట్లు మాత్రమే లభించాయి. క్రిస్టియన్ డెమొక్రాటిక్ పార్టీ–క్రిస్టియన్ సోషల్ యూనియన్ కూటమి నాయకుడు ఫ్రీడిష్ మెర్జ్ ఎస్‌డిపి భాగస్వామ్యంతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశమున్నది. 'యూరోపియన్ దేశాలు అమెరికాపై ఆధారపడకుండా స్వతంత్రంగా వ్యవహరించగలిగేలా చేయడమే తన లక్ష్యమని' ఫలితాలు వెలువడిన అనంతరం మెర్జ్ ప్రకటించారు.

నయా నాజీ మూలాలు ఉన్న ఎఎఫ్‌డి, ఉదారవాద పార్టీ గ్రీన్స్, బిఎస్‌డబ్ల్యు, వామపక్ష పార్టీ డి లింకె లకు గతంలో కంటే ఓట్ల శాతం పెరుగుదల ప్రధానస్రవంతి క్రిస్టియన్, సోషల్ డెమొక్రాటిక్ పార్టీల పట్ల ఓటర్ల అసంతృప్తిని ప్రతిబింబిస్తోంది. యూరోపియన్ యూనియన్‌లో తమ భవిష్యత్తు విషయమై తూర్పు, పశ్చిమ జర్మనీ ప్రజల మధ్య, పేదలు–సంపన్నుల మధ్య పట్టణ–గ్రామీణ ప్రాంతాల ఓటర్ల దృక్పథాల మధ్య తేడాలు ఎంతగా ఉన్నాయో ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి.

సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో ఎఎఫ్‌డి సహకారాన్ని తీసుకోవడానికి మెర్జ్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు. ఓట్ల నిష్పత్తి ప్రకారం సిడియు–సిఎస్‌యు–ఎస్‌డిపిలకు బండేస్టాగ్‌లో 328 సీట్లు మాత్రమే లభిస్తాయి. 630 సీట్లుగల పార్లమెంటులో ఇది స్వల్ప మెజారిటీ మాత్రమే. సంకీర్ణ ప్రభుత్వ పార్టీలు తమ వాగ్దానాలను నెరవేర్చడంలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవలసిరావచ్చు. అటువంటి పరిస్థితులనే ఎఎఫ్‌డి ఆశిస్తున్నది. జర్మనీ చరిత్రలోని నాజీ గతాన్ని సమర్థించే ఈ పార్టీని 2013లో సిడియు విధానాలతో విభేదించిన ఆ పార్టీ ప్రముఖులు కొంతమంది ఏర్పాటు చేశారు. ఇటీవల ఈ పార్టీకి ప్రపంచ కుబేరుడు, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు ఎలాన్ మస్క్ బహిరంగంగా మద్దతునివ్వడం, అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ఎలీస్ వీడెల్‌తో సమావేశమై మద్దతునివ్వడం ఈ ఎన్నికలలో ఎఎఫ్‌డి ఓట్ల శాతం పెరుగుదలకు దోహదం చేశాయి. ఈ పార్టీకి ప్రధానంగా యువ వోటర్ల మద్దతు లభించడమే పరిశీలకులను కలవరపరుస్తోంది. తదుపరి పార్లమెంటరీ ఎన్నికలలో ఎఎఫ్‌డి ప్రథమ స్థానంలో నిలిస్తే జర్మనీ రాజకీయాలు పెనుమార్పులకు లోనవుతాయి. 'అవ్యవస్థకు నిగూఢ మార్గాలు జర్మన్లకు సుపరిచితమైనవ'ని తాత్త్వికుడు ఫ్రెడరిక్ నీషే అన్న మాటను ఎఎఫ్‌డి ఉత్థానం మరోసారి రుజువు చేస్తుందేమో?!

వలసకారులను నిరోధించేందుకు జర్మనీ సరిహద్దులను మూసివేయాలని, యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలగాలని వాదించే ఎఎఫ్‌డి లాంటి పార్టీ ప్రాబల్యం పెరగడం ఈయూ భవిష్యత్తుకు మేలు చేయదనే ఆందోళన జర్మనీలో బాగా వ్యక్తమవుతున్నది. అయినప్పటికీ పార్లమెంటరీ ఎన్నికలలో ఆ పార్టీ తన ఓట్ల శాతాన్ని అంతకంతకూ పెంచుకోవడం, అమెరికా పాలకులు ఆ పార్టీకి మద్దతునివ్వడం ఈయూకు తీవ్ర సవాళ్లను సృష్టించనున్నది.

'ఐరోపా హృదయం'గా ఫ్రెంచ్‌వారు సైతం గౌరవించే జర్మనీ వాతావరణ మార్పుపై పోరు, స్వచ్ఛ ఇంధనానికి పరివర్తన వ్యవహారాలలో ప్రపంచ నాయకురాలు. 2030 నాటికి హరిత గృహ వాయువుల ఉద్గారాన్ని 65 శాతం మేరకు తగ్గించుకోవడంలో గణనీయమైన పురోగతి సాధించిన దేశం జర్మనీ. అయితే ఈ ఆదర్శప్రాయమైన కార్యాచరణ 'క్లైమేట్ ఛాన్సలర్'గా పేరు పొందిన ఏంజెలా మెర్కెల్ హయాం అనంతరం మందగించింది. ఇటీవలి ఎన్నికలలో వాతావరణ మార్పునిరోధం అంశం పెద్దగా ప్రాధాన్యం పొందలేదు. ప్రజల అభిప్రాయాలలో మార్పును గమనించిన రాజకీయ పక్షాలు పర్యావరణ భద్రతను ఉపేక్షిస్తున్నాయి. ఎఎఫ్‌డి అయితే డొనాల్డ్ ట్రంప్ వలే వాతావరణ మార్పును ఒక మిథ్యగా భావిస్తోంది. అమెరికా మాదిరిగానే జర్మనీ కూడా పారిస్ ఒడంబడిక నుంచి వైదొలగాలని డిమాండ్ చేస్తోంది. వాతావరణ మార్పుపై పోరుకు పేద దేశాలకు 100 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయన్ని అందిస్తానన్న జర్మనీ మిగతా యూరోపియన్, ఇతర సంపన్న దేశాల వలే ఆ వాగ్దానాన్ని పూర్తిగా నెరవేర్చనేలేదు. నిధుల కొరతతో పాటు ప్రజల నుంచి వస్తోన్న వ్యతిరేకత కారణంగానే పర్యావరణ భద్రతను జర్మనీ ఉపేక్షిస్తోంది.

# సర్కారుకు ఆదాయ మార్గాలు ఇవీ!

గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక, అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు, ప్రకటించిన సంక్షేమ పథకాలు అమలు చేయడానికి అవసరమైన నిధులు సమకూర్చలేక ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నది. చివరకు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ప్రయోజనాలు, అలాగే వివిధ ప్రాజెక్టులకు ఇదివరకే ఖర్చుపెట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేని పరిస్థితుల్లో తగు ఆదాయ మార్గాలను వెతుకుతున్నది. ఈ నేపథ్యంలో ఈ క్రింది విధానాలపై దృష్టి పెట్టడం ద్వారా ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకోవచ్చు.

గతంలో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఇళ్లు నిర్మించుకుంటే కొన్నిసార్లు నోటీసులు ఇచ్చి, మరికొన్నిసార్లు నోటీసులు ఇవ్వకుండా ఇళ్లు కూల్చేవారు. అయినా అక్రమ నిర్మాణాలను అరికట్టకపోవడం, వాటిలో చాలామంది నిరుపేదలు, మధ్యతరగతి వారు ఉన్నందున గత ప్రభుత్వం 2014లో 125 గజాల లోపు అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో ఇల్లు నిర్మించుకుంటే ఉచితంగా అసైన్‌మెంట్ పట్టా సర్టిఫికెట్ జారీ చేసింది. అలాగే 125 గజాల పైన అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో భూ పట్టణ గరిష్ఠ పరిమితి చట్టం ప్రకారం మిగులు భూమిలో జూన్ 2, 2014 లోపు ఇళ్లు నిర్మించుకుంటే దాని విస్తీర్ణాన్ని బట్టి అప్పటి బేసిక్ వాల్యూలో నిర్ధారించిన పరిమితి ప్రకారం నగదును వసూలు చేశాక కన్వేయన్స్ డీడ్ ద్వారా క్రమబద్ధీకరించింది. ఈ దరఖాస్తుల గడువును ఎప్పటికప్పుడు పొడిగిస్తూ వచ్చింది. అయితే ఎన్నికల ముందు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో విలువైన భూములను మార్గదర్శకాలు ఉల్లంఘించి ఖాళీ స్థలాలను కూడా క్రమబద్ధీకరణ చేశారన్న ఆరోపణలతో కన్వేయన్స్ డీడ్స్ తదుపరి లావాదేవీలను నిలిపివేశారు. ప్రస్తుత ప్రభుత్వం వాటిపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలూ తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టింది. ఇప్పటికైనా ప్రభుత్వం వాటిపై దృష్టిపెట్టి క్రమబద్ధీకరణ చర్యలు చేపడితే రాష్ట్ర ఖజానాకు కోట్లాది రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అలాగే తిరస్కరించిన భూముల్ని స్వాధీనపరుచుకుంటే తిరిగి ఆక్రమణ గురయ్యే అవకాశం ఉండదు.



భూ పట్టణ గరిష్ఠ పరిమితి చట్టం కింద హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలోన్ని కొన్ని ప్రాంతాలు, వరంగల్ పట్టణ ప్రాంతంలో కొన్ని వేల చదరపు మీటర్ల స్థలాన్ని మిగులు భూమిగా స్వాధీనపరుచుకున్నారు. ఆ భూములు అప్పటికే థర్డ్ పార్టీ పొసెషన్‌లో ఉండడం, లేదా డిక్లరెంట్ పొసెషన్‌లో ఉండడంతో వాటిని ప్రాంతాల వారీగా, విస్తీర్ణం వారీగా నిర్ణీత ధరను నిర్ణయించి 2002లో జీఓల ద్వారా మార్గదర్శకాలను జారీ చేసి, చాలా విస్తీర్ణాన్ని క్రమబద్ధీకరించి, రాష్ట్ర ఖజానాకి ఆదాయం సమకూర్చారు. దీని గడువును కూడా ఎప్పటికప్పుడు పొడిగిస్తూ వచ్చారు. అయితే కొంతమంది దరఖాస్తుదారులతో నగదు కట్టించుకుని క్రమబద్ధీకరించకపోవడం, ఇంకా కొంతమంది నగదు కట్టకపోవడంతో ఎన్నో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ యూఎల్‌సీ చట్టం 2008లో కూడా రిపీట్ అయింది. అందువల్ల ఇప్పటికైనా ప్రభుత్వం సమీక్ష జరిపి, అటువంటి భూములకు మరొకసారి క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించడమో లేదా వాటిని తిరిగి స్వాధీనపరుచుకుని బహిరంగ వేలం వేయడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చు.

అసైన్డ్ భూముల విషయంలో కోర్టు కేసులపై ప్రస్తుత ప్రభుత్వం తగు దృష్టి పెట్టి అనుభవజ్ఞులైన సీనియర్ న్యాయవాదుల ద్వారా కేసు గెలిచే విధంగా ప్రయత్నాలు చేస్తే విలువైన భూములు ప్రభుత్వపరం అవుతాయి. ఒకవేళ ఆ భూములు థర్డ్ పార్టీ పొసెషన్‌లో ఉంటే నిబంధనల ప్రకారం నిర్ణీత ధర నిర్ణయించి క్రమబద్ధీకరించినా, లేదా బహిరంగ వేలం వేసినా కొన్ని వేల కోట్ల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అలాగే ధరణి పోర్టల్ ద్వారా పట్టా మార్చి, వాటిపై ట్రాన్సాక్షన్స్‌కు అవకాశం కల్పించిన భూములపై విచారణ జరిపి స్వాధీనం చేసుకోవాలి. ఇప్పటికే థర్డ్ పార్టీ పొసెషన్‌లో ఆ భూములు ఉంటే వాటిని నిర్ణీత ధరకు అర్హులైన వారికి క్రమబద్ధీకరించడం లేదా స్వాధీనం చేసుకుని వేలం వేయడం ద్వారా రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

అలాగే లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)ను పకడ్బందీగా అమలు చేసి, ఆ దరఖాస్తులను పరిష్కరిస్తే ఆదాయం సమకూరుతుంది. అలాగే ప్రభుత్వానికి, ప్రైవేట్ వ్యక్తుల మధ్య వివాదాలు, వివిధ కోర్టులలో పెండింగ్‌లో ఉన్నాయి. అలాంటి వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి న్యాయనిపుణులు, అనుభవజ్ఞులైన రెవెన్యూ అధికారులతో కమిటీ వేసి, తగు ఆధారాలను సేకరించి కోర్టులకు సమర్పిస్తే ఆ కేసులు గెలిచే అవకాశం ఉంది.

గతంలో వివిధ ఉద్యోగుల సొసైటీలకు, సంస్థలకు, ప్రభుత్వ భూమిని కేటాయించడమే కాకుండా స్వాధీనపరిచి, నిర్ణీత ధర నిర్ణయించకుండా (అలియనేషన్ ప్రక్రియ) పూర్తికాని కేసులపై కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి. అటువంటి వాటి వివరాలు సేకరించి సమీక్ష జరిపి తగు చర్యలు తీసుకుంటే కొంత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఈ విధంగా అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ భూములపై ఉన్నత స్థాయి కమిటీతో సమీక్ష జరిపి, తగు చర్యలు తీసుకుంటే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.

• సురేష్ పొద్దార్
విశ్రాంత సంయుక్త కలెక్టర్

# 'ఉక్కుచట్రం'కు అవినీతి తుప్పు!



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్


'రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదువా?' అన్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తలుచుకుంటే జరగనిది ఏమీ ఉండదని చెప్పవచ్చు. గత వారం ప్రధానమంత్రి తన కార్యాలయంలో రెండవ ప్రిన్సిపల్ సెక్రటరీగా శక్తికాంత దాస్‌ను నియమించారు. ఇలా ఒక ప్రిన్సిపల్ సెక్రటరీ ఉండగా మరొకరిని అదే హోదాలో నియమించడం ఇదే మొదటిసారి. శక్తికాంత దాస్‌ను ప్రధానమంత్రి కార్యాలయంలో నియమించడంలో పెద్ద ఆశ్చర్యం లేదు. రిజర్వు బ్యాంకుకు స్వతంత్ర ప్రతిపత్తిని ఆశిస్తూ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించిన రఘురామరాజన్, ఊర్జిత్ పటేల్ వంటి ఆర్థిక వేత్తలు ఎక్కువ కాలం రిజర్వు బ్యాంకు గవర్నర్ పదవిలో కొనసాగలేకపోయిన తర్వాత ప్రవేశించిన శక్తికాంత దాస్ తన శక్తివంచన లేకుండా ప్రభుత్వ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేసినందువల్లే ఆయన ఆరు సంవత్సరాలు రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా కొనసాగగలిగారు. అంతకు ముందు ఫైనాన్స్ సెక్రటరీగా ఆయన పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటి కీలక నిర్ణయాలకు కారకుడయ్యారు. ఈ రెండు నిర్ణయాల వల్ల మాత్రమే కాదు, కోవిడ్ వల్ల కూడా దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా ఆయనే చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. రిజర్వులను మళ్లించడం వంటి ప్రభుత్వ విధానాలపై పెద్దగా విభేదించకుండా, రిజర్వు బ్యాంకు బోర్డులో ఎవర్ని నియమిస్తున్నారన్న అంశాలపై దృష్టి కేంద్రీకరించకుండా జీడీపీ, ద్రవ్యోల్బణం, బ్యాంకులకు రుణాల ఎగవేత, నిరర్థక ఆస్తులు, భారీ ఎత్తున ప్రభుత్వ వ్యయం పెరగడం, పెరిగిపోతున్న ఆర్థిక లోటు మొదలైన అంశాలపై అంతగా ఆందోళన చెందకుండా, అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ పడిపోతున్నా చెక్కుచెదరకుండా 'ఎప్పటికెయ్యది ప్రస్తుతం' అన్నధోరణిలో వ్యవహరించినందువల్లే శక్తి కాంత దాస్ కేంద్రానికి అత్యంత సన్నిహితుడు అయ్యారు. ఐఏఎస్ అధికారుల్లో 'నొప్పించి తానొవ్వక' అన్నట్లు ప్రభుత్వ ఆలోచనా విధానానికి అనుగుణంగా పనిచేసినవారే విజయవంతం కాగలుగుతారు. అలాంటి వారిలో శక్తి కాంత దాస్ ఒకరని చెప్పక తప్పదు. ఇప్పుడు ఆయన ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలకు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు దిశా నిర్దేశం చేస్తారనడంలో సందేహంలేదు.

శక్తికాంత దాస్‌కు ముందు రిజర్వు బ్యాంకు గవర్నర్‌లుగా ఉన్న వై.వేణుగోపాల్ రెడ్డి, దువ్వూరి సుబ్బారావు, రఘురామరాజన్, ఊర్జిత్ పటేల్ బ్యాంకు స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడేందుకు తీవ్ర యత్నాలు చేశారు. పెద్ద నోట్ల రద్దు గురించి పార్లమెంటరీ కమిటీలో చర్చకు వచ్చినప్పుడు 'ఈ నిర్ణయం గురించి మీతో ప్రభుత్వం చర్చించిందా?' అని ఆ కమిటీ చైర్మన్‌గా ఉన్న కాంగ్రెస్ ఎంపీ వీరప్ప మొయిలీ ఊర్జిత్ పటేల్‌ను ప్రశ్నించారు. ఊర్జిత్ పటేల్ జవాబివ్వకముందే ఆ కమిటీలో సభ్యుడుగా ఉన్నమాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జోక్యం చేసుకుని 'ఈ ప్రశ్నకు మీరు సమాధానమివ్వనక్కర్లేదు' అని స్పష్టంగా చెప్పారు. తాను ఒక సంస్థగా రిజర్వు బ్యాంకు ప్రతిష్ఠను కాపాడేందుకే అలా చేశానని మన్మోహన్ సింగ్ వివరించారు. మన్మోహన్ సింగ్ కూడా ఒకప్పుడు రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా ఉన్నందువల్ల సంస్థ పరువు కాపాడాలని భావించారు. కాని సంస్థల పరువు ప్రతిష్ఠల గురించి ఇప్పుడెవరు పట్టించుకుంటారు?

ఎన్నికల రాజకీయాలకు అనుగుణంగా చర్యలు తీసుకునే ప్రభుత్వాధినేతలు ఉన్నంతవరకూ ప్రభుత్వానికి పెద్దగా ఆర్థికవేత్తలతో పని ఉండదు. ఆర్థికవేత్తలు ఆర్థిక సుస్థిరత గురించి ఆలోచిస్తారు. రిజర్వు బ్యాంకు సంస్థాగత స్వతంత్రత కోల్పోయిందని ప్రముఖ ఆర్థికవేత్త, రిజర్వు బ్యాంకు మాజీ చైర్మన్‌యాగా వేణుగోపాల్‌రెడ్డి ఒక సందర్భంలో ఆవేదన వ్యక్తపరిచారు. స్వతంత్రత అంటే ప్రభుత్వం నుంచి స్వతంత్రత కాదని, ప్రభుత్వ వ్యవస్థల్లో భాగంగా స్వతంత్రంగా వ్యవహరించాలనే నెహ్రూ నిర్వచనాన్ని అంగీకరించిన వేణుగోపాల్‌రెడ్డి ప్రపంచమంతా బ్యాంకింగ్ వ్యవస్థ సంక్షోభాన్ని ఎదుర్కొన్నా భారతదేశంలో పెద్దగా సమస్యలు లేకుండా చూశారు. రికార్డు స్థాయిలో మూడేళ్ల పాటు 9.5 శాతం జీడీపీని సాధించారు. ద్రవ్యోల్బణం 4.4 శాతం నుంచి 6.6 శాతం మధ్య ఉండేలా చూశారు.' అమెరికా సెంట్రల్ బ్యాంకుకు కూడా ఇలాంటి అధినేత ఉంటే మా ఆర్థిక వ్యవస్థ ఇంత గందరగోళంగా ఉండేది కాదు' అని ఆ దేశ ఆర్థికవేత్త జోసెఫ్ స్టిగ్లిజ్ సైతం వేణుగోపాల్‌రెడ్డిని ప్రశంసించారు. చిదంబరం, అరుణ్ జైట్లీ లాంటి వారితో కూడా స్పష్టంగా విభేదిస్తూ ఏది సరైనదో చెప్పగలిగిన వేణుగోపాల్‌రెడ్డి లాంటి ఐఏఎస్ అధికారులు చాలా అరుదుగా కనిపిస్తారు.

నిజానికి తమతో విభేదించినా అధికారులు సరైన విధంగా సలహా ఇస్తే స్వీకరించే ఉదాత్త వ్యక్తిత్వం గల నాయకులు కూడా రోజురోజుకూ తక్కువైపోతున్నారు. అంజయ్య హయాంలో సెక్రటరీగా ఉన్న యుబి రాఘవేంద్రరావుతో సమర్థులైన బృందాన్ని ఎన్టీఆర్ విశ్వాసంలోకి తీసుకుని తన ఆలోచనా విధానాలకు అనుగుణంగా పనిచేయించుకున్నారు. అధికారులు కూడా నిర్భయంగా ఆయన వద్ద తమ ఆలోచనలను పంచుకునేవారు. ఒక సమావేశంలో ఎన్టీఆర్ భారీ వార్షిక ప్రణాళిక కావాలనుకున్నారు. అందుకు అదనపు పన్నులు విధించాల్సి ఉంటుందని ప్రణాళికా బోర్డు డిప్యూటీ చైర్మన్‌గా ఉన్న విఠల్ చెప్పారట. ఎన్టీఆర్ అందుకు అంగీకరించలేదు. విఠల్ చేసిన సూచనలేవీ ఎన్టీఆర్‌కు నచ్చలేదు. 'విఠల్ గారూ, మీరు ప్రతిభాశాలి. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఆర్థిక నిపుణులు. మీరు కొత్త ఆలోచనలేవీ చెప్పలేరా.. లేదా ఎవరినైనా మంచి ఆలోచనలు చెప్పేవారిని సూచించండి' అని ఎన్టీఆర్ అడిగారు. 'అలా ఒక్కరే చేయగలరు..' అని విఠల్ అన్నారు. 'ఎవరాయన?' అని ఎన్టీఆర్ ఆశ్చర్యంతో అడిగారు. 'మీ వెనుకే ఉన్నారు చూడండి' అని అనేసరికి ఎన్టీఆర్ వెనక్కి తిరిగి చూశారట. వెనక గోడకు పటంలో వేంకటేశ్వరస్వామి మందహాసం చేస్తూ కనిపించారు! అలా ప్రధానమంత్రికి గానీ, ముఖ్యమంత్రులకు గానీ స్వేచ్ఛగా చెప్పగలిగిన అధికారులు ఎవరైనా ఉన్నారా?

రాజకీయ నాయకులు సరైన నిర్ణయాలు తీసుకునే విధంగా ఫైల్ నోట్స్ తయారు చేసి వివరించే అధికారులు తక్కువయిపోతున్నారని, పైగా తప్పులు చేసేందుకు నేతల్ని ప్రోత్సహించే అధికారులు ఎక్కువయిపోతున్నారని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక ఐఏఎస్ అధికారి ఆత్మకథను ఆవిష్కరిస్తూ వాపోయారు. శిక్షణా కాలంలోనే పంచాయితీలు చేసే అధికారులు కనపడుతున్నారని, ప్రజల్లోకి వెళ్లకుండా ఏసీ రూమ్‌లకే పరిమితమవుతున్నారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి అయినప్పటి నుంచీ ఎవరు సరైన అధికారులో తెల్సుకోవడం, అందులో ఎవరు పాత ప్రభుత్వానికి అనుగుణంగా పనిచేస్తున్నారో కనిపెట్టడం రేవంత్‌కు సమస్యగా మారినట్లు కనిపిస్తోంది. మరో వైపు ఏపీలో ఎంతో అనుభవం ఉన్న చంద్రబాబునాయుడు తన ఆలోచనా విధానానికి అనుగుణంగా పనిచేసే అధికారులను అన్వేషించేందుకు కొద్ది నెలల నుంచి ప్రయత్నిస్తున్నారు. వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న అయిదారు మంది సమర్థులైన అధికారులను రాష్ట్రానికి డిప్యూటేషన్‌పై పంపాల్సిందిగా ఆయన గత నవంబర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాసినా ఫలితం కనపడడం లేదు.




సర్దార్ పటేల్ చెప్పినట్లు సివిల్ సర్వీస్‌ను ఒక ఉక్కుచట్రంలా భావించడానికి ఇప్పుడు ఎంతమాత్రమూ వీల్లేదు. అధికార వ్యామోహం లేని, అవినీతికి పాల్పడని ఎస్ఆర్ శంకరన్, యుగంధర్, కె.ఆర్. వేణుగోపాల్, అశోక్ ఖేమ్కా లాంటి అధికారులు వేళ్లపై లెక్కపెట్టగల సంఖ్యలో అప్పుడప్పుడు తటస్థిస్తారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలనే పూర్తిగా వదుల్చుకోలేకపోతున్న మనకు అప్పటి వ్యవస్థలను వదిలించుకోవడం సాధ్యమా?

మోదీ కూడా తాను చెప్పినట్లు నడుచుకునే అధికారులకోసం అధికారంలో వచ్చినప్పటి నుంచీ అనేక ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. అందుకోసం ఆయన అవసరమైతే గుజరాత్ కేడర్ అధికారులపై కూడా ఎక్కువ ఆధారపడ్డారు. పికే మిశ్రా, శక్తికాంత దాస్ లాంటి వారు దొరకడం ఆయనకు కష్టమైపోయింది. అంతా ఐఏఎస్ అధికారులకే అప్పగించాలన్న ఆలోచన మోదీకి ఎప్పుడూ లేదు. కాని ఆయనకు కూడా ఐఏఎస్‌లపై ఆధారపడక తప్పడం లేదు. 'అంతా బాబూ (ఐఏఎస్)లే చేయాలా? ఐఏఎస్ అయితే ఎరువుల ఫ్యాక్టరీలు కూడా నడిపించగలుగుతారా, దేశాన్ని బాబులకు అప్పజెబితే మనమేం చేస్తాం..' అని ఒక సందర్భంలో మోదీ పార్లమెంట్‌లో వాపోయారు. అయినా ఐఆర్‌డిఏ, సెంట్రల్ ఎలెక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీ, ఎన్నికల కమిషన్, సివిసి వంటి అనేక సంస్థలను ఆయన ఐఏఎస్‌లకే అప్పగించారు. కాకపోతే ఐఆర్ఎస్‌లకు పెద్ద పీట వేస్తున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే రాజకీయ నాయకులకు దక్కాల్సిన కీలకమైన మంత్రిపదవులను కూడా ఆయన సివిల్ సర్వీసు నుంచి వచ్చిన అయిదారు మందికి అప్పగించారు. బాబులే అయితే విధేయంగా పనిచేస్తారని, నిబంధనలు విధించడం మాత్రమే కాదు, వాటిని ఎలా ఉల్లంఘించాలో అన్న విషయం కూడా వారికి తెలుసునని మోదీకి తెలియనిది కాదు. మోదీని మెప్పించే ఫైలును ఎలా తయారు చేయాలో అన్న కళను ఢిల్లీలో అధికారులు ఈ పదేళ్లలో క్రమంగా నేర్చుకున్నారు. క్రమంగా దేశ రాజధానిలో వ్యవస్థలు అణకువగా పనిచేయడం అలవాటు చేసుకున్నాయి.

ఐఏఎస్‌లు అవినీతిపరులా కాదా అన్నది పెద్దగా చర్చకు తావులేకుండా పోయింది. ఇటీవల ఒక ముఖ్యమంత్రి సేకరించిన అంతర్గత సమాచారం ప్రకారం అధికారులను సమర్థులు, అసమర్థులు, అవినీతిపరులుగా గుర్తించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే మూడో కేటగిరీలో అత్యధికులు ఉన్నారు. వారికే ఢిల్లీలో ఎక్కువ పలుకుబడి ఉన్నట్లు తేలింది. అధికారుల్లో అవినీతి గురించి తెలంగాణ సిఎం మాట్లాడకముందే రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తన ఆత్మకథలో 50 శాతం మంది ఐఏఎస్‌లు అసమర్థులని, 25 శాతం మంది సమర్థులని, మిగతా 25 శాతం పూర్తిగా అవినీతిపరులని రాశారు. సర్దార్ పటేల్ చెప్పినట్లు సివిల్ సర్వీస్‌ను ఒక ఉక్కుచట్రంలా భావించడానికి ఇప్పుడు ఎంతమాత్రమూ వీల్లేదు. అధికార వ్యామోహం లేని, అవినీతికి పాల్పడని ఎస్ఆర్ శంకరన్, యుగంధర్, కె.ఆర్. వేణుగోపాల్, అశోక్ ఖేమ్కా లాంటి అధికారులు వేళ్లపై లెక్కపెట్టగల సంఖ్యలో అప్పుడప్పుడు తటస్థిస్తారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలనే పూర్తిగా వదుల్చుకోలేకపోతున్న మనకు అప్పటి వ్యవస్థలను వదిలించుకోవడం సాధ్యమా?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

# న్యాయవాదుల నియంత్రణకే ఈ బిల్లు

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'అడ్వకేట్ ఎమెండ్‌మెంట్ బిల్లు 2025' బిల్లు పూర్తిగా అడ్వకేట్ల హక్కులను హరించే విధంగా ఉండడమే గాక న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని తీసివేసే విధంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం అడ్వకేట్లను తమ చెప్పుచేతల్లో ఉంచుకుంటూ, న్యాయ వ్యవస్థను నియంత్రించే ప్రయత్నంగా దీనిని చూడవచ్చు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్లుగా ముగ్గురు కేంద్ర ప్రభుత్వం నియమించేవారు ఉండాలనే సవరణ బార్ కౌన్సిల్ పైన కేంద్ర ప్రభుత్వ అజమాయిషీ కిందకే వస్తుంది. కేంద్ర ప్రభుత్వం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు సదరు చట్టంలోని నిబంధనలకు సంబంధించిన నియమాలను అమలు చేయాలని ఉత్తర్వులు ఇవ్వవచ్చును అనే సవరణ కూడా బార్ కౌన్సిల్ మీద కేంద్ర ప్రభుత్వ పెత్తనం కిందకే వస్తుంది. ఇవి అభ్యంతరకరం.




ఎవరైనా అడ్వకేట్‌కి మూడేళ్ళ శిక్ష పడి, హైకోర్టు గానీ సుప్రీంకోర్టు గానీ శిక్షను ఖరారు చేసినట్లయితే అతని బార్ కౌన్సిల్ సభ్యత్వం రద్దు అవుతుంది అనే సవరణ చాలా కఠినంగా ఉంది. ఇంతటి కఠిన నిబంధన ఇతర వృత్తులలో ఉన్నవారికి గానీ, రాజకీయ నాయకులకు గానీ లేకపోవడం గమనార్హం. అలాగే ఏ అడ్వకేట్ అయినా మూడేళ్ళ శిక్ష ఉన్న నేరాలలో శిక్ష పడినా లేదా విచారణ ఎదుర్కొంటున్నా, అతను బార్ కౌన్సిల్ మెంబరుగా పోటీ చేయడానికి అనర్హుడు అనే సవరణ అభ్యర్థుల పైన తప్పుడు కేసులు బనాయించడానికి అవకాశం కల్పించేదిగా ఉంది. ఇది బార్ కౌన్సిల్ ఎన్నికలలో హింసకు దారి తీస్తుంది. అడ్వకేట్స్ కోర్టులు బాయ్‌కాట్ చేయడం, కోర్టు వర్క్ చేయకుండా దూరంగా ఉండటం వంటివి చేయకూడదు అనే సవరణ పూర్తిగా అడ్వకేట్ల హక్కులకు భంగకరం, ప్రజాస్వామ్య విరుద్ధం.

అడ్వకేట్స్ బార్ అసోసియేషన్లు క్రింది కోర్టులలో అడ్వకేట్ల సమస్యల పరిష్కారానికి ఏర్పడిన స్వతంత్ర సంస్థలు. ఇప్పటికే వాటి ఎన్నికలను క్రమబద్ధీకరించే పేరుతో, అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ నియంత్రణ కోసం, బార్ అసోసియేషన్ల పైన బార్ కౌన్సిళ్ళు కొంత ఆధిపత్యం తీసుకున్నాయి. ఇప్పుడు ఈ అడ్వకేట్ ఎమెండ్‌మెంట్ బిల్లు సవరణల ద్వారా బార్ అసోసియేషన్లను పూర్తిగా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు. సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ పేరుతో ప్రతి ఐదేళ్ళకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ప్లేస్ ఆఫ్ ప్రాక్టీస్, సదరు అడ్వకేట్ రెగ్యులర్ ప్రాక్టీస్ చేస్తున్నాడా లేదా అని వెరిఫికేషన్... ఇవన్నీ అడ్వకేట్ల హక్కులను కాలరాచి అడ్వకేట్లను నియంత్రించే ప్రయత్నంగానే కనపడుతోంది. విదేశీ లా ఫర్మ్‌లను, విదేశీ లాయర్లను అనుమతించే అధికారం బార్ కౌన్సిల్ పరిధిలో కాకుండా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంచే ప్రయత్నం కూడా ఆమోదయోగ్యం కాదు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఇప్పటికే బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపింది. న్యాయవాదుల స్వతంత్రతను, హక్కులను, న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవడానికి ప్రతి బార్ అసోసియేషన్ పూనుకోవాలి. లేనిపక్షంలో న్యాయ వ్యవస్థ తన ఉనికిని కోల్పోతుంది.

– పి.పి. శాస్త్రి, అడ్వకేట్, ఏలూరు

# ఈ వలసల ఆరాటం ఏనాటిదో..!

పంతొమ్మిదవ శతాబ్దపు చివరి దశాబ్దాలకే అమెరికా 'ది న్యూ వరల్డ్' (కొత్త ప్రపంచం)గా ఆవిర్భవించింది. విశాలమైన భూభాగం, దినదిన ప్రవర్ధమానమౌతున్న పారిశ్రామిక రంగం; విస్తరించిన వ్యవసాయ, ఉత్పాదన రంగాలు; ఇబ్బడి ముబ్బడిగా వచ్చిపడుతున్న లాభాలు, పటిష్ఠమైన ప్రజాస్వామ్య ఉన్నత విద్యా వ్యవస్థలు, అపారమైన వ్యక్తి స్వేచ్ఛ, వేళ్లానుకుంటున్న ఆధునిక జీవనశైలి లాంటి అంశాల దృష్ట్యా అమెరికాను పాశ్చాత్య నాగరికతకు ప్రతీకగా, అవకాశాల పెన్నిధిగా యావత్ ప్రపంచం గుర్తించింది. ప్రపంచం నలుమూలల నుండి ప్రజలు అమెరికాకు వలసపోవడానికి ఉద్యుక్తులయ్యారు. వీరిలో శ్రామికులు, విద్యావంతులు, వ్యాపారులు, వ్యవసాయదారులు ఉండేవారు. అత్యధికులు ఉపాధి అవకాశాల కోసమే అక్కడకు వెళ్ళేవారు.

1790లో ఒక క్రైస్తవ మతబోధకుడితో మొదలైన భారతీయుల అమెరికా వలస పంతొమ్మిదవ శతాబ్దపు నడుమకల్లా పశ్చిమ తీరాన చిన్న చిన్న వ్యాపార స్థావరాల ఏర్పాటుతో ఊపందుకున్నది. వందల సంఖ్యలో పంజాబీలు, ముఖ్యంగా సిక్కులు వివిధ మార్గాలగుండా అమెరికా చేరుకునేవారు. 1910 కల్లా అధికారికంగా భారతీయుల సంఖ్య 3000కు చేరుకోగా అనధికారంగా అమెరికా పౌరులుగా చలామణి అయ్యేవారి సంఖ్య ఎన్నోరెట్లు అధికంగా ఉండేది.

ఆసియా ఖండం నుండి ప్రజల వలసలను నిరోధించడానికి 'ఆసియన్ ఎక్స్‌క్లూజన్ లీగ్' అనే సంస్థ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 'ఓరియంటల్ ఎక్స్‌క్లూజన్ ఏక్ట్ అఫ్ 1923' అనే చట్టాన్ని ప్రవేశపెట్టించింది. పెరుగుతున్న జపాన్ ప్రాబల్యం, పారిశ్రామిక ప్రగతిని 1897లో జాక్వెస్ నోవికోవ్ అనే రష్యన్ మేధావి 'ఎల్లో పెరిల్' (పసుపు ప్రమాదం)గా అభివర్ణించగా, రష్యాపై జపాన్ గెలుపు, అదే విధంగా జపాన్, చైనాల నుండి పెరుగుతున్న వలస నేపథ్యంలో 'ఎల్లో పెరిల్'కు మరింత ప్రాచుర్యం లభించింది. పాశ్చాత్య దేశాల అస్తిత్వానికి ఏషియన్లు ప్రమాదకారులన్న ఒక జాత్యహంకార భావన ఇది. వీరి నుండి తమ అవకాశాలకు ముప్పు వాటిల్లనుందని అభద్రతా భావంతో శ్వేతజాతి దురహంకార సంస్థలు జపనీయుల నివాస సముదాయాలపై భౌతిక దాడులు కూడా చేసేవారు. భారతీయులకు పౌరసత్వాన్ని నిరాకరించడానికి ప్రధాన ప్రాతిపదిక వారు తెల్లజాతివారు (కకెసియన్ తెగ) కాకపోవడమే. ఈ కారణంగా యూరోపియన్లకు సునాయాసంగా లభించే పౌరసత్వం భారతీయులకు గగనమయ్యేది.

అమెరికాలో న్యాయ పోరాటం చేసి ఆ దేశ పౌరసత్వాన్ని చేజిక్కించుకున్న మొట్టమొదటి భారతీయుడు భికాజీ బల్సారా. జొరాస్ట్రియన్ (పార్శి) అయిన బల్సారా 1900లో నూలు వర్తకునిగా అమెరికాలో అడుగుపెట్టాడు. న్యూయార్క్‌లో స్థిరపడి 1906లో పౌరసత్వానికై దరఖాస్తు చేసుకోగా అది తిరస్కారానికి గురైంది. అప్పటికి అమలులో ఉన్న దేశీయకరణ చట్టం, 1790, ప్రకారం కేవలం స్వతంత్ర శ్వేత జాతీయులే పౌరసత్వానికి అర్హులు. ఆ నిరాకరణను వలస దేశం నుండి వచ్చిన శ్వేతేతరుడైన బల్సారా న్యూయార్క్ సర్క్యూట్ కోర్టులో సవాలు చేస్తూ తాను పార్శీని గనుక శ్వేత (ఇండో యూరోపియన్ ఆర్య) జాతికే చెందుతానని వాదించాడు. ఈ ప్రాతిపదికపై అతనికి పౌరసత్వాన్ని ఇస్తే పెక్కుమంది ఆఫ్ఘన్లు, హిందువులు, అరబ్బులు కూడా పౌరసత్వానికి అర్హులవుతారని పేర్కొంటూ అతని వ్యాజ్యాన్ని కోర్టు కొట్టివేసింది. అయితే, బల్సారా ఉన్నత వ్యక్తిత్వం కలవాడని, ఆయన సర్క్యూట్ కోర్టుకు అప్పీల్ చేసుకోవచ్చునని సెలవిచ్చింది. సర్క్యూట్ కోర్టు 'శ్వేతజాతి' అంటే, నలుపు, పసుపు, గోధుమ వర్ణ సమూహాలకు చెందనిది కనుక పార్సీలను శ్వేతజాతిగా పరిగణిస్తూ బల్సారాకు 1909లో పౌరసత్వాన్ని ప్రసాదించింది.

అమెరికా పౌరసత్వానికై భారతీయుల ఆరాటాలూ పోరాటాలకు వందేళ్ళకు పైబడిన చరిత్ర ఉంది. 1965లో వచ్చిన ఇమ్మిగ్రేషన్ యాక్ట్ వలన తెరుచుకున్న అమెరికా ద్వారాలు లక్షల మందికి ప్రవేశాన్ని, ఉపాధిని కల్పించాయి. అగ్రరాజ్యంగా అమెరికా వెలుగొందుతున్నంత కాలం వలసలు కొనసాగుతూనే ఉంటాయి.



ఇక, అమృత్‌సర్ జిల్లాలో పుట్టి పట్టభద్రుడైన భగత్‌సింగ్ థీండ్ ఫిలిప్పైన్స్‌లో కొంత కాలం పనిచేసి మనీలా నుండి కష్టాలు పడి సముద్ర మార్గాన మిన్నెసోటా చేరుకున్నాడు. ప్రయాణం మధ్యలో ఆయన సోదరుడు మరణించాడు. గదర్ పార్టీ కార్యకలాపాలలో పాల్గొన్నందుకు బ్రిటిష్ ప్రభుత్వం ఈయనతో పాటు మరొక ఏడువేల మంది పంజాబీలపై నిఘా పెట్టింది. 1918లో ప్రథమ ప్రపంచ సంగ్రామంలో అమెరికన్ సైనికుడిగా వాషింగ్టన్‌లో సేవలందించినందుకు గాను థీండ్‌కు పౌరసత్వ ధ్రువీకరణ పత్రాన్ని 'క్యాంపు లూయిస్' జిల్లా కోర్టు ద్వారా ప్రభుత్వం అందించింది. కానీ థీండ్ హిందువు గనుక శ్వేత జాతి కింద పరిగణించలేమని అతని ధ్రువీకరణపత్రాన్ని 'బ్యూరో ఆఫ్ నేచురలైజేషన్' తృణీకరించింది. అప్పట్లో భారత ఉపఖండం నుండి వలస వెళ్లిన ముస్లిమేతరులందరూ హిందువులుగానే పరిగణింపబడేవారు. వెంటనే థీండ్ స్టేట్ ఆఫ్ ఒరెగాన్‌కు దరఖాస్తు చేయగా ఆయన విద్యార్హతలు, శ్వేతజాతి వారితో ఉన్న సత్సంబంధాలు, ఆయన ఉన్నత కులం (జాట్), ఆయన సత్ప్రవర్తన లాంటి అంశాలను చూపి, బ్యూరో ఆఫ్ నేచురలైజేషన్ అభ్యంతరాలనూ ఆయన బ్రిటిష్ వ్యతిరేక విద్రోహ చర్యలనూ సైతం తోసిపుచ్చి పౌరసత్వానికి అర్హుడిగా ప్రకటించింది. దీనిని కూడా బ్యూరో సుప్రీమ్ కోర్టులో సవాలు చేసి రద్దు చేయించింది. ఇదే సమయంలో డబ్భైకుంది భారతీయుల పౌరసత్వం రద్దయింది. అదే తరుణంలో మొదటి ప్రపంచ యుద్ధ వీరులందరికీ పౌరసత్వాన్ని ప్రసాదించవచ్చునన్న చట్టం అమలులోకి వచ్చి థీండ్‌కు పౌరసత్వం లభించింది. తన న్యాయ పోరాటం ఆద్యంతమూ థీండ్ తాను అగ్రకులానికి చెందిన ఆర్యుడిననే వాదిస్తూ వచ్చాడు.

అక్షయ కుమార్ మజుందార్ పౌరసత్వ వివాదం కూడా ఆసక్తికరమైనదే. కలకత్తా సమీపంలో ఒక కులీన బ్రాహ్మణ కుటుంబంలో 1881లో జన్మించిన మజుందార్ తత్వశాస్త్రం, ఆధ్యాత్మిక చింతనలో పరిపూర్ణ విజ్ఞానాన్ని సంపాదించాడు. క్రైస్తవాన్ని ఔపోసన పట్టిన ఆయన చైనా జపాన్లలో కొంతకాలం బోధించి 1904లో సీటెల్ చేరుకొని అమెరికాలో తన 'న్యూ థాట్' ఉద్యమాన్ని మేధావి వర్గంలోనికి చొచ్చుకుపోయేలా చేయగలిగాడు. హైందవ క్రైస్తవ భావజాలాన్ని మిళితపరిచి 'క్రిస్టియన్ యోగా'ను అమెరికన్ సమాజానికి పరిచయం చేసాడు. 1930లో ముద్రితమైన ఈయన గ్రంథం 'ది హిందూ హిస్టరీ' ప్రజాదరణ పొందింది. మజుందార్ దేశ స్వాతంత్ర్యాన్ని కాంక్షించేవాడు. ఈయన కూడా బల్సారా, థీండ్‌ల వలె తాను హైందవ సమాజంలో అత్యున్నత స్థాయి కులానికి చెందినవాడిని గనుక ఆర్యుడిగా (కకెసియాన్) పరిగణించాలని స్పోకేన్ జిల్లా కోర్టును ఒప్పించి పౌరసత్వాన్ని పొందాడు. అయితే థీండ్ పౌరసత్వ విషయంలో సుప్రీమ్ కోర్టు తీర్పు ఆధారంగా మజుందార్ పౌరసత్వం రద్దు చేయబడింది. 1946లో తూర్పు భారతదేశం నుండి వలస వచ్చిన వంద మందికి పౌరసత్వ అర్హతను కల్పిస్తూ అమలులోనికి వచ్చిన ల్యూస్ సెల్లర్ చట్టం కింద మజుందార్ 1950లో అమెరికా పౌరుడు కాగలిగాడు.

అమెరికా పౌరసత్వానికై భారతీయుల ఆరాటానికి వందేళ్ళకు పైబడిన చరిత్ర ఉంది. ఇక, 1965లో వచ్చిన ఇమ్మిగ్రేషన్ యాక్ట్ వలన తెరుచుకున్న అమెరికా ద్వారాలు లక్షల మందికి ప్రవేశాన్ని, ఉపాధిని కల్పించాయి. అక్కడి విలాసవంతమైన ఆధునిక జీవన శైలి, అవకాశాలు, అవినీతిరహిత సమాజం, పటిష్ఠమైన ప్రభుత్వ యంత్రాంగం, స్వేచ్ఛ, వినిమయ సంస్కృతి ఆ దేశాన్ని ఆకర్షణీయమైన గమ్యంగా నిలిపాయి. అగ్రరాజ్యంగా అమెరికా వెలుగొందుతున్నంత కాలం వలసలు కొనసాగుతూనే ఉంటాయి.


■ ప్రొ. కొట్టు శేఖర్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
బుధవారం 26 ఫిబ్రవరి 2025




విద్యుత్ దీప కాంతుల్లో వేయిస్తంభాల ఆలయం

# ఓం నమః శివాయ



మెట్టు రామలింగేశ్వరాలయం

## నేడు మహాశివరాత్రి పర్వదినం

- ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆలయాలు, శైవక్షేత్రాలు ముస్తాబు
- అభిషేకాలు, హోమాలు, జాగరణకు ఏర్పాట్లు పూర్తి
- భక్తుల కోసం చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు
- పూలు, పండ్లు, పూజాసామగ్రి అమ్మకాలతో మార్కెట్‌లో సందడి

వివరాలు 5లో..

ముక్కంటి వేడుకలకు సర్వం సిద్ధమైంది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని శివాలయాలు, శైవక్షేత్రాలు ఆ పరమ శివుడి నామస్మరణతో మారుమోగనున్నాయి. శివరాత్రి వేడుకల్లో పలు ప్రత్యేక పూజలతో పాటు శివపార్వతుల కల్యాణాన్ని కన్నులపండుగ్గా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాత్రికి భక్తులు జాగరణ చేసేందుకు వీలుగా ప్రత్యేకంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనుండగా.. ఆ లయకారుడి దర్శనానికి తరలొచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం సౌకర్యాలను కల్పించింది. ముఖ్యంగా త్రినగరిలోని వేయిస్తంభాల గుడి, సిద్దేశ్వరాలయం, మెట్టు రామలింగేశ్వరాలయంతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఐనవోలు మల్లికార్జున దేవస్థానం, రామప్ప, కాళేశ్వరం ముక్తీశ్వరాలయం, కురవి వీరభద్రుడి క్షేత్రం తదితర ఆలయాలు, శైవక్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. మరోవైపు పూలు, పండ్లు, ఇతర పూజాసామగ్రి కొనుగోళ్లతో మార్కెట్‌లో సందడి కనిపిస్తుండగా.. డిమాండ్ తగినట్టుగా కొబ్బరికాయల దిగుబడి, దిగుమతి లేకపోవడంతో వ్యాపారులు ధరలను పెంచి విక్రయిస్తుండటంతో సాధారణ భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.



# మిర్చి రైతులను ఆదుకోవాలి

రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు

- క్వింటాకు రూ.25వేలు చెల్లించాలి
- నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి
- ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించాలి
- లేదంటే రైతుల పక్షాన పోరాడతాం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- బీఆర్ఎస్ నేతలతో కలిసి ఏనుమాముల మార్కెట్ సందర్శన

4

# ప్రధాని మోదీ గుప్పిట్లో రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం

- కేసీఆర్, జగన్ అసెంబ్లీకి రాకుంటే ప్రజా తీర్పును అవమానించడమే..
- చంద్రబాబుకు సంకెళ్లు కట్టి బీజేపీ జైలులో వేశారు..
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

4



మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ నేత డాక్టర్ నారాయణ



# ప్రచారానికి తెర.. ప్రలోభాలతో ఎర..

- ముగిసిన టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
- సామాజిక మాధ్యమాల్లో అభ్యర్థుల హోరు



వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 4 గంటలకు ముగిసింది. ఇక 27వతేదీ గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటలవరకు పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో ప్రచారాలను ముగించుకున్న అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. బీజేపీ నేరుగా తమ అభ్యర్థిని ప్రకటించడంతో బీజేపీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. కాంగ్రెస్, బీఆర్ ఎస్ అభ్యర్థులెవరికీ మద్దతు ప్రకటించక పోవడంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కనిపించలేదు. సాధారణ ఎన్నికలకు ఏమాత్రం తీసిపోని రీతిలో అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని, ఇందుకోసం తమ అనుయాయులను రంగంలోకి దించినట్టు తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 11,189 మంది టీచర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 72 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రచారం ముగియడంతో అభ్యర్థులు ఓటర్లనే ప్రసన్నం చేసుకునేందుకు అవకాశం ఉన్న అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. డబ్బు, మద్యం పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలిసింది. ఓ అభ్యర్థి ఓటర్లకు నేరుగా ఫోన్ చేసి రూ.1500 ఇస్తా.. తనకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నట్లు పంతుళ్ల ప్రచారం చేస్తున్నారు. ఇక మరో అభ్యర్థి ఓటుకు రూ.5 వేలు ఇస్తున్నారని ప్రచారం జరుగుతోంది. మరికొంత మందికి నేరుగా ఖరీదైన మద్యం బాటిళ్లను ఓటర్ల ఇళ్ల వద్దకే పంపిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

### సామాజిక మాధ్యమాలే ప్రచారాస్త్రాలు

ఈ సారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులంతా సామాజిక మాధ్యమాల్లో ప్రచారాన్ని హోరెత్తించారు. వాట్సాప్ గ్రూపుల్లో సందేశాలు, సంక్షిప్త సందేశాలు, ఫేస్‌బుక్, యూట్యూబ్ ప్లాట్‌ఫాముల్లో ప్రచారాలు నిర్వహించారు. ఐవీఆర్ వాయిస్ కాల్స్‌తోతో పాటు హామీలను వివరిస్తూ పాటలను రూపొందించుకొని ఓటర్లను ఆకట్టుకునేప్రయత్నం చేస్తున్నారు.







# ఎమ్మెల్సీ ఎన్నికకు పటిష్ఠ బందోబస్తు

49 కేంద్రాల్లో 23 సమస్యాత్మకంగా గుర్తింపు ● మద్యం షాపులు మూత



మద్యం షాపులకు తాళాలు వేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హ నుమకొండ, జనగామ జిల్లాల్లో 49 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా ముంద స్తు చర్యలు చేపట్టారు. అయితే 49 కేంద్రాల్లో 23 పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి వాటిపై నిఘా పెట్టారు. ప్రతీ సమస్యాత్మక కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందితో పాటు ఒక ఎస్సై ఉండనున్నారు. 16 రూట్లు, 39ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశారు. జనగామలో 4, హనుమకొండ 6, వరంగల్ 6 రూట్లు ఏర్పాటు చేయగా, హనుమకొండలో-8, వరంగల్‌లో- 15 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఇక ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు రోజులు పాటు మద్యం షాపులను బంద్ చేస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. 25న సాయంత్రం 4 గంటల నుంచి 27 సాయంత్రం 4 గంటల వరకు మద్యం షాపులు బంద్ చేయాలని ఎన్నికల అధికారులు ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకే తాళాలు వేశారు. రెండు రోజులు మద్యం విక్రయాలు జరగకుండా నిఘా పెట్టనున్నారు. నిబంధనలు ఉల్లంఘించి మద్యం అమ్మితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నారు.







# వేసవికాల రక్షణ ఏర్పాట్లను పూర్తి చేయాలి

- ఆరోగ్య ఉప కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవికాలం దృష్ట్యా సంబంధిత శాఖల అధికారులు ప్రజలను వడగాలుల నుంచి అప్రమత్తం చేయడంతో పాటు ఆయా శాఖల ఆధ్వర్యంలో రక్షణ ఏర్పాట్లను చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఆరోగ్య ఉపకేంద్రాలలో 500వరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలన్నారు. ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రాంతాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, తాగునీటి షెడ్‌నెట్‌లనరు ఏర్పాటు చేయాలన్నారు. నగర పరిధిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆరోగ్య సంరక్షణ సూత్రాలను తెలిపే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులకు తెలిపారు. అనంతరం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వడగాలుల నుంచి సంరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రాలను కలెక్టర్ ప్రావీణ్య ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, అడిషినల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు, అడిషినల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయ్‌కుమార్‌తో పాటు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తల్లిని వేధిస్తున్నాడని తండ్రి హత్య

- కత్తితో పొడిచి చంపిన కుమారుడు
- ఐనవోలు మండలం పున్నేలులో ఘటన



మృతుడు మామునూరు భాస్కర్ (ఫైల్)

ఐనవోలు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన తండ్రి నిత్యం తన తల్లిని వేధిస్తుండడంతో కోపోద్రిక్తుడైన కుమారుడు కత్తితో పొడిచి చంపిన సంఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. పున్నేలుకు చెందిన ఆటో డ్రైవర్ మామునూరు భాస్కర్(50), జయమ్మ దంపతులకు అన్వేష్, అరుణ్ ఇద్దరు కుమారులున్నారు. అన్వేష్ వివాహమైంది. అన్వేష్ ఆటో నడుపుతుండగా, అరుణ్ ఇంటివద్దే ఉంటున్నాడు. ముగ్గురు కూడా ఒకే ఇంట్లో ఉంటున్నారు. తండ్రి భాస్కర్ కొంత కాలంగా మద్యానికి బానిసై రోజూ మద్యం తాగి వచ్చి భార్య జయమ్మను బూతులు తిడుతూ కొడుతుండేవాడు. సోమవారం రాత్రి 9 గంటలకు మద్యం తాగి వచ్చిన భాస్కర్.. తన భార్యతో గొడవపడుతుండగా అక్కడే ఉన్న ఇద్దరు కుమారులు గొడవను అపే ప్రయత్నం చేశారు. ఇద్దరు కుమారులను తిడుతూ మీ అంతుచూస్తానని కోపోద్రిక్తుడయ్యాడు.

ఈ క్రమంలో చిన్న కుమారుడు అరుణ్ అవేశానికిలోనై ఇంట్లో ఉన్న కత్తిని తెచ్చి తండ్రి ఛాతిలో ఎడుమవైపు బలంగా పొడిచాడు. దీంతో భాస్కర్ కింద పడిపోయాడు. తీవ్ర రక్తస్రావం జరుగుతుండగా బంధువుల సహాయంతో వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. అమ్మను నాన్న ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కోపంతో తన తమ్ముడు కత్తితో పొడవడంతో తన తండ్రి మృతిచెందినట్లు అన్వేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# మిర్చి రైతులను ఆదుకోవాలి

- క్వింటాకు రూ.25వేలు చెల్లించాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- బీఆర్‌ఎస్ నేతలతో కలిసి ఏనుమాముల మార్కెట్ సందర్శన


మీడియాతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని, గండ్ర

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మిర్చి పంటకు క్వింటాకు రూ.25వేల మద్దతు ధర చెల్లించి రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిర్చి ధరలు పడిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారని తెలుసుకున్న బీఆర్‌ఎస్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నేతృత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్, ముఖ్య నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్లు, చింతం సదానందం తదితరులు మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి యాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడి మిర్చి ధర పెంచేందుకు కృషి చేస్తామన్నారు. మార్కెట్లలో మిర్చి రైతులు ఇబ్బందులు పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నాడని, ఎలక్షన్ల ప్రచారం అంటూ తిరుగుతున్నాడని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ రైతులకే ప్రాధాన్యం ఇచ్చేవారని, అందుకే దక్కులు దున్నేటప్పుడే రైతుబంధు ఇచ్చేవారని, రైతులకు 24 గంటల ఉచిత కరెంటు, కాలువల ద్వారా 365 రోజులు పంటలకు నీళ్లు అందించేవారని గుర్తుచేశారు. మాయ మాటలు చెప్పి రేవంత్ రెడ్డి సీఎం అయ్యాడని, ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కాడని విమర్శించారు. ఇప్పటివరకు ఎక్కడా రైతుబంధు కాని, రుణమాఫీ కాని పూర్తిస్థాయిలో చేయలేదన్నారు. గత ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు మార్కెట్ల చుట్టూ తిరిగి రైతులకు మద్దతు ధర వచ్చేటట్లు చూసేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం 15రోజుల నుంచి మిర్చి రైతులు ఆందోళన చెందుతుంటే.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే మిర్చి రైతులకు అన్యాయం జరుగుతోందని, ఇప్పటికైనా ఆ పార్టీల నాయకులు స్పందించి మిర్చి రైతులకు న్యాయం చేయాలని, లేదంటే రైతుల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో మిర్చి రూ.30వేల నుంచి లక్ష రూపాయలు పలికేదని, ఇప్పుడు తొమ్మిది, పది వేలే పలుకుతోందని, దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రూ.25వేల చొప్పున నాఫెడ్, మార్క్‌ఫెడ్‌తో కొనుగోలు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో మిర్చికి రూ.15వేలు చెల్లిస్తామని చెప్పి.. ఇపుడు తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు. మిర్చిని ఇతర దేశాలకు ఎగుమతి చేసే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే గిట్టుబాటు ధర లేక రైతులు, ఎగుమతులు లేక వ్యాపారులు, పని లేక కార్మికులు రోడ్డున పడుతున్నారని అన్నారు. పదేళ్ల కిందటినాటి ధరలే ఇప్పుడు ఉన్నాయని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ఒక్కరోజు కూడా మంత్రులు, ఎమ్మెల్యేలు మార్కెట్లను సందర్శించిన దాఖలాలు లేవని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం కనిష్ఠ ధర రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.



## ఘాటు పర్యటన..

మిర్చి పంటకు మార్కెట్‌లో సరైన ధర రావడం లేదని, ఫలితంగా రైతులు నష్టపోవాల్సి వస్తోందని.. వారి కష్టాలు, నష్టాల గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ బీఆర్‌ఎస్ నేతలు 'ఘాటు' విమర్శలు చేశారు. మంగళవారం ఏనుమామల మార్కెట్‌ను సందర్శించిన వారు రైతుల సాదకబాధకాలను తెలుసుకున్నారు. అయితే మార్కెట్‌కు మిర్చి పోటెత్తడం, పంట తొక్కుడు కారణంగా మిర్చి ఘాటు లేచి.. నాయకులు, వారితో పాటు వచ్చిన కార్యకర్తలు ఉక్కిరిబిక్కిరయ్యారు. తుమ్ములు, దగ్గుతో సతమతమయ్యారు. ఇబ్బంది పడుతూనే తమ పర్యటన కొనసాగించిన నేతలు.. మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

---

### ఎన్నికల్లో ధన ప్రవాహానికి
# అడ్డుకట్ట వేయాలి

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

వడ్డేపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ధన ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఉద్యమనేత పన్నాల గోపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పట్టం కట్టాలని ఉపాధ్యాయ, అధ్యాపకులకు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్నాల గోపాల్‌రెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తారని చెప్పారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ధన ప్రవాహానికి తలొగ్గకుండా తనకు ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులను కోరారు. ఈ సమావేశంలో టీజేఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు చిల్లా రాజేంద్రప్రసాద్, గూడబోయిన నాగేశ్వర్‌రావు యాదవ్, శ్రీరామ్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# ప్రధాని మోదీ గుప్పిట్లో రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం

- కేసీఆర్, జగన్ అసెంబ్లీకి రాకపోవడం ప్రజా తీర్పును అవమానించడమే..
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కె.నారాయణ

న్యూశాయంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ గుప్పిట్లో రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడారు. రాజకీయ పార్టీలపై కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం రోజురోజుకూ పెరిగిపోతుందని, ఇది దేశానికి, సమాజానికి ఎంతో ప్రమాదకరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కార్పొరేట్ శక్తులు బలపడుతూ రాజకీయాలను శాసిస్తున్నారని, అమెరికాలో ఎలాన్ మస్క్, ఇండియాలో అదానీ ఒక్కటవుతున్నారన్నారు. కార్పొరేట్ శక్తులు ప్రజలకు సేవ చేయరని, వారికి లాభం ఒక్కటే లక్ష్యమన్నారు. ప్రపంచంలో అమెరికా ఇతర దేశాలపై ఆధిపత్యం చెలాయించాలనుకోవడం, కమ్యూనిస్టు దేశాలను బలహీనపరచడం చేసినట్లుగానే మనదేశంలో ప్రధాని మోదీ తమ మాట వినని వారిపై రాజ్యాంగ సంస్థలతో దాడి చేయించి దారికి తెచ్చుకుంటున్నారన్నారు. మోదీ పాలనలో గజ దొంగలను, దోపిడీ దారులను వెనకేసుకురావడం వలన మొత్తం వ్యవస్థ దెబ్బతిందన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఒకటే ప్రభుత్వం ఉంటే డబుల్ ఇంజన్ సర్కారులా అభివృద్ధి జరుగుతోందని మోదీ చెప్పారని, మరి మణిపూర్‌లో, కేంద్రంలో ఒకే ప్రభుత్వం ఉన్నా ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నించారు.

గతంలో మోదీ పాలన బాగుంటే 303 సీట్ల నుంచి 242 సీట్లకు ఎందుకు తగ్గారని ప్రశ్నించారు. దేశంలోనే ఏ ప్రధాన మంత్రికి రానంత తక్కువ మెజారిటీతో మోదీ గెలిచారన్నారు. చంద్రబాబునాయుడు, నితీష్‌కుమార్‌లను లొంగదీసుకుని ప్రభుత్వం ఏర్పాటు చేశారన్నారు. మొన్న జరిగిన ఢిల్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఇచ్చిన లిక్కర్ కుంభకోణం డబ్బును తీసుకుని ఆప్ ఓడిపోయిందని, ఆ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, ఆప్ కలవకుండా మోదీ ఆప్‌ను బ్లాక్ మెయిల్ చేశారన్నారు. నేడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోను ఇలాంటి బ్లాక్ మెయిల్ రాజకీయాల ద్వారా పార్టీలను బీజేపీ గుప్పిట్లో పెట్టుకుందన్నారు. చంద్రబాబుకు సంకెళ్లు కట్టి బీజేపీ జైలులో వేశారన్నారు. తెలంగాణలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేయడం వల్లే నిధులు లేక కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతోందన్నారు. రాష్ట్రంలో కూడా అన్ని రకాల వ్యవస్థలను బీఆర్‌ఎస్ చెడగొట్టిందన్నారు. కేసీఆర్, జగన్ అసెంబ్లీకి రాకుంటే ప్రజా తీర్పును అవమానించడమే అవుతుందని, కాబట్టి వీరిద్దరూ రాజకీయ సన్యాసం తీసుకుంటే మంచిదని సలహా ఇచ్చారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటేనని, అందువల్ల తాము అప్పుడే వాటికి వ్యతిరేకంగా నిలబడిన కాంగ్రెస్‌ను విమర్శించబోమన్నారు. బీజేపీ ప్రజావ్యతిరేక పాలనపై కేసీఆర్ నోరు మెదపకపోవడంలో అంతర్యమేమిటో చెప్పాలన్నారు. తమకు రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులున్నా.. ప్రజల కోసం పోరాడుతామని, కమ్యూనిస్టుల పునరేకీకరణకు కృషి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో జరిగిన కులగణనను స్వాగతిస్తున్నామని, దాని వలన రాజకీయాలలో గుత్తాధిపత్యం పోతుందని, కులగణన వలన రాజకీయాల్లో పెనుమార్పులు వస్తాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఐకి రెండు ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని ఎన్నికల పొత్తులో భాగంగా మాట ఇచ్చిందని, దానికి కట్టుబడి ఉండాలన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఐ జిల్లా నాయకులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మీ, మద్దెల ఎల్లేష్, కొట్టెపాక రవి తదితరులు పాల్గొన్నారు.

---

# కమ్యూనిస్టులు ఏకం కావాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- నగరంలో ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు



వరంగల్ నగరంలో ర్యాలీగా వెళ్తున్న సీపీఐ నాయకులు

వరంగల్ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో కమ్యూనిస్టులు ఏకం కావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) 100వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇస్లామియా కాలేజీ నుంచి వరంగల్ అబ్బాస్ ఫంక్షన్ హాల్ వరకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఎర్ర జెండాలు పట్టుకొని నినాదాలు చేసుకుంటూ భారీ ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కె.నారాయణ మాట్లాడుతూ.. సీపీఐది త్యాగాలు, పోరాటాల చరిత్ర అని అన్నారు. దేశంలో కమ్యూనిస్టులు బలపడాల్సిన అవసరం ఉందన్నారు. ఓట్లు, సీట్లు, ఎత్తుల చిత్తుల ప్రలోభాలకు లొంగకుండా రాగద్వేషాలకు, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా పోరాడుతున్నది కేవలం సీపీఐ మాత్రమేనన్నారు. దేశంలో రాజకీయాలు కార్పొరేట్ వర్గాల చేతుల్లో ఉన్నాయని, పెట్టుబడిదారి వర్గ మతోన్మాద పార్టీలైన బీజేపీ అదాని, అంబానీలకు ఊడిగం చేస్తున్నాయని అన్నారు. అలాంటి పార్టీల మెడలు వంచడం కేవలం ఎర్రజెండాతోనే సాధ్యమన్నారు. ఏడు జన్మలెత్తినా మోదీ, అమిత్‌షా పేదల ఉద్యమాలను అణిచివేయలేరని స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మావోయిస్టులు తమ పద్ధతులను మార్చుకోవాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో కమ్యూనిస్టులతో కలిసి పోరాటాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయసారథి, నాయకులు కర్రె భిక్షపతి, టి.వెంకట్రాములు, పంజాల రమేష్, వలీఉల్లాఖాద్రీ, షేక్ బాషుమియా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

---

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో
# బీసీ అభ్యర్థులను గెలిపించాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణగౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న బైరి రవికృష్ణ గౌడ్

కాజీపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవి కృష్ణగౌడ్ కోరారు. కాజీపేట ఫాతిమా నగర్ వైష్ణవి గ్రాండ్ హోటల్‌లో మంగళవారం బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో రవి కృష్ణ గౌడ్ హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి అగ్రవర్ణాలు బీసీల హక్కులను దోచుకుంటున్నారన్నారు. బీసీల హక్కుల గురించి పోరాడుతున్నామని చెప్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న బీసీ అభ్యర్థులకు మద్దతివ్వాలని కోరారు. బీసీ వాదాన్ని, బీసీ గలాన్ని శాసనమండలిలో వినిపించాలంటే బీసీ అభ్యర్థులను గెలిపించాలని బీసీ ఉపాధ్యాయులకు, బీసీ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్, బచ్చు ఆనంద్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మజదేవి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శోభారాణి, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం. అరుంధతి, నాయకులు బి. యాదగిరి గౌడ్, జి.శ్రీనివాస్, కె.అశోక్, తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలి

వడ్డేపల్లి: ఉపాధ్యాయ, అధ్యాపక ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలు తమ సత్తా చాటి బీసీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని తెలంగాణ బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ కూరపాటి రమేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందా మల్లయ్య, రాష్ట్ర సెక్రటరీ మండల పరశురాములు పిలుపు నిచ్చారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జనాభాలో 10 శాతం కూడా లేని అగ్రవర్ణాలు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా ఎన్నికవుతూ 56 శాతం ఉన్న బీసీలను అణగదొక్కుతున్నారని దుయ్యబట్టారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న జరిగే వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి శాసన మండలికి పంపించాలని ఉపాధ్యాయ, అధ్యాపకులను వారు కోరారు. సమావేశంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం జిల్లా నేతలు జంగిలి శ్రీనివాస్, పెండ్యాల సంపత్‌కుమార్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కూరపాటి రమేష్, చందా మల్లయ్య, మండల పరశురాములు

---

# కేయూలో 'అకూట్' ఎన్నికల సందడి

- అధ్యక్ష, కార్యదర్శుల పదవులకు పోటాపోటీతో పోరు రసవత్తరం




కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో కేయూ టీచర్స్ అసోసియేషన్ (అకూట్) ఎన్నికల సందడి నెలకొంది. ఈ మేరకు అకూట్ ఎన్నికల షెడ్యూల్‌ను వర్సిటీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు విడుదల చేశారు. ఫిబ్రవరి 24 సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ సాగింది. అధ్యక్షపదవికి కేయూ భూగర్భశాస్త్రం విభాగం ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, భౌతిక శాస్త్ర విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామిరెడ్డి, జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీలు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే జనరల్ సెక్రటరీ పదవికి కేయూ బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాస్, మ్యాథ్స్ విభాగం ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, మైక్రోబయోలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ముంజం శ్రీనివాస్, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ జె.చిన్నాలు పోటీలో నిలిచారు. కాగా, ఉపాధ్యక్ష పదవికి కేయూ క్యాంపస్ కళాశాల కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న, జాయింట్ సెక్రటరీగా కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.రాము, కోశాధికారిగా వర్సిటీ కంప్యూటర్ సైన్స్ డి.రమేశ్‌లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వీరికి పోటీ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వర్సిటీ ఎన్నికల అధికారులు ప్రకటించారు. వీరితో పాటు పలువురు క్యాంపస్ కళాశాల నుంచి డాక్టర్ ఎం.స్వర్ణలత, డాక్టర్ పి. వెంకటయ్య, ఫార్మసీ కళాశాల నుంచి డాక్టర్ షయేదా, క్యాంపస్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి కె.సుమలత, వుమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఎం. వేణుగోపాల్‌రెడ్డి, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, యూనివర్సిటీ పీజీ కళాశాల నుంచి ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల నుంచి డాక్టర్ ఇ.హరికృష్ణలను ఈసీ మెంబర్లను ఏకగ్రీవంగా ప్రకటించారు. ప్రధానంగా అధ్యక్షకార్యదర్శుల పదవులకే పోటాపోటీ నెలకొంది. ఎన్నికలు రసావత్తరంగా సాగనున్నాయి.

### 4న ఎన్నికలు, 5న ఫలితాలు

కాకతీయ యూనివర్సిటీ అకూట్ ఎన్నికల కోసం వర్సిటీ రిటర్నింగ్ అధికారులు షెడ్యూల్‌ను ప్రకటించారు. మార్చి 4న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికల ప్రకయ సాగుతుంది. ఫిబ్రవరి 27 సాయంత్రం 4 గంటల వరకు పోటీలో ఉన్న అధ్యాపకులు తమ నామినేషన్ల విత్‌డ్రాకు అవకాశం ఉంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు పోటీలో నిలిచిన అభ్యర్థులు తుది జాబితాను ప్రకటిస్తారు. 28న ఓటర్ల లిస్టును ప్రకటిస్తారు. 28 నుంచి మార్చి 3 వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించుకునే అవకాశం కల్పిస్తారు. మార్చి 4న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. వర్సిటీ క్యాంపస్‌తో పాటు కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్చి 5న మధ్యాహ్నం 2 గంటల నుంచి వర్సిటీ పరిపాలన భవనంలోని సెనెట్ హాల్‌లో ఓట్ల లెక్కింపు చేపట్టి తుది ఫలితాలను ప్రకటిస్తారు. ఇదిలా ఉండగా, వర్సిటీలో పరిపాలన పదవుల్లో ఉన్న అధ్యాపకులు అకూట్‌కు పోటీ పడటం పట్ల వారి నామినేషన్లను తిరస్కరించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను కలిసి అకూట్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

---



విద్యుత్ కాంతుల్లో వరంగల్ కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వరాలయం

- ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు, శైవక్షేత్రాలు ముస్తాబు
- అభిషేకాలు, హోమాలు, లింగోద్భవ పూజలు, కల్యాణాలకు ఏర్పాట్లు
- భక్తుల కోసం చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు
- పూలు, పండ్లు, పూజాసామగ్రి అమ్మకాలతో మార్కెట్‌లో సందడి

### అర్ధరాత్రివేళ లింగోద్భవ పూజలు

లింగరూపంలో ఉండే పరమేశ్వరుడికి అర్ధరాత్రి వేళ లింగోద్భవ సమయంలో అంగన్యాస కరన్యాస నమక చమకాలతో శివుడికి అభిషేకాలను నిర్వహిస్తారు. మహా శివరాత్రి రోజున మహా దేవుడికి అభిషేకం నిర్వహించడం జన్మజన్మల పుణ్యఫలంగా భక్తులు భావిస్తారు. జిల్లాలోని శివాలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథ కాలక్షేపాలు, దివ్యనామ సంకీర్తనలు, నాట్యప్రదర్శనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆలయాల వద్ద భక్తుల దర్శనాలకు చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల వద్ద భక్తులకు ఉచితంగా ప్రసాదాల పంపిణీ, పండ్ల పంపిణీ చేస్తున్నారు. బ్రహ్మకుమారి సమాజం ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేస్తారు.



# ఓం నమఃశివాయ



వేయి స్తంభాల గుడిలో ఏర్పాట్లు

## నేడు మహాశివరాత్రి పర్వదినం

వరంగల్ కల్చరల్ / హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి దేవుడికి మొక్కులు చెల్లించడానికి.. లింగరూపంలో ఉన్న పరమేశ్వరుడికి అభిషేకాలు చేయడానికి.. భక్తులు సిద్ధమయ్యారు. కాసిన్ని నీళ్లతో శివ.. శివ.. అంటే అభయమిచ్చే పరమేశ్వరుడు మహాశివరాత్రి పర్వదినమైన బుధవారం రోజున పూజలందుకోవడానికి కొలువుదీరాడు. ఎంతో పవిత్రమైన శివరాత్రి వేడుకలకు కాకతీయ రాజులు నిర్మించిన ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. రంగు రంగుల విద్యుత్ కాంతులతో.. మామిడి తోరణ మాలలతో.. ముద్ద బంతి పూల దండల అలంకరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శివరాత్రి రోజున ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లింగోద్భవపూజలు, శివపార్వతుల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తవగా.. శంభో శంకర.. హరహర మహాదేవ.. అంటూ భక్తులు పరమేశ్వరుడిని మనసారా కొలుస్తూ ఉపవాస దీక్షతో జాగరణ చేయనున్నారు. ఇందుకోసం దేవాదాయశాఖ, ఆలయ పాలకమండళ్ల ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు.

### ఉత్సవాలకు సిద్ధమైన దేవాలయాలు

హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తుల దర్శనానికి అనుమతించనున్నారు. సామూహిక రుద్రాభిషేకాలు, జాగరణ ఉండే భక్తులకు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు సాయంత్రం 6.30 గంటలకు రుద్రేశ్వరుడి కల్యాణం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో అనిల్‌కుమార్, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. అదే విధంగా హనుమకొండ హయగ్రీవాచారి గ్రౌండ్‌లో ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి తెల్లవార్లు ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నారు. హనుమకొండలోని సిద్ధేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు పెద్ద ఎత్తున జరగనున్నాయి. హనుమకొండ కాకాజీకాలనీలో జలేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించడంతోపాటు జాగరణ ఉండే భక్తులకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మట్ట శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. హనుమకొండ ములుగురోడ్‌లోని గురుధామంలో మహాశివరాత్రి పర్వదిన వేళ శివానంద కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమష్టి రుద్రాభిషేకంతోపాటు శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. హనుమకొండ ఏనుగులగడ్డలో 108 శివలింగాలతో ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో దివ్యదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వరంగల్ నగరంలో ప్రసిద్ధి చెందిన శివాలయాలు అయిన స్వయం భూ శంభులింగేశ్వరుడు, కాశిబుగ్గ విశ్వేశ్వరుడు, ఆకారపు వారి కాశీ విశ్వేశ్వరుడు, కరీమాబాద్ బొమ్మల గుడి, భద్రకాళిలోని భద్రేశ్వరుడు, మట్టెవాడలోని భోగేశ్వరుడు, రామన్నపేటలోని రామలింగేశ్వరుడు ఉత్సవాలకు సిద్ధమయ్యారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవతో శివాలయాల్లో అభిషేకాలు ప్రారంభమవుతాయి. ఆవు పాలు, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, విభూది, చందన అభిషేకాలు స్వామివారికి నిర్వహించిన అనంతరం ఏక బిల్వాలు, మారేడు దళాలు, పూల మాలలతో అందంగా అలంకరణ చేసి మంగళహారతులు పడతారు. సాయంకాలం రుద్రహోమాలు నిర్వహిస్తారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయి.

### జోరుగా పూలు, పండ్ల అమ్మకాలు

పండుగ వేళ భక్తులు శివుడికి జాగరణ, ఒక్క పొద్దులు నిర్వహిస్తారు. నైవేద్యంగా అభిషేకాలకు ఉపయోగించే కందగడ్డ, పూలు, పండ్లు ఖర్జూర, డ్రై ఫుడ్స్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వరంగల్ చౌరస్తా, పోస్టాఫీస్ సెంటర్, వెంకట్రామ జంక్షన్, కాశిబుగ్గ, పోచమ్మ మైదాన్, బట్టల బజార్, అండర్‌బ్రిడ్జి, ఫోర్ట్ రోడ్డు, కరీమాబాద్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పండ్ల దుకాణాలు వెలిశాయి.



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన కురవి వీరభద్రస్వామి ఆలయం

# కురవి క్షేత్రం ముస్తాబు

### నేటి నుంచి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

కురవి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహబుబాబాద్ జిల్లాలో పుణ్యక్షేత్రంగా విలసిల్లుతున్న కురవి వీరభద్రుడి క్షేత్రం మహాశివరాత్రికి ముస్తాబైంది. ఈ పర్వదినం సందర్భంగా జరిగే జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తుల పాలిట కొంగుబంగారమైన వీరన్న కళ్యాణ వైభోగాన్ని చూసేందుకు భక్తజనం తండోపతండాలుగా తరలిరానున్నారు. వీరభద్రుని కళ్యాణోత్సవాల్లో బాగంగా మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు పసుపు, కుంకుమలు తీసుకువచ్చే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, ఈవో సత్యనారాయణ, అర్చకులు బాలకృష్ణ, శ్రీకాంత్, రెడ్యాల శ్రీనివాస్, అనిల్, విజయ్, పుణ్యమూర్తి, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాల నేపథ్యంలో కురవి అవతలి నుంచి కెనాల్ రోడ్డు మీదుగా వాహనాల మళ్లింపు, ప్రత్యేక వీఐపీ, స్పెషల్ దర్శనం, ధర్మ దర్శనం కౌంటర్లు, మరిపెడ, మహబుబాబాద్ రహదారిలో వాహనాల నిలిపివేత, ఖమ్మం రహదారి ద్వారా వచ్చే వాహనాలను ఈసారి గ్రామం బయటే నిలుపనున్నారు. ఎలక్షన్‌కోడ్ కారణంగా పాఠశాల గ్రౌండ్ వరకు అనుమతి ఇవ్వడం లేదు. జాతరకోసం 150మంది ప్రత్యేకసిబ్బంది, స్త్రీలకోసం ప్రత్యేక స్నానఘట్టాలు, నేరడ రోడ్డులో బస్టాండ్ ఏర్పాటు, మరిపెడ, మహబూబాబాద్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశారు. కురవి సంతలో భక్తులకోసం తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటుచేశారు.



వీరభద్రుని కల్యాణ ఉత్సవాల్లో భాగంగా పసుపు, కుంకుమలు తీసుకొస్తున్న అర్చకులు



విద్యుత్ వెలుగుల్లో కాళేశ్వరంలోని ముక్తీశ్వరాలయం

# కాళేశ్వరం.. శివరాత్రి వైభవం

- ముక్తీశ్వర సన్నిధిలో ప్రారంభమైన వేడుకలు
- భారీగా తరలివచ్చిన భక్తులు



మహా శివరాత్రి వేడుకలను ప్రారంభిస్తున్న అర్చకులు

మహదేవపూర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వర క్షేత్రం శివరాత్రి వైభవాన్ని సంతరించుకుంది. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అంగరంగ వైభవంగా వేడుకలు ప్రారంభమయ్యాయి. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారికి సుప్రభాతసేవ, శైవతారాధ్యసేవ, మూర్తిదేవతాభిషేకం, నమక చమక సహిత రుద్రహోమం, చండీహోమం, నవగ్రహ హోమం, యోగిని భైరవ హోమం, మహానైవేద్యం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, నిర్వహించారు. ఇక ఈ ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలొస్తున్నారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మహేష్, అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి శర్మ, రామకృష్ణ శర్మ, అర్చకులు, ఆలయ సిబ్బంది, మాజీ ధర్మకర్తలు అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని ఈవో మహేష్ తెలిపారు.

# చాక్‌పీస్‌లతో శివలింగాలు

### గురుకులం ఉపాధ్యాయుడి ప్రతిభ



చాక్‌పీస్‌లతో రూపొందించిన శివలింగాలతో మహాశివలింగం

కాటారం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రతిభతో పాటు భక్తిభావాన్ని చాటుకున్నాడు ఓ ఉపాధ్యాయుడు. చాక్‌పీస్‌లతో తన సూక్ష్మ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు భూపాలపల్లి జిల్లా కాటారం గిరిజన సంక్షేమ బాలుర గురుకులం విద్యాలయానికి చెందిన ఆర్ట్ టీచర్, మైక్రో ఆర్టిస్ట్ ఆడెపు రజనీకాంత్. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సుమారు 10గంటల పాటు శ్రమించి 30చాక్‌పీసులను గుండుపిన్ను సాయంతో చెక్కాడు. స్కల్ప్చరింగ్ ఆర్ట్ ద్వారా 1.5సెం.మీ ఎత్తుండే 108 శివలింగాలు తయారు చేశాడు. ఆ శివలింగాలనే త్రిశూలం, మహాశివలింగంలా పేర్చాడు. సూక్ష్మకళతో ప్రతిభను చాటిన రజనీకాంత్‌ను పలువురు అభినందించారు.

# శివరాత్రి సందర్భంగా నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పండుగ పురస్కరించుకొని నగరంలోని వేయి స్తంభాల ఆలయం పరిసరాల్లో భక్తులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వాహనాలను మళ్లిస్తున్నట్లు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు రోడ్డు నుంచి వేయిస్తంభాల గుడి వైపు వచ్చే భక్తుల వాహనాలను అలంకార్ జంక్షన్ వరకే అనుమతిస్తారన్నారు. హనుమకొండ చౌరస్తా నుంచి ఆలయం వైపు వచ్చే భక్తుల వాహనాలను అమృత జంక్షన్ వరకు అనుమతిస్తారన్నారు. ములుగు రోడ్డు నుంచి బస్టాండ్ వైపు వెళ్లే ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లు, ఇతర సాధారణ వాహనాలను అలంకార్, కాపువాడ, బాలాంజనేయ స్వామి ఆలయం పక్క నుంచి ప్రయాణించాలన్నారు. ఈ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి వాహనాలను పార్కింగ్ చేయరాదని, తోపుడు బండ్లకు సైతం అనుమతి లేదన్నారు. ఈ ఆంక్షలు 27 మధ్యాహ్నం మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతాయని, గ్రేటర్ ప్రజలు గమనించి సహకరించాలని ఏసీపీ, సీఐ కోరారు.

# మూడురోజులు.. ముక్కంటి వేడుకలు

- శివరాత్రికి ముస్తాబైన రామప్ప
- నేటి కల్యాణోత్సవానికి రానున్న సీతక్క



విద్యుత్ వెలుగుల్లో రామప్ప దేవాలయం

వెంకటాపూర్, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు జరిగే ముక్కంటి వేడుకలకు ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప ఆలయం ముస్తాబైంది. భక్తుల కోసం అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. విద్యుద్దీపాలు, మామిడాకుల తోరణాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 300 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పరకాల, భూపాలపల్లి, హనుమకొండ నుంచి భక్తుల కోసం ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిస్తోంది. వైద్య సౌకర్యం, పారిశుధ్య నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు ఆలయ ఈవో బిల్ల శ్రీనివాస్ తెలిపారు. రామప్పలో శివరాత్రి వేడుకల ఏర్పాట్లను అదనపు కలెక్టర్ సంపత్‌రావు మంగళవారం పరిశీలించారు. బుధవారం ఉదయం ప్రారంభం కానున్న వేడుకలు శుక్రవారం ముగియనున్నాయి. ఈ క్రమంలో మహాశివరాత్రి పర్వదినమైన బుధవారం నిర్వహించే శ్రీభవానీ సహిత రామలింగేశ్వరస్వామి కల్యాణానికి మంత్రి ధనసరి సీతక్క హాజరు కానున్నారు. స్వామివారికి ఆమె పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. మంత్రితోపాటు కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్ పూజల్లో పాల్గొననున్నారు.

# నేడు ఐనవోలు మల్లన్న కల్యాణం

### పెద్దపట్నం కోసం నృత్యమండపం ముస్తాబు

ఐనవోలు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రిని పురస్కరించుకొని ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. బుధవారం ఉదయం 4గంటలకు స్వామి వారి మేలుకొలుపు సుప్రభాతసేవ ప్రాత:కాల పూజ, ఉదయం 8 గంటలకు సింహవాహనసేవ గవ్యాంత పూజలు అష్టోత్తర(108) శతకలషార్చన తదుపరి మహాన్యాసపూర్వక మహారుద్రాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా కల్యాణానికి ప్రభుత్వం నుంచి పట్టువస్త్రాలను ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు దంపతులు తీసుకరానున్నారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవకాలంలో అష్టోత్తర శతకలశములచే విశేష మహాఅభిషేకం, నీరజన మంత్రపుష్ప పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం తూర్పు వైపున ఉన్న కాకతీయుల నృత్యమండపంలో ఒగ్గుపూజారులు నిర్వహించే పెద్దపట్నం కార్యక్రమంలో తొక్కిసలాటలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై పస్తం శ్రీనివాస్, ఈవో నాగేశ్వర్‌రావు, ఒగ్గుపూజారులతో కలిసి మండపాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించారు. పెద్దపట్నం వద్ద తొక్కిసలాట జరుగకుండా, శివకల్యాణం కోసం పోలీస్ బందోబస్తును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# కొండెక్కిన కొబ్బరి

- క్రమంగా పెరుగుతున్న ధరలు
- పండగ వేళ మరింత పెంచుతున్న వ్యాపారులు



హనుమకొండ టైలర్‌స్ట్రీట్‌లోని ఓ కొబ్బరి కాయల దుకాణం



హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పండుగ ఏదైనా.. దేవుళ్లు ఎవరైనా.. కొబ్బరికాయ కొట్టనిదే మొక్కు చెల్లదని భక్తుల నమ్మకం. అలాగే ఇళ్లలోనూ ఎలాంటి పూజ చేసినా కొబ్బరికాయ ఎంతో అవసరం. అలా ప్రతీ కార్యక్రమంలో కీలకంగా ఉండే కొబ్బరి కాయల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇక ప్రధానమైన పండుగలు, జాతరల రోజుల్లో వ్యాపారులు ఆధరను మరింత పెంచి అమ్ముతుండటంతో సాధారణ భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. నిన్నమొన్నటి వరకు కొబ్బరికాయ ధరలు ఒక్కొక్కటి రూ. 15నుంచి 20రూపాయాల వరకు విక్రయించగా.. ప్రస్తుతం సైజ్‌ను బట్టి రూ.30నుంచి రూ.40వరకు మార్కెట్లో విక్రయాలు జరుపుతున్నారు. అదే విధంగా కొబ్బరికాయల రేటు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఇటు రిటైల్ మార్కెట్‌లో కొబ్బరి కుడుకల ధరలు సైతం అకాశాన్ని అంటుతున్నాయి. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కువగా కొబ్బరి పంటలను రైతులు సాగుచేస్తుంటారు. కొన్ని నెలల క్రితం ఆ రాష్ట్రంలో తుఫాను బీభత్సం కారణంగా కొబ్బరి తోటలు నేల మట్టమైన విషయం తెలిసిందే. పంట నష్టం కారణంగా దిగుబడి తగ్గిన కొబ్బరికాయలకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్టుగా కొబ్బరికాయలు దిగుబడి లేక కాయలను అధిక రేట్లకు వ్యాపారులు విక్రయాలు జరుపుతున్నారు. దీనికి తోడు ఏటా విస్తారంగా లభించే కొబ్బరి కాయాలు ఈ సారి యూపీ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న మహా కుంభమేళాకు వ్యాపారులు తరలించుకుపోవడంతో తెలుగురాష్ట్రాల్లో కొబ్బరికాయలకు కొరత ఏర్పడిందని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు.

### ఎన్నడూ లేని విధంగా ధరలు..



పండుగలైనా, ఇళ్లలో ఎలాంటి శుభకార్యాలైనా, చివరకు అశుభ కార్యక్రమాలైనా కొబ్బరికాయ ఉండాల్సిందే. దైవ దర్శనం చేసుకున్న అనంతరం దేవుళ్లకు కొబ్బరికాయలు కొట్టనిదే మొక్కు తీరదన్నది నమ్మకం. కానీ ఇటీవల పెరిగిన కొబ్బరి కాయలు ధరల పెరగడంతో ఒక్కసారి కొనుగోలు చేయకుండానే దేవుళ్లకు మొక్కులు చెల్లించుకొని వెనుదిరగాల్సి వస్తోంది. మునుపెన్నడు కొబ్బరి కాయలు ధరలు ఇంతగా పెరిగిన సందర్భాలను చూడలేదు.

- సిద్దంశెట్టి శ్రీనివాస్, కొనుగోలు దారుడు, హనుమకొండ చౌరస్తా

### పెరుగుతున్న ధరలతో విక్రయాలు తగ్గాయి



ఇటీవల జరిగిన మినీ మేడారం, ఇరత పండగలు, శివరాత్రి పర్వదినంతో పాటు వివిధ దైవ కార్యక్రమాలకు ఎక్కువ సంఖ్యలో కొబ్బరి కాయల విక్రయాలు జరిగాయి. అదే విధంగా కొబ్బరి దిగుబడి తగ్గడంతో అధిక రేట్లుకు కొబ్బరిని దిగుమతి చేసుకుంటున్నాం. దీంతో ఎంతో కొంత లాభం చూసుకొని అమ్మకాలు జరిపే సరికి 5నుంచి 10వరకు కొబ్బరికాయలు కొనే వారు కూడా పెరిగిన ధరలను చూసి అంతగా కొనడం లేదు. దీంతో గిరాకీ తగ్గింది.

- కచ్చకాయల శ్రీకాంత్, కొబ్బరికాయల వ్యాపారి, హనుమకొండ టైలర్‌స్ట్రీట్

## ముస్తాబైన ఓంకారేశ్వర ఆలయం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం మహాశివరాత్రి ఉత్సవానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. శివాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. బుధవారం ఉదయం 4.30 గంటలకు శివుడి అభిషేకంతో పాటు రాత్రి 7.30 గంటలకు నిర్వహించే శివకల్యాణంతో పాటు రాత్రి 12.10 గంటలకు లింగోద్భవ అభిషేకానికి సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ పూజారి ఉప్పుల రమేష్‌శర్మ తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.


శివరాత్రికి ముస్తాబైన ఓంకారేశ్వరస్వామి దేవస్థానం

## గంజాయి నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

• జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్ కోరారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం గంజాయి, ఇతర మత్తుపదార్థాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, డీసీపీ షేక్ సలీమా మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించే వారిపై, వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సినిమా హాళ్లలో కూడా మత్తు పదార్థాల నియంత్రణకు స్లైడ్స్ వేసే విధంగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. క్రీడా, ఇతర రంగాలలోని సెలబ్రిటీలతో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హాల్‌టికెట్లు ఇవ్వని కళాశాలల గుర్తింపును రద్దు చేయాలి : పీడీఎస్‌యూ



డీఐఈవో గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వని జూనియర్ కళాశాలలను గుర్తించి వాటి అనుమతులను రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని డీఐఈవో కార్యాలయంలో డీఐఈవో ఎ.గోపాల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఫీజుల పేరుతో హాల్‌టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్న కళాశాల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులను పెట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినయ్, వంశీ, అజహర్, రాకేష్, కార్తీక్, రవి, అఖిల్, మణిదీప్, కళ్యాణ్, పృథ్వి, వీరేష్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

## ప్లానిటోరియం పనులు పూర్తి చేయండి

• పనుల పరిశీలనలో మేయర్ సుధారాణి


ప్లానిటోరియం పనులను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఈ యేడు ఆర్థిక సంవత్సరం మార్చి 20వ తేదీ లోగా వరంగల్ నగరంలోని ప్లానిటోరియం నవీకరణ పనులు పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. మంగళవారం బల్దియా ఆవరణలోని ప్లానిటోరియం సివిల్ పనులతో పాటు స్విమ్మింగ్ పూల్ పనులను మేయర్ సుధారాణి పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్లానిటోరియంలో పాల్ సీలింగ్‌తో పాటు ఎలక్ట్రికల్ తదితర మిగిలి ఉన్న పనులను పూర్తి స్థాయిలో గడువులోగా పూర్తిచేసి అందజేయాలని అన్నారు. అలాగే స్విమ్మింగ్ పూల్ పనులలో మరింత వేగం పెంచి వేసవి కాలం ప్రారంభానికి ముందే పిల్లలు వినియోగించుకునేందుకు అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ అన్నారు. మేయర్ వెంట అక్కడ పనిచేసే కాంట్రాక్టర్, సిబ్బంది ఉన్నారు.

## ప్రశ్నించే గొంతుకనే మండలికి పంపించాలి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నించే గొంతుకనే శాసన మండలికి పంపించాలని టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళ వారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాల కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పీఈటీ పోస్టుల అప్ గ్రేడేషన్, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు నూతన ఉపాధ్యాయుల పోస్టుల మంజూరు కోసం పాటుపడుతున్నట్లు పేర్కొన్నారు. సీఆర్‌టీలకు 12 నెలల వేతనం చెల్లించేందుకోసం తనవంతు కృషి చేశానని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు సింగిరాజు సదానందం, మాణిక్ రెడ్డి, తాడూరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్దిష్ట పన్నుల లక్ష్యాన్ని సాధించాలి

» కమిషనర్లు, అధికారులతో పన్ను వసూళ్లపై సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి సమీక్ష


వీసీలో మాట్లాడుతున్న సీడీఎంఏ శ్రీదేవి, పాల్గొన్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పన్నుల సేకరణలో నిర్దిష్ట లక్ష్యాలను సాధించాలని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి(సీడీఎంఏ) డాక్టర్ శ్రీదేవి సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో మంగళవారం పన్ను వసూళ్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీడీఎంఏ మాట్లాడారు. వరంగల్ బల్దియా నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, పన్నుల వసూళ్ల పురోగతిని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 117.26 కోట్లు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.51.91 కోట్లు పన్నులు సేకరించామని అన్నారు. మిగిలిన పన్ను వసూళ్లకు రెవెన్యూ సిబ్బంది బడా బకాయిదారులకు ఇప్పటికే రెడ్ నోటీసులు అందించారని అన్నారు. పన్నులు చెల్లించాలని కోరుతూ క్షేత్రస్థాయిలో ప్రచారం చేయడంతోపాటు బకాయిదారులకు బల్క్ మెసేజ్‌లు పంపించడం, పెద్దమొత్తంలో బకాయిలుఉన్న సంస్థల యాజమాన్యం వద్దకు బృందాలుగా వెళ్లి వసూళ్లు జరుపుతున్నట్టుగా కమిషనర్ వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రసన్నరెడ్డి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

## బాలుడిని కర్రతో చితకబాదిన వార్డెన్

• చేయి ఫ్యాక్చర్ కావడంతో విద్యార్థికి చికిత్స


గాయపడ్డ బాలుడు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థిపై వార్డెన్ సదానందం దాడి చేయగా చేయికి తీవ్రగాయాలై చికిత్స పొందుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ కాకాజీకాలనీలో ఎస్సీ హాస్టల్, అనాథల ఆనంద నిలయం హాస్టల్ పక్కపక్కనే ఉంటాయి. ఎస్సీ హాస్టల్‌లో ఉండే 9వ తరగతి విద్యార్థి శుక్రవారం ఆనాథ హాస్టల్ విద్యార్థులను కలవడానికి హాస్టల్ ప్రాంగణంలోకి వెళ్లగా హాస్టల్ ఆఫీస్ రూమ్‌లో ఉన్న వార్డెన్ సదానందం చూశారు. ఆగ్రహంతో ఊగుతూ 9వ తరగతి విద్యార్థితో పాటు ఆనాథ హాస్టల్‌లోని మరో విద్యార్థిని కర్రతో చితకబాదినట్లుగా తెలుస్తోంది.

ఈ ఘటనలో 9వ తరగతి విద్యార్థి తీవ్రంగా గాయపడగా, విషయాన్ని ఆనంద నిలయం హాస్టల్ వార్డెన్ అర్చన, ఎస్సీ హాస్టల్ వార్డెన్ సదానందంలు బయటికి పొక్కకుండా దాచిపెట్టారు. ఈ విషయంపై వార్డెన్ సదానందంను వివరణ కోరగా.. గాయ పడిన ఇద్దరు విద్యార్థుల ప్రవర్తన బాగాలేదని, గతంలో పలు మార్లు మందలించినా వినకపోతే ఇద్దరి చేతులపై కర్రతో కొట్టానన్నారు. వాపు రావడంతో ఆస్పత్రిలో చూపించి వారి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.

## బల్దియా ఇంజనీరింగ్ విభాగంలో అంతర్గత బదిలీలు

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బల్దియా ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఉన్నతాధికారులతో పాటు కింది స్థాయి సిబ్బందిని బదిలీ చేస్తూ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్‌తో పాటు నక్కలగుట్ట ప్రధాన కార్యాలయాలలో పనిచేస్తున్న సిబ్బంది, ఇటీవల ఇతర ప్రాంతాల నుంచి బల్దియాకు వచ్చిన వారికి వివిధ విభాగాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించాలని డీఈవో డి.వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న అన్ని పాఠశాలల్లో సైన్స్ దినోత్సవంలో భాగంగా వ్యాస రచన, సైన్స్ క్విజ్, సైన్స్ సెమినార్, చిత్రలేఖనం, సైన్స్ పుస్తక ప్రదర్శన, సైన్స్ పరికరాల ప్రదర్శన, సైన్స్ ప్రయోగాలు, సైన్స్ బోధన అభ్యసన సామగ్రి ప్రదర్శన, ప్రాజెక్టుల ప్రదర్శన, శాస్త్రవేత్తలపై ఉపన్యాసాలు, విజ్ఞాన మేళ తదితర కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె కోరారు.

## మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మోడల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం మార్చి 10లోగా దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డీఈవో డి.వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆరో తరగతిలో 100 సీట్ల కోసం, 7 నుంచి 10 తరగతుల్లో ఉన్న ఖాళీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

## ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న జ్యోతి

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌వర్సిటీ పోటీలకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి తెలిపారు. తమిళనాడులోని పెరియార్ యూనివర్సిటీలో ఈ నెల 28 నుంచి మార్చి 3 వరకు జరగనున్న సౌత్‌జోన్ హ్యాండ్ బాల్ పోటీలకు కళాశాలకు చెందిన కె.వినేష్, డి.శ్రీనివాస్ అనే ఇద్దరు విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, పీడీ డాక్టర్ భాసర్‌లతో కలిసి విద్యార్థులను అభినందించారు.

## రుద్రేశ్వరాలయంలో వైభవంగా చండీహోమం


చండీయాగంలో పాల్గొన్న దేవాదాయ శాఖ డీసీ సంధ్యారాణి

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఐదు రోజులపాటు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవ వేడుకలు మంగళవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఉదయం సుప్రభాతసేవ, మంగళవాయిద్ర సేవ, ఉత్తిష్ట గణపతికి నవరసఅభిషేకం, రుద్రేశ్వరునికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవ కల్యాణమూర్తులను ప్రతిష్ఠింపజేసి గణపతి నవగ్రహ, పుణ్యవహచనం అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి ఉత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మతో పాటు ప్రణవ్, మణికంఠశర్మ, సందీప్‌లు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక చండీహోమాన్ని శాస్త్రోయుక్తంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహాశివరాత్రి పర్వదిన వేళ ఆలయానికి తరలివచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పవిత్రంగా జరిగే ఈ వేడుకలకు భక్తులు సంప్రదాయ దుస్తులతో తరలిరావాలని ఆలయ ఈవో అనిల్ కుమార్ కోరారు. సాయంత్రం జరిగే కల్యాణోత్సవంలో భక్తులు ఎవరైనా పాల్గొనవచ్చని గంగు ఉపేంద్రశర్మ సూచించారు. మంచినీటి సౌకర్యంతో ఎన్‌సీసీ సేవలను వినియోగించుకుంటున్నారు. ఆలయానికి తరలివచ్చే భక్తులకు ఇబ్బందులుకలగకుండాపోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తున్నారు.

## ఓరుగల్లు ప్రభను చాటేందుకే ఆధ్యాత్మిక కార్యక్రమాలు

» హనుమకొండ వేదికగా మహా శివరాత్రి సాంస్కృతిక సమ్మేళనం

» ఇండస్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి


హయగ్రీవచారి గ్రౌండ్‌లో మహా శివరాత్రి సాంస్కృతిక సమ్మేళనం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఏనుగుల రాకేష్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు ప్రభను ప్రపంచానికి చాటి చెప్పేందుకు 2020 నుంచి ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా శివరాత్రి సమ్మేళన కార్యక్రమం హనుమకొండలో నిర్వహిస్తున్నట్లు ఇండస్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవచారి గ్రౌండ్‌లో మహా శివరాత్రి ఆధాత్మిక, సాంస్కృతిక సమ్మేళనం బుధవారం నిర్వహించే కార్యక్రమ ఏర్పాట్లను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓరుగల్లు వైభవం విశిష్టతను, ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారతదేశంలో భిన్న సంస్కృతులు కలిగిన ప్రాంతాల్లో ఓరుగల్లు జిల్లా కవులు, కళాకారులు, కాకతీయుల సామ్రాజ్యపు రాజులు హనుమకొండ కేంద్రంగా 400ఏళ్లు పరిపాలించారని, ఇక్కడి ఔనత్యాన్ని చరిత్రను ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని ఆయన కోరారు. అలాగే వివిధ రంగాల్లో ప్రతిభను కనబర్చి సేవలందించిన ప్రతిభావంతులకు కాకతీయ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. బుధవారం జరిగే ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు, చిలుకూరు బాలాజీ అర్చకుడు శ్రీరంగరాజన్, ఇస్కాన్ స్వామిజీ శ్రీస్వామి ప్రణవానంద దాస్, జొన్న విత్తుల రామలింగేశ్వర్‌రావు హాజరవుతారన్నారు. చిందు యక్షగాన కళాకారుడు, పద్మశ్రీ గడ్డం సమ్మయ్య, ప్రముఖ గేయ రచయిత, కవి దేశపతి శ్రీనివాస్‌తో తెలంగాణ సాంస్కృతిక కళా వైభవం సందేశాలు ఉంటాయన్నారు. అలాగేజాగరణలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ భక్తి గీతాలు, నృత్యాలు, పేరిణి నృత్యాలు, సహస్ర లింగార్చన, సప్తహారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి శివ భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు రాకేష్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్రో స్పేస్ టూటర్ శశాంక్ భూపతి, కోఆర్డినేటర్లు అభిషేక్, దీపక్, సుకాంత్, డాక్టర్ కొమురన్న, యాదగిరి, కొడారి రవి, జెట్టి రాజేందర్, ప్రశాంత్, సుమన్‌గౌడ్, సతీష్‌రెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి

రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : యువతరం అవసరమైన కార్పొరేట్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని కేయూ అభివృద్ధి మండలి డీన్ ప్రొఫెసర్ వరలక్ష్మి అన్నారు. వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన పినాకిల్ - 2025 కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొని విజేతలైన, రన్నర్లు అయిన విద్యార్థులకు రూ.60,000 నగదు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రోనాక్స్ ఇంజనీరింగ్ సీఈఓ మనోహ్మన్‌రెడ్డి, హనుమకొండ సీఐ సతీష్, కళాశాల అధ్యాపకులు రాజిరెడ్డి, సుగుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆటోడ్రైవర్లు లాగ్‌బుక్‌లు విధిగా నిర్వహించాలి

» బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

» తడి, పొడి చెత్తను వేరుగా స్వీకరించాలని ఆదేశం


వరంగల్ చార్‌బౌలిలో ఆకస్మిక పర్యటన చేస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆటోడ్రైవర్లు కాలనీలలో పర్యటిస్తున్న సమయంలో విధిగా లాగ్‌బుక్‌లు నిర్వహించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. శానిటేషన్ తనిఖీలలో భాగంగా కమిషనర్ బల్దియా పరిధిలోని 26వ డివిజన్ చార్‌బౌలి ప్రాంతంలో మంగళవారం అకస్మికంగా పర్యటించి చెత్త సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. తడి, పొడి చెత్తపై అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరుగా అందించేలా ప్రోత్సహించాలని, స్వచ్ఛ ఆటో వాహనాల లాగ్‌బుక్‌తో పాటు డ్రైవర్లు కూడా లాగ్‌బుక్ నిర్వహించాలని అన్నారు. ఇంకా డ్రైవర్లు విధి నిర్వహణలో ఉన్నప్పుడు యూనిఫామ్ ధరించి పిన్‌పాయింట్ ప్రోగ్రామ్‌ను అమలు చేయాలని చెప్పారు. క్రమబద్ధంగా చెత్తను సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోల్కొండ శ్రీనివాస్‌తోపాటు జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బేబీ సైనిక్ స్కూల్‌లో వార్షికోత్సవ వేడుకలు


వార్షికోత్సవ వేడుకల్లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ నయీంనగర్‌లోని గోపాల్‌పూర్ రోడ్డులో గల శివాని విద్యాసంస్థలకు చెందిన బేబీ సైనిక్ హైస్కూల్లో పాఠశాల వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపెల్లి స్వామి జ్యోతిప్రజ్వలన చేసి విద్యార్థినులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినులు నాటక, నృత్య ప్రదర్శనలు నిర్వహించిన అనంతరం క్విజ్, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపెల్లి స్వామి మాట్లాడుతూ.. శివాని విద్యాసంస్థలు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని, విద్యతోపాటు సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సల్మా తబస్సుమ్, డైరెక్టర్లు జి.రవీందర్, జి.సురేందర్ రెడ్డి, వి.చంద్రమోహన్, టి.రాజు, ఎస్.రమేష్, ఎ.మురళీధర్, వి.సురేష్, ఎస్.సంతోష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శివరాత్రి వేళ బల్దియా సేవలు

• 85 దేవాలయాల వద్ద శానిటేషన్ పనులు

• వారం రోజులు చెత్త శుద్ధి కార్యక్రమాలు

• విధుల్లో వేయి మంది కార్మికుల కేటాయింపు


వేయిస్తంభాల ఆలయంలో శానిటేషన్ పనులు చేస్తున్న కార్మికులు

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మంగళవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని చారిత్రాత్మక దేవాలయాలతో పాటు పలు శివాలయాల వద్ద బల్దియా శానిటేషన్ విభాగం సిబ్బంది పనులు కొనసాగిస్తున్నారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశాల మేరకు సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్‌ల పర్యవేక్షణలో సుమారు వేయి మంది పబ్లిక్ హెల్త్ వర్కర్లు, 100 మంది జవాన్లు పనులు చేస్తున్నారు. మూడు రోజుల ముందుగా బల్దియా పరిధితోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని 85 దేవాలయాల్లో బల్దియా ఎలక్ట్రికల్ సిబ్బంది సీరియల్ లైట్లతో పాటు భారీగా కాంతులు వెదజల్లే లైట్లను అలంకరించారు. అదేవిధంగా శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల నేతృత్వంలో సంబంధిత దేవాలయాల వద్ద శానిటేషన్ పనులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా దేవాలయం చుట్టుపక్కల ప్రాంతాల్లో చెత్తాచెదారం, ఖాళీ వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్లను సేకరించి స్వచ్ఛ ఆటోలు, స్వచ్ఛ ట్రాక్టర్ల ద్వారా మడికొండ డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. మహిళా పారిశుధ్య కార్మికులు దేవాలయాల పరిసరాలను శుభ్రం చేసే పనిలో పడ్డారు. కొందరు కార్మికులు భక్తులు వచ్చే దారిలో సున్నం పోసి మార్గాన్ని చూపిస్తున్నారు. దోమల నియంత్రణ కోసం దేవాలయాల చుట్టుపక్కల ప్రాంతాల్లో మురుగు నీటి కాల్వలు, కుంటలలో బల్దియా మలేరియా విభాగం సిబ్బంది దోమల మందు పిచికారి చేస్తున్నారు. వరుస క్రమంలో భక్తులు దర్శించుకునేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. వారం రోజులుగా ఒక్కో దేవాలయం వద్ద ప్రతీ రోజు మూడు షిఫ్టుల చొప్పున 50 మంది పని చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. దేవాలయాలలో వేడుకలు ముగిసిన తర్వాత కూడా మూడు రోజుల పాటు పనులు జరుగుతాయని పేర్కొన్నారు.

### మొబైల్ టాయిలెట్స్

దేవాలయాల వద్ద మహిళా భక్తుల సౌకర్యార్థం బల్దియా పరిధిలోని సుమారు 12 దేవాలయాల వద్ద మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేసినట్లు సీఎంహెచ్‌వో రాజారెడ్డి వెల్లడించారు. వాహనాల్లో నీటి సదుపాయంతో పాటు ఎప్పటికప్పుడు టాయిలెట్స్‌ను శుభ్రం చేసేందుకు 20 మంది సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇంకా ఎక్కడైనా పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే తమ కాల్‌సెంటర్‌కు ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే పరిష్కారం మార్గం చూపిస్తున్నామని శానిటేషన్ అధికారులు, సిబ్బంది తెలిపారు.

## రేపు కేయూలో ఉద్యోగ అవకాశాలపై సదస్సు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో ఫిబ్రవరి 27న సాయంత్రం 4.30 గంటలకు 'ఎక్స్‌ప్లోరింగ్ కేరీర్ అపర్చ్యూనిటీస్ ఇన్ ది యూఎస్' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ సదస్సుకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, విశిష్ట అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు హాజరవుతారని వెల్లడించారు.

అలాగే కేయూ అల్యూమినీ, అమెరికా వ్యాపారవేత్త పులి రవి, జెన్నీఫర్ లార్సన్‌లు హాజరై వివిధ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కీలక ప్రసంగం చేస్తారని పేర్కొన్నారు. సదస్సుకు కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమణ, మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు వ్యవహరిస్తారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 26 ఫిబ్రవరి 2025

కడుపు మాడ్చితే, శక్తి కోసం శరీరం కొవ్వును కరిగించుకుంటుంది. జీర్ణవ్యవస్థ సేద తీరి, కొత్త శక్తి పుంజుకుంటుంది. ఉపవాసంతో దక్కే ఇలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కోకొల్లలు. అయితే ఉపవాసం చేసినా, ఆ సమయంలో ఓపిక సన్నగిల్లకుండా ఉండడం కోసం కూడా కొన్ని నియమాలు పాటించాలి.

# ఉపవాసం... ఆరోగ్యం..!

ఉపవాస దీక్షలో భాగంగా పరిమిత ఆహార నియమానికి కట్టుబడటం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయనీ, జబ్బులకు దారితీసే దుష్ప్రభావాలూ తగ్గుతాయని పరిశోధనల్లో తేలింది. మధుమేహం, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్‌లు తగ్గుతాయని పరిశోధకులు గ్రహించారు. శరీరంలో చోటుచేసుకునే ఈ మార్పుల ఫలితంగా గుండె జబ్బులు, పక్షవాతం వంటి వ్యాధులకు గురయ్యే అవకాశాలు తగ్గుతాయి. అంతే కాకుండా ఉపవాసంతో ఒరిగే మరికొన్ని ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అవేంటంటే...

- **ఇన్‌ఫ్లమేషన్ అదుపు:** ఇన్‌ఫ్లమేషన్‌కూ... గుండె జబ్బులు, క్యాన్సర్, కీళ్లనొప్పులకూ అవినాభావ సంబంధం ఉంటుంది. ఉపవాసంతో శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ అదుపులోకొస్తుంది కాబట్టి, ఉపవాసంతో ఈ ఆరోగ్య సమస్యలను అదుపులో పెట్టుకోవచ్చు.
- **గుండెకు మేలు:** అధిక కొలెస్ట్రాల్‌తో గుండెకు చేటు జరుగుతుందనే విషయం మనందరికీ తెలిసిందే! ఉపవాసంతో కొలెస్ట్రాల్ తగ్గుతుంది కాబట్టి గుండెకు రక్షణ దక్కుతుంది. ఉపవాసంతో అధిక రక్తపోటు అదుపులోకి రావడంతో పాటు, ఎల్‌డిఎల్ అనే చెడు కొలెస్ట్రాల్ మోతాదు తగ్గుతుంది.
- **శక్తి ఖర్చు:** ఉపవాసంలో శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం పెరుగుతుంది. పరిమితంగా క్యాలరీలు తీసుకునే వారితో పోలిస్తే, రోజంతా ఉపవాసం ఉన్నవాళ్లలో శరీరం మొత్తంలోని కొవ్వుతో పాటు ప్రత్యేకించి పొట్ట దగ్గరి కొవ్వు త్వరితంగా కరుగుతుంది.

నేడు మహాశివరాత్రి

### ఈ లక్షణాలు సహజం

ఉపవాసం సమయంలో ఛాతీలో మంట, మలబద్ధకం, తలనొప్పి లాంటి సమస్యలు తలెత్తవచ్చు. ఈ లక్షణాలు సహజం. వీటిని నివారించాలంటే...

- రోజు మొత్తంలో కనీసం రెండు నుంచి మూడు లీటర్ల నీళ్లు తాగాలి
- పెప్టిక్ అల్సర్లు, మధుమేహులు పళ్లు, కూరగాయ ముక్కలు తినాలి
- గర్భవతులు, పాలిస్తున్న తల్లులు, హృద్రోగులు,



పెద్దలు ఉపవాసం చేయకపోవటమే మంచిది
- శారీరక బలహీనత కలిగినవారు, ఆహారానికి సంబంధించిన సమస్యలున్నవారు (ఈటింగ్ డిజార్డర్), ఇతరత్రా తీవ్ర ఆరోగ్య సమస్యలున్నవాళ్లు ఉపవాసానికి ముందు వైద్యుల సలహా తీసుకోవాలి
- ఉపవాస సమయంలో ఎక్కువ నూనె, నెయ్యిలతో చేసిన పదార్థాలు, తీపి వంటలకు దూరంగా ఉండాలి

### ఇలా ముగించాలి

ఉపవాసంతో కడుపు నకనకలాడుతున్నా, చేతికందిన పదార్థాలతో ఉపవాసం ముగించకూడదు. మరీ ముఖ్యంగా పిండి వంటలు తినకూడదు. కోలాలు, రెడీమేడ్ పళ్ల రసాలు, స్వీట్లు, సమోసాల జోలికి వెళ్లకూడదు. ఉపవాసం ముగించేటప్పుడు తీసుకునే ఆహారం తేలికగా అరిగేదై ఉండాలి. చిరుధాన్యాలతో చేసిన రొట్టెలు, ఆకుపచ్చని కూరగాయలు, పాలు, పెరుగు, వేయించిన లేదా ఉడికించిన గింజలతో ఉపవాసం ముగించటం ఆరోగ్యకరం.

### విశ్రాంతి కూడా అవసరమే!

ఉపవాసం జీవక్రియలను నెమ్మదింపజేస్తుంది. ఉపవాసంతో శరీరంలోని ద్రవాల్లో హెచ్చుతగ్గులు చోటు చేసుకుంటాయి. కాబట్టి అలసట కలిగించే, ఎక్కువ శారీరక శ్రమతో కూడుకున్న పనులు చేయకూడదు. ఆహార వేళలు కచ్చితంగా పాటిస్తూ, మితంగా మొదలుపెట్టి క్రమేపీ ఆహార పరిమాణం సాధారణ స్థాయికి పెంచాలి.

పర్వదినం



సాధారణంగా పండుగలు, పర్వదినాలు అనగానే... కుటుంబ సభ్యులు, సన్నిహితుల కలయికలు, విందులు, వినోదాల్లాంటి వేడుకలు ఉంటాయి. కానీ మహా శివరాత్రినాడు ఇవేవీ కనిపించవు. ఉపవాసం, జాగారాలు, పూజలు, అభిషేకాలు, భజనలు, ప్రార్థనలతో రోజంతా గడిపే పండుగ ఇది.

# శివ సామీప్యాన్ని అనుభూతి చెందే రోజు

*మాఘ కృష్ణ చతుర్దశ్యా*
*మాదిదేవో మహానిశి*
*శివలింగ తయోద్భూతః*
*కోటి సూర్య సమప్రభః*

కోటి సూర్యులతో సమానంగా ప్రకాశించే మహా శివుడి లింగోద్భవం జరిగిన రోజును మాఘ బహుళ చతుర్దశిగా, మహా శివరాత్రిగా పురాణాలు పేర్కొన్నాయి. ఈ రోజు అనుసరించాల్సిన విధి, విధానాలను పేర్కొంటూ... వాటి ప్రాధాన్యతను, ఆవశ్యకతను కూడా వివరించాయి. శివరాత్రి నాడు చాలామంది భక్తులు పూర్తి ఉపవాసం పాటిస్తారు. ఏ రకమైన ఆహారాన్ని తీసుకోరు, కొందరు మంచి నీరు కూడా తాగకుండా ఉంటారు. రాత్రంతా శివారాధన చేసిన తరువాత... మరునాడు ఉదయం ఆహారాన్ని తీసుకుంటారు. వీటన్నిటివల్లా శరీరం, మనసు పరిశుద్ధమవుతాయని, దృష్టి ఆధ్యాత్మికత మీద కేంద్రీకృతం అవుతుందని పూర్వులు పేర్కొన్నారు. అలాగే రాత్రంతా మేల్కొని, శివ పూజలో నిమగ్నం కావడం కూడా అనాదిగా వస్తున్న సంప్రదాయం. 'జాగరణ' అంటే మేలుకోవడం. మనలో ఉన్న దైవిక శక్తులను మేలుకొలపడానికి, ప్రతికూల వైఖరులను విడిచిపెట్టి... సానుకూల దృక్పథాన్ని పొందడానికి శివరాత్రి ఎంతో అనుకూలమైన రోజు.

అలాగే యోగ సాధకులకు కూడా శివరాత్రి ఎంతో ప్రత్యేకమైనది. యోగ, ధ్యానాలకు శివుడు అధిపతి. ఈ రోజున పలువురు యోగులు, భక్తులు ధ్యానం, యోగా చేస్తారు. రాత్రంతా ధ్యానం చెయ్యడం చాలా శక్తిమంతమైనదనీ, ఆధ్యాత్మిక వృద్ధికి, జ్ఞానానికి దోహదం చేసేది అనీ యోగ గురువులు చెబుతారు. ఇక, శివరాత్రి నాడు అభిషేకాలకు, అర్చనలకు, ప్రార్థనలకు, భజనలకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఆలయ సందర్శనలు, దాన ధర్మాలు కూడా హిందూ సంప్రదాయంలో భాగమే.

పౌరాణికంగా చూస్తే... శివుడు అగ్నిలింగంగా ఉద్భవించిన రాత్రిగా, తాండవ నృత్యాన్ని ప్రదర్శించిన రాత్రిగా, శివపార్వతుల కళ్యాణం జరిగిన రోజుగా, సముద్ర మథనంలో హాలాహలం ఉద్భవించినప్పుడు... దాన్ని తన గళాన నిలిపి సమస్త లోకాలను శివుడు కాపాడిన రోజుగా... ఇలా అనేక కథలు కనిపిస్తాయి. కాగా, తాత్త్వికమైన దృష్టిలో శివరాత్రికి భిన్నమైన ప్రాధాన్యం ఉంది. ఇది దేవుడితో జీవుడు ఏకత్వాన్ని కనుగొనే రోజు. శివుడి సామీప్యాన్ని అనుభూతి చెందే రోజు. 'శివుడు, నేను వేరు వేరు కాదు...' అనే సత్యాన్ని గ్రహించి, మనలో ఉన్న శివుణ్ణి మేల్కొలిపే రోజు.



# 'మూడో కన్ను' తెరుద్దాం!

మానవులతో సహా అన్ని జీవులకూ పరిమితులు ఉన్నాయి. ఉదాహరణకు... ఏదైనా వస్తువును మనం చూస్తున్నామంటే... అది కాంతిని నిరోధించి, పరావర్తనం చెందడమే కారణం. గాలిని మనం చూడలేం. ఎందుకంటే అది కాంతిని అడ్డుకోలేదు. అదే గాలిలో కొద్దిగా పొగ ఉంటే... అది మనకు కనిపిస్తుంది. కాంతిని తనలో నుంచీ వెళ్ళనిచ్చే దేన్నీ మనం చూడలేం. ఇంద్రియాలైన మన రెండు కళ్ళ స్వభావం అది. ఈ ఇంద్రియనేత్రాలు భౌతికమైనవాటినే చూడగలుగుతాయి. మరి భౌతికం కాని వాటిని ఎలా చూడాలి? దానికి మూడో కన్ను కావాలి. కానీ ఎలా?

### ఆ కథ అంతరార్థం...

శివుడు తన మూడో కన్ను తెరవడం గురించి ఒక ప్రసిద్ధమైన కథ ఉంది. కామదేవుడైన మన్మథుణ్ణి జ్వలించే తన మూడో కంటితో శివుడు భస్మం చేసిన కథ అది. ఈ కథకు యోగాకు సంబంధించిన మరో కోణం ఉంది. శివుడు యోగ మార్గంలో కృషి చేస్తున్నాడు. అంటే కేవలం పరిపూర్ణత్వం కోసం కాదు, అపరిమితత్వం కోసం ఆయన ఆ కృషి సాగిస్తున్నాడు. తనలో కామం పెరగడాన్ని ఆయన గ్రహించాడు. ఇక్కడ 'కామం' అంటే అర్థం కేవలం శృంగారపరమైనది అని మాత్రమే కాదు. మనలో కలిగే ప్రతి కోరికా కామమే. అది అధికారం కోసం కావచ్చు, పదవి కోసం కావచ్చు, డబ్బు కోసం కావచ్చు... ఇలా దేని గురించైనా కావచ్చు. మీలో ఒక అసంపూర్ణ భావన ఉంటుంది. 'నాకు అది లేకపోతే... నేను సంపూర్ణం కాదు' అనే భావనతో తపించిపోవడమే కామం. తనలో అలాంటి భావన కలగడంతో... దాన్ని శివుడు దహించాడు. మూడో కన్ను తెరవడం ద్వారా... ఆయన తనలో భౌతికతకు అతీతమైన ఒక పార్శ్వాన్ని చూశాడు. ఇక భౌతికతకు సంబంధించిన నిర్బంధాలన్నీ చెదిరిపోయాయి.

### ఉన్నది ఉన్నట్టుగా ఎలా చూడాలి?

మూడో కన్ను అనేది... భౌతికమైనది కానిదాన్ని చూడగలిగే కంటిని సూచిస్తుంది. భౌతికం కాని వాటిని చూడాలంటే మనకు ఒకే ఒక మార్గం... మనం అంతర్ముఖులం కావడం. ఇక్కడ 'మూడో కన్ను' అనే మాట కేవలం ప్రతీక మాత్రమే. అది నుదుటి మీద మొలిచేదో, పొడుచుకువచ్చేదో కాదు. భౌతికతకు అతీతమైన దాన్ని గ్రహించగలిగే దృష్టి కోణం. మరో అంశం ఏమిటంటే... ఇంద్రియ నేత్రాలు కర్మ కారణంగా కలుషితమై ఉంటాయి. 'కర్మ' అంటే గత చర్యల తాలూకు మిగిలిపోయిన జ్ఞాపకం. మీరు చూసే ప్రతిదీ ఆ కర్మ స్మృతులతో ప్రభావితం అవుతుంది. అది జరగకుండా మనం చెయ్యలేం. ఎవరినైనా మనం చూసినప్పుడు... 'అతను బాగున్నాడు, ఇతను బాగోలేడు, అతను మంచివాడు, ఇతను మంచివాడు కాదు' అని ఆలోచిస్తాం. ఉన్నది ఉన్నట్టుగా మనం దేన్నీ చూడలేం. ఎందుకంటే మన దృష్టినీ, మనం చూడగలిగే సామర్థ్యాన్నీ కర్మ స్మృతి ప్రభావితం చేస్తుంది. ప్రతిదాన్నీ ఉన్నది ఉన్నట్టుగా చూడాలంటే... లోతులకు చొచ్చుకుపోగలిగేదీ, జ్ఞాపకాలతో కలుషితం కానిదీ అయిన ఒక కన్ను తెరుచుకోవాలి. సంప్రదాయపరంగా... భారతదేశంలో జ్ఞానం అంటే పుస్తకాలు చదవడం కాదు, ఎవరి మాటలనో వినడం కాదు, సమాచారాన్ని పోగు చేసుకోవడం కాదు. మనం ఏమిటనేది గ్రహించడం కోసం కొత్త దృష్టిని లేదా అంతర్ దృష్టిని తెరవడం. మనకు సంపూర్ణమైన స్పష్టత వచ్చేది... అంతర్ దృష్టి ఏర్పడినప్పుడు మాత్రమే. అప్పుడు మనలోని స్పష్టతను ప్రపంచంలో ఏ వ్యక్తి, ఏ పరిస్థితి చెదరగొట్టడం సాధ్యం కాదు. అదే నిజమైన జ్ఞానం. అది కలగాలంటే... మనలో మూడో కన్ను తెరుచుకోవాలి. అదే శివుడి మూడో కన్ను మనకు ఇచ్చే సందేశం. శివరాత్రి సందర్భంగా... మీలో 'మూడో కన్ను' తెరుచుకోవడానికి సాధన ప్రారంభించండి.

• సద్గురు జగ్గీవాసుదేవ్

# పిల్లలను బడికి పంపేటప్పుడు...

పిల్లలు ఉన్న ఇంట్లో ప్రతిరోజూ ఉదయం హడావిడిగానే ఉంటుంది. అయినప్పటికీ తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటూ సహనంతో వ్యవహరిస్తే పిల్లలు ఆనందంగా బడికి వెళతారని నిపుణులు చెబుతున్నారు.

- పిల్లలు శారీరకంగా ఆరోగ్యంగా ఎదగడమే కాకుండా మానసికంగా దృఢంగా ఉండేలా చూసుకోవాలి. వాళ్ల భావోద్వేగాలను నిర్లక్ష్యం చేయకూడదు. ఉదయం లేవగానే వాళ్లు చెప్పే మాటలను ఓపికగా విని అర్థం చేసుకోవాలి.
- గట్టిగా మాట్లాడడం, పెద్దగా అరవడం వల్ల పిల్లలు భయాందోళనలకు గురవుతారు. తల్లిదండ్రులు మెల్లగా, మృదు స్వరంతో మాట్లాడుతూ వాళ్లకి అర్థమయ్యే రీతిలో నచ్చచెప్పాలి.
- పిల్లలు ఉదయాన్నే నిద్ర లేవడానికి ఇష్టపడరు. వాళ్లని మెల్లగా తడుతూ మేల్కొలపాలి. ఆలస్యంగా లేవడం వల్ల కలిగే సమయాభావ పరిస్థితులను నిదానంగా వివరించాలి. సమయానికి



బడికి వెళ్లేలా అలవాటు చేయాలి.
- ఉదయం వంట పూర్తవగానే భోజనం, స్నాక్స్ తదితరాలను చక్కగా బాక్సుల్లో సర్దాలి. వాటర్ బాటిల్ నింపి పెట్టాలి. పిల్లలు పెరుగుతున్న క్రమంలో ఈ పనులు పూర్తి చేయడానికి వాళ్ల సహాయం తీసుకోవాలి.
- బడికి వెళ్లేముందు టైమ్ టేబుల్ ప్రకారం పుస్తకాలు సర్దుకోవడం, యూనిఫామ్ వేసుకోవడం, షూ పాలిష్ లాంటి పనులు సొంతంగా చేసుకోవడాన్ని పిల్లలకు నేర్పించాలి.
- పిల్లలకు ఉదయాన్నే పాలు తాగడం, అల్పాహారం తీసుకోవడం అలవాటు చేయాలి.
- పిల్లలు బడికి బయలుదేరేముందు తల్లిదండ్రులు ప్రశాంత వదనంతో వీడ్కోలు చెప్పాలి.
- బడి నుంచి ఇంటికి రాగానే కొంత సమయం విరామం ఇచ్చి పిల్లల చేత హోమ్‌వర్క్ పూర్తి చేయిస్తే ఉదయం లేవగానే ఆందోళన ఉండదు.
- పరీక్షలప్పుడు పిల్లలు ఒత్తిడికి గురికాకుండా ప్రోత్సాహకరమైన మాటలు చెబితే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.
- స్పష్టమైన పదాలతో తేలికపాటి సూచనలు చేస్తూ ఉంటే పిల్లలు అన్ని పనులూ సులభంగానే నేర్చుకుంటారు.

సంకల్పం



# గౌరమ్మ తెచ్చిన గంగమ్మ

**మహాకుంభ మేళాకు వెళ్లి గంగలో మునకేయాలనేది ఆమె కోరిక. ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు. కానీ... ఒంటరిగా శ్రమించి గంగమ్మనే తన ఇంటికి తెచ్చారు. మహాసంకల్పంతో పెరట్లో భావిని తవ్వి... మహాశివరాత్రినాడు అందులో పవిత్ర స్నానం ఆచరించేందుకు సిద్ధమయ్యారు యాభై ఏడేళ్ల కర్ణాటక మహిళ... గౌరీచంద్రశేఖర్. గంగమ్మను భువికి తెచ్చిన గౌరమ్మ కథ ఇది.**

'ప్రయాగరాజ్ మహాకుంభ మేళాకు వెళ్లాలంటే అదృష్టం ఉండాలి. నాకు అంతటి అదృష్టం లేదు. కారణం... నా ఆర్థిక పరిస్థితి. అందుకే ఆ గంగమ్మనే ఇక్కడకు తేవాలనుకున్నాను. దాని కోసం మా ఇంటి వెనుక భావి తవ్వాలని నిర్ణయించుకున్నాను' అంటున్న గౌరీది కర్ణాటక రాష్ట్రం ఉత్తర కన్నడ జిల్లా సిర్సీ గ్రామం. అక్కడ ఆమెకు చిన్నపాటి వ్యవసాయ క్షేత్రం ఉంది. దానిపై వచ్చే ఆదాయంతో ఇల్లు గడవడమే కష్టమైపోవడంతో కొబ్బరి తోటలో కూలి పనికి వెళుతున్నారు. గౌరీకి మహాకుంభ మేళ గురించి గత ఏడాది డిసెంబరులో తెలిసింది. ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లి త్రివేణి సంగమంలో మునగాలని తొలుత భావించారు. అయితే ఖర్చుల లెక్కలు వేసుకొంటే అది తనవల్ల అయ్యే పని కాదని తెలిసి, ప్రయాణం విరమించుకున్నారు.

అలాగని అంతటితో వదిలేయలేదు. గంగ దగ్గరకు తను వెళ్లలేకపోవచ్చు. కానీ ఆ గంగనే తన ఇంటికి రప్పించి తన కోరిక నెరవేర్చుకోవాలని అనుకున్నారు. వెంటనే రంగంలోకి దిగారు. డిసెంబరు 15న భావి తవ్వడం ప్రారంభించారు. రోజుకు ఎనిమిది గంటల చొప్పున శ్రమించారు. తవ్వడం, తవ్విన మట్టిని బయటకు తోడేయడం... వేరొకరి సాయం లేకుండా అన్నీ తానే చేసుకున్నారు. రెండు నెలలు కష్టపడి... 40 అడుగుల లోతు వరకు తవ్వారు. చివరకు ఈ నెల 15న పని పూర్తి చేసి, భువి నుంచి గంగమ్మను పరవళ్లు తొక్కించారు.

'మహాశివరాత్రి పర్వదినాన ఈ గంగలో పవిత్ర స్నానం చేస్తాను' అంటూ ఎంతో ఉద్వేగంగా చెప్పారు గౌరీ. ఎవరి సాయం లేకుండా బావులు తవ్వడం ఆమెకు ఇదే మొదటి సారి కాదు. గతంలో మూడు బావులు తవ్వారు. ఒకటి సాగు కోసం... తన వ్యవసాయ క్షేత్రంలో. మరొకటి తన గ్రామంలో... ప్రజల దప్పిక తీర్చడానికి. మూడోది అంగన్‌వాడీ పాఠశాలలో... విద్యార్థుల కోసం.

### ప్రతిఘటనలు తిప్పికొట్టి...

విద్యార్థులు, టీచర్ల కోసం అంగన్‌వాడీ స్కూల్‌లో బావి తవ్వే క్రమంలో ఆమెకు జిల్లా అధికారుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఇక్కడ అందుకు అనుమతి లేదని, తక్షణమే పనులు ఆపేయాలని డిప్యూటీ కమిషనర్ ఆదేశించారు. బావి తవ్వకం ప్రారంభ సమయంలో వచ్చి, గౌరీని అభినందించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఆ తరువాత అభ్యంతరం వ్యక్తం చేశారు. తవ్వడానికి వీల్లేదని మాట మార్చారు. కానీ గౌరీ ఇవేవీ పట్టించుకోలేదు. నలు



గురికీ ఉపయోగపడే ఒక మంచి పని కోసం వెనకడుగు వేసేది లేదని ఆమె తేల్చి చెప్పారు. అప్పటి స్థానిక ఎంపీ అనంత్‌కుమార్ హెగ్డే మద్దతుతో 45 అడుగుల లోతు వరకు తవ్వి, బావి పూర్తి చేశారు. అందులో నీటి ఊట చూశాక తన మనసు ఆనందంతో ఉప్పొంగిందంటారు గౌరీ. సమాజం కోసం ఆమె చేస్తున్న అలుపెరుగని కృషికి ప్రజలు, ప్రభుత్వం, పలు సంస్థల నుంచి ఎన్నో ప్రశంసలు, అభినందనలు, గౌరవ సత్కారాలు అందుకున్నారు.

ఫ్యాషన్





**సంప్రదాయ వేడుకల్లో తెలుగుతనం ఉట్టిపడాలంటే ఇతరత్రా ఆభరణాలతో పాటు పాదాలకు 'పాయల్' కూడా ధరిస్తూ ఉండాలి. వాటిలో తాజాగా మగువల మనసులను దోచుకుంటున్న డిజైన్లు, మోడల్స్ ఇవే!**

# గజ్జె ఘల్లుమన్నది





**వెండి వెలుగులు:** మువ్వల పట్టీలు అనగానే కళ్లముందు వెండి పట్టీలే మెదులుతాయి. అయితే తాజాగా పాత కాలంనాటి వెడల్పాటి పట్టీల ట్రెండ్ మళ్లీ పునరావృతమైంది. కాబట్టి ఒకటిన్నర అంగుళం వెడల్పు ఉండే పట్టీలు ఎంచుకోవాలి. ఆక్సిడైజ్ చేసినవైనా, చేయనివైనా పరవాలేదు. మరింత ఆకర్షణీయంగా కనిపించడం కోసం ఎనామిల్ లేదా రాళ్లు పొదిగిన పట్టీలు ఎంచుకుంటే చాలు!



**ఆధునిక అలంకరణ:** ఆధునిక వస్త్రధారణకు కాలి పట్టీల అలంకరణ నప్పదేమో అనుకోవలసిన అవసరం లేదు. ఇలాంటి దుస్తులకు నప్పేలా 'సింగిల్ చైన్ యాంక్లెట్స్' కూడా తయారవుతున్నాయి. సన్నగా, మెరుపులీనే నగిషీలతో కూడిన ఈ రకం పట్టీలు ఎంతో సొగసుగా కనిపిస్తాయి. 10 నుంచి 25 గ్రాముల బరువులో దొరికే ఈ పట్టీలు కొనేటప్పుడు లింకులు బలంగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలి. అలాగే రెండు చివర్లూ కలిపే కొక్కెం దృఢంగా ఉండేలా చూసుకోవాలి.

**ముత్యాల పట్టీలు:** మధ్యస్థంగా ఉండే ముత్యాలతో తయారయ్యే ఈ రకం కాలి పట్టీలు నేటి తరం అమ్మాయిలకు చక్కగా నప్పుతాయి. ముత్యాల మధ్యలో వెండి లేదా బంగారంతో తయారైన గుండ్లు జోడించి తయారుచేసే ఈ పట్టీలు అటు సంప్రదాయ వేడుకలకూ, ఇటు ఆధునిక విందు వినోదాల్లో ధరించడానికి అనువుగా ఉంటాయి.


మీడియాతోమాట్లాడుతున్న ఉత్తమ్, చిత్రంలో భట్టి, కోమటిరెడ్డి, జూపల్లి

# బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

- 8మందిని కాపాడేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తున్నాం
- ఇది ఎదురుదెబ్బ మాత్రమే.. ప్రాజెక్టును పూర్తిచేస్తాం: ఉత్తమ్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మందిని రక్షించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో, నిజాయితీగా ప్రయత్నిస్తోందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణాల్లో, టన్నెల్ తవ్వకాల్లో ప్రమాదాలు, విపత్తులు సంభవించడం సాధారణమేనని చెబుతూ.. ఈ ఘటనను ఆసరాగా చేసుకొని బీఆర్ఎస్ నేతలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం టన్నెల్‌లో ఏడుగురు చనిపోయినప్పుడు, కరోనా సమయంలో శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్కేంద్రంలో తొమ్మిది మంది చనిపోయినప్పుడు తాము బీఆర్ఎస్ తరహాలో దిగజారుడు రాజకీయాలు చేయలేదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టాక మూడేళ్లలో కూలిపోవడంతోనే తాము విమర్శలు చేశామని తెలిపారు. టన్నెల్ ప్రాంతంలో కొనసాగుతున్న సహాయక చర్యలను పరిశీలించడానికి డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లితో కలిసి వచ్చిన ఆయన సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడారు. 2005లో ఈ ప్రాజెక్టు ప్రారంభమైందని, నల్లగొండ జిల్లాకు సాగునీరు వస్తుందనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ ప్రభుత్వం పనులు పూర్తిచేయలేదని విమర్శించారు. ఎలాంటి ఖర్చు లేకుండా శ్రీశైలం నుంచి గ్రావిటీ ద్వారా 30 టీఎంసీలను వెనుకబడిన ప్రాంతాల్లోని 3లక్షల ఎకరాలను పారించుకొని సస్యశ్యామలం చేయొచ్చునన్నారు. మొదట్నుంచీ ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుందని, ప్రస్తుతం జరిగిన ప్రమాదం ఎదురుదెబ్బ మాత్రమేనని.. ప్రాజెక్టును పక్కాగా పూర్తిచేసి వెనుకబడిన ప్రాంతాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. టన్నెల్ వద్ద గత నాలుగు రోజులుగా పది ఏజెన్సీలు పనిచేస్తున్నాయని, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ జియోలాజిక్ సర్వే ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆర్మీ, నేవీ మార్కోస్ కమాండోస్, ర్యాట్ హోల్ మైనర్స్, నేషనల్ హైవే డిజాస్టర్ కార్పొరేషన్, హైడ్రా, ఇతర ప్రైవేటు కంపెనీలు ఇందులో భాగస్వాములుగా ఉన్నాయని వివరించారు దేశంలో జరిగిన టన్నెల్ ప్రమాదాలతో పోలిస్తే ఇది పూర్తిగా భిన్నమని, ఉత్తరాఖండ్ టన్నెల్‌కు రెండువైపులా ఎగ్జిట్ ఉన్నదన్నారు. ఈ టన్నెల్‌లో ఎగ్జిట్ లేదని అదే సహాయక చర్యలను సంక్లిష్టం చేస్తోందన్నారు. సైడ్ నుంచి, పై నుంచి ఆ ప్రాంతానికి వెళ్లే ప్రణాళికలను కూడా పరిశీలిస్తున్నామని వివరించారు.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఘటనపై నివేదిక ఇవ్వండి

● తెలంగాణకు జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ ప్రమాదంపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్ఏ) స్పందించింది. ఈనెల 22న ఉదయం 8:30 గంటలకు ఇన్‌లెట్ (దోమలపెంట) నుంచి పనులు జరుగుతున్న టన్నెల్ పై కప్పు కూలి... 8 మంది చిక్కుకుపోయిన విషయం విదితమే. అయితే టన్నెల్ లోపలి భాగంలో చిక్కుకుపోయిన వారిని బయటికి సురక్షితంగా రప్పించడానికి వీలుగా ఆర్మీ, నేవీ, మార్కోస్ కమాండోస్, జాతీయ విపత్తుల స్పందన సంస్థ(ఎన్‌డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తుల స్పందన సంస్థ (ఎస్‌డీఆర్ఎఫ్)తో పాటు సింగరేణి, హైడ్రా, నవయుగ, ఎల్ అండ్ టీ టన్నెల్ నిపుణులు, జాతీయ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)కు చెందిన బృందాలు రంగంలోకి దిగాయి. దాంతో ఈ ఘటనపై నివేదిక కోరుతూ ఎన్‌డీఎస్ఏ సదరన్ రీజియన్ రీజినల్ డైరెక్టర్ లేఖ రాశారు.

# సన్నగిల్లుతున్న ఆశలు!

**96 గంటలు గడిచినా అంతుచిక్కని సిబ్బంది ఆచూకీ**

- టన్నెల్‌లో పేరుకుపోయిన బురద.. ఉబికివస్తున్న ఊట
- 13.6 కి.మీ నుంచి 13.850 కి.మీ మధ్య మట్టి దిబ్బలే
- 15 ఫీట్లు, 10 వేల క్యూబిక్ మీటర్లలో బురద, వ్యర్థాలు
- 4వేల నుంచి 5వేల లీటర్ల దాకా ఉబికి వస్తున్న నీరు


ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపల ముమ్మరంగా సహాయక చర్యలు


ప్రమాదం జరిగిన ప్రాంతంలోని రాళ్లు, మట్టి

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూలు/దోమలపెంట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్బీసీ) సొరంగం ప్రమాదం సంభవించి నిమిషాలు.. గంటలు.. రోజులు గడిచిపోతున్నాయి. లోపల చిక్కుకున్న ఆ ఎనిమిది మంది సిబ్బంది జాడ మాత్రం తెలియరావడం లేదు. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నా.. కూలిన మట్టిదిబ్బలు, పేరుకుపోయిన బురదకు తోడు భారీగా ఉబికి వస్తున్న నీటితో తీవ్ర ఆటంకాలు ఏర్పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గంటలు గడుస్తున్నకొద్దీ ఆశలు సన్నగిల్లుతున్నాయి. ప్రమాదం జరిగి.. సిబ్బంది లోపల చిక్కుకుపోయి మూడు రోజులు గడిచిపోయాయి. సహాయక చర్యలు ఫలిస్తాయని గానీ, చిక్కుకుపోయిన వారిని ప్రాణాలతో బయటకు తీసుకొచ్చే పరిస్థితులు ఉన్నాయని గానీ సహాయక బృందాలే గట్టిగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. అందునా.. సిబ్బంది చిక్కుకుపోయిన చోట 40 మీటర్ల పరిధిలో మట్టి దిబ్బలు కూలే పరిస్థితులు ఏర్పడటం.. లోపల పేరుకుపోయిన మట్టిదిబ్బలను తొలగిస్తే మరో 50 మీటర్ల మేర టన్నెల్ కూలిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తుండటం మరింత కలవరపాటుకు గురిచేస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట శివారులో ఉన్న ఈ ప్రాజెక్టులో శనివారం ఉదయం సొరంగం పైకప్పు కూలిన ఘటనలో పనుల్లో ఉన్న ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు మెషీన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు కలిపి మొత్తం ఎనిమింది టన్నెల్ లోపల గల్లంతయ్యారు. శ్రీశైలం జలాశయం వైపు నుంచి సొరంగం మొదలై పనులు జరుగుతున్న 13.8 కి.మీ వద్ద టన్నెల్ కూలింది. అక్కడే ఈ ఎనిమిది మంది చిక్కుకుపోయారు. 13.6 కి.మీ నుంచి 13.850 కి.మీ వరకు.. దాదాపు 250 మీటర్ల మేర ఎక్కడికక్కడ మట్టిదిబ్బలు కూలిపోయాయి. 15 ఫీట్లు, 10 వేల క్యూబిక్ మీటర్లలో బురద, వ్యర్థాలు పేరుకుపోయాయి. 4వేల నుంచి 5వేల లీటర్ల దాకా నీరు ఉబికి వస్తోంది. ఇవన్నీ సహాయక చర్యలకు ప్రతిబంధకంగా మారాయి. శనివారం అర్ధరాత్రి నుంచి మంగళవారం వరకు 10 దఫాలుగా సహాయక బృందాలు లోపలికి వెళ్లినా పేరుకుపోయిన బురద, వెల్లువలా ఉబికివస్తున్న నీరు కారణంగా ముందుకు వెళ్లే పరిస్థితులు లేకపోవడంతో వెనక్కి వచ్చేశారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు వివిధ ఏజెన్సీలకు చెందిన 52 మంది సొరంగం లోపలికి వెళ్లి సాయంత్రం 5:30 గంటలకు బయటకొచ్చారు. ఆ తర్వాత మరో బృందం టన్నెల్‌లోకి వెళ్లింది. సోమవారంతో పోల్చితే కొంత ఇనుప వ్యర్థాలను పక్కకు జరిపినట్లు తెలుస్తోంది. సిబ్బంది చిక్కుకుపోయిన 13.8 కి.మీ పాయింటు నుంచి 40 మీటర్ల పరిధి వరకు ప్రదేశం చాలా సున్నితంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఆ 40 మీటర్ల పరిధిని త్వరగా క్లియర్ చేసేందుకు తొలుత ప్రొక్లెయిన్‌లను ఉపయోగించాలని నిర్ణయించినప్పటికీ మరింత నష్టం జరిగే అవకాశాలుంటాయని, సహాయక బృందాలు కూడా ప్రమాదంలో పడే అవకాశాలుంటాయని కంపెనీ ప్రతినిధులు హెచ్చరించారు. ఫలితంగా కన్వేయర్ బెల్టు ద్వారానే బురదను తరలించాలని నిర్ణయించారు. అయితే ప్రమాద తీవ్రతకు దాదాపు రెండు కి.మీ మేర కన్వేయర్ బెల్టు దెబ్బతింది. దీన్ని మరమ్మతులను మంగళవారం ప్రారంభించారు. బుధవారం ఉదయం వరకు కన్వేయర్ బెల్టును అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. కన్వేయర్ బెల్టు అందుబాటులోకి వస్తే గంటకు 800 క్యూబిక్ మీటర్ల బురదను క్లియర్ చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రొక్లెయిన్ వెళ్లేందుకు అనువుగా ఐరన్ వ్యర్థాలను తొలగిస్తున్నారు. తర్వాత ప్రొక్లెయిన్‌ను ఉపయోగించి కన్వేయర్ బెల్టుతో బురదను బయటకు పంపిస్తారు. .

### సెగ్మెంట్ బ్లాకులు కుంగి మట్టి దిబ్బలపై..

ఎస్ఎల్బీసీ టన్నెల్లో కూలిన మట్టిని తరలించే ప్రయత్నం చేస్తే పెను ప్రమాదం తప్పదని నిపుణులు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు. సొరంగంలో నీటి ఊట, మట్టి, రాళ్లు కూలి పడిన నేపథ్యంలో వాటిని తొలగించే ప్రయత్నం చేస్తే మరో 50 మీటర్ల దూరం టన్నెల్ కుప్పకూలే ప్రమాదం ఉందని లేఖలో పేర్కొన్నారు. సెగ్మెంట్ బ్లాకులు కుంగి మట్టిదిబ్బలను ఆసరాగా చేసుకొని ఉన్నాయని అంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు స్నిఫర్ డాగ్స్‌తో ర్యాట్ హోల్ మైనర్స్ లోపలికి వెళ్లారు. మెగా ఇంజనీరింగ్ కంపెనీకి చెందిన 22 మంది సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌కు చెందిన 52 మంది లోపలికి వెళ్లారు. ప్రత్యేకించి ర్యాట్ హోల్ మైనర్స్ టన్నెల్‌లో కూలిన మట్టిదిబ్బల ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ సెగ్మెంట్ బ్లాకుల్లో ఏర్పడిన పగుళ్లను గుర్తించారు. దీంతో అది కూడా కూలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వెనక్కి వెళ్లాలంటూ తమను అనుసరించిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం ఎన్‌జీఆర్ఐ (నేషనల్ జియోలాజికల్ రీసర్చ్ ఆఫ్ ఇండియా), ఎన్ఆర్ఎస్ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ) ఆధ్వర్యంలో సహాయక చర్యలకు సంబంధించిన ప్రణాళిక చేయనున్నారు. ఈ బృందాల సభ్యులు లోపలకు వెళ్లి అక్కడ మట్టి నమూనాల ద్వారా సున్నిత ప్రదేశాలను నిర్దేశించడం, సాయిల్, ఖనిజాల పరిస్థితిని అంచనా వేయడం, రిమోట్ సెన్సింగ్ ద్వారా లోపల చిక్కుకున్న వారి జాడను కనుక్కోవడం వంటివి చేయనున్నారు. ఎన్‌హెచ్ఐడీసీఎల్ (నేషనల్ హైవేస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నుంచి నిపుణుల సలహాలను తీసుకుంటున్నారు.ప్రస్తుతం జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలు, ఆర్మీ, నేవీ, సింగరేణి కలిపి 584 మంది సహాయక చర్యల్లో పాల్గొంటుడగా వీరికి బుధవారం నుంచి జీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐ, ఎన్ఆర్ఎస్ నుంచి మరికొంతమంది తోడవుతారు.

# కదిలిస్తే కన్నీరే

**ఝార్ఖండ్ నుంచి టన్నెల్ వద్దకు బాధిత కుటుంబాలు**

- తమ వారి కోసం ఎదురుచూపులు

మహబూబ్‌నగర్/దోమలపెంట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మరోపక్క, టన్నెల్ చిక్కుకున్న కార్మికుల కుటుంబసభ్యులు దోమలపెంట శిబిరానికి చేరుకుంటున్నారు. ఝార్ఖండ్‌లోని కాంబియా కుంబటోలి అనే గ్రామానికి చెందిన సంతోష్ సాహు, సందీప్ సాహు, జగ్తా ఎక్కేస్ అనూజ్ సాహు టన్నెల్‌లో చిక్కుకోగా.. వారి కుటుంబసభ్యులను ఝార్ఖండ్ ప్రభుత్వం దోమలపెంటకు తీసుకొచ్చింది. నిరుపేద కుటుంబాలకు చెందిన వీరంతా తమ బాధను దిగమింగుకుని ఒకరికొకరు ధైర్యం చెప్పుకుంటూ తమ వారి కోసం ఎదురుచూస్తున్నారు. వారిని 'ఆంధ్రజ్యోతి' పలకరించగా తమ కష్టాన్ని వివరిస్తూ కంటతడి పెట్టుకున్నారు.

### బావ రాకపోతే అక్కాపిల్లలకు తోడెవరు?



భార్యాబిడ్డలను పోషించుకునేందుకు మా బావ సంతోష్ సాహు ఇంత దూరం వచ్చాడు. సొరంగం పనులు చేసి కుటుంబాన్ని(భార్య, ముగ్గురు పిల్లలు) చూసుకుంటున్నాడు.. ఆయనకు ఏమైనా జరిగితే మా అక్క, ఆమె పిల్లలకు తోడునీడ లేకుండా పోతుంది.

- పవన్ సాహు, బాధితుడు సంతోష్ సాహు బావమరిది

### జీతం ఇస్తే ఇంటికొస్తా



సందీప్ సాహు నా పెద్ద కొడుకు, మూడు నెలల జీతం ఇవ్వగానే ఇంటికొస్తా అని వారం క్రితమే మాతో ఫోన్‌లో చెప్పాడు. ఇంటి దగ్గరే ఉండి ఏదైనా పని చేసుకోమని చెబితే... కొంత డబ్బు సంపాదిస్తే మన కుటుంబం బాగుపడుతుందని చెప్పి మూడు నెలల క్రితం ఇక్కడికి వచ్చాడు. ఇప్పుడు ఇలా అయింది. ఎప్పుడు బయటకు వస్తాడో అని ఎదురుచూస్తున్నాను.

- జీతు సాహు, బాధితుడు సందీప్ సాహు తండ్రి

### నేనే అమ్మని పోషిస్తానని చెప్పాడు



వచ్చిన పని చేసుకుంటూ సొంతూరిలో ఉండాలని మా తమ్ముడికి చాలాసార్లు చెప్పాం. కానీ, సొంతంగా డబ్బు సంపాదించి తండ్రి లేని ఇంటిని, తల్లిని పోషించుకుంటానని చెప్పేవాడు. మా పక్క ఊరి వాళ్లు చాలామంది ఇక్కడ పనిచేసుకుంటున్నారు. 2017లో ఇక్కడికి వచ్చిన జగ్తా ఎక్కేస్ ఎనిమిదేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం చివరిగా ఇంటికొచ్చాడు. ఇంటికి వస్తే ఏదైనా చిన్నవ్యాపారం పెట్టిసా అని చెప్పినా వినలేదు. చివరకు సొరంగంలో చిక్కుకున్నాడని తెలిసి మా కుటుంబమంతా ఆందోళనలో ఉంది. తమ్ముడు క్షేమంగా రావాలని కోరుకుంటున్నా

- జాత్రం ఎక్కేస్, బాధితుడు జగ్తా ఎక్కేస్ అన్న

### లోపల కొడుకు ఎట్లుండో



నా పెద్ద కొడుకు అనూజ్ సాహును ఎంతో గారాభంగా పెంచాం. కుటుంబానికి ఆర్థికంగా చేదోడువాదోడుగా ఉంటానని చెప్పి సొరంగం పనులు చేసేందుకు ఇక్కడికి వచ్చాడు. గ్రామంలో మాకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసుకోవడంతోపాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాం. సొరంగంలో జరిగిన ప్రమాదం కోసం శనివారం సాయంత్రం మాకు తెలిసింది. లోపల మా అబ్బాయి ఎలా ఉన్నాడనేది కంపెనీ వారు చెప్పడం లేదు. బయటకు వస్తున్నారని మాత్రమే చెబుతున్నారు. ఏం అర్థం కావడం లేదు.

- రాంప్రతాప్ సాహు, బాధితుడు అనూజ్ సాహు తండ్రి



## జపాన్ వెళ్తున్న దేవర



జపాన్‌లో జూనియర్ ఎన్టీఆర్ సినిమాలకు మంచి క్రేజ్ ఉంది. ఇప్పటికే అక్కడ విడుదలైన బాద్‌షా, ఆర్ఆర్ఆర్ చిత్రాలు భారీ కలెక్షన్లు సాధించాయి. ఆర్ఆర్ఆర్ అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా సరికొత్త రికార్డును సృష్టించింది. ఇప్పుడు ఎన్టీఆర్ తాజా చిత్రం 'దేవర' ఈ ఏడాది మార్చి 28న ఇక్కడి థియేటర్లలో సందడి చేయనుంది. ఈ విషయాన్ని స్వయంగా చిత్రబృందం ప్రకటించింది. ఇందులో భాగంగా మార్చి 22న ఎన్టీఆర్ జపాన్ వెళ్లి ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాలలో పాల్గొననున్నట్లు తెలిసింది.

## హిట్ ఫిల్మ్ అనే నమ్మకం ఉంది


నక్కిన త్రినాథరావు

'ఇప్పటివరకూ 'మజాకా' చిత్రాన్ని చూసినవాళ్లంతా 'బాగుంద'ని మెచ్చుకున్నారు. నూటికి నూరుశాతం హిట్ ఫిల్మ్ అనే నమ్మకం ఉంది. అది ఏ స్థాయి హిట్‌గా నిలుస్తుందనేది ఫస్ట్‌షో పడ్డాక తెలుస్తుంది' అని దర్శకుడు త్రినాథరావు నక్కిన అన్నారు. సందీప్‌కిషన్, రావు రమేశ్ ప్రధాన పాత్రధారులుగా త్రినాథరావు తెరకెక్కించిన చిత్రమిది. నేడు విడుదలవుతోన్న సందర్భంగా ఆయన మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు. "ధమాకా' సమయంలో నాకు ప్రసన్న కుమార్ ఈ కథ చెప్పారు. కథానుసారం రావు రమేశ్ పాత్రకు ప్రాధాన్యం ఉంటుంది. ఆయనది హీరో పాత్రకు సరితూగే పాత్ర. పెళ్లికోసం రావు రమేశ్, సందీప్‌కిషన్ చేసే ప్రయత్నాలు వినోదం పంచుతాయి. పతాకసన్నివేశాల్లో భావోద్వేగాలు ప్రేక్షకులను మెప్పిస్తాయి. నిర్మాతలు రాజేశ్, అనిల్ దర్శకుడిగా నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. రవితేజ గారితో 'డబుల్ ధమాకా' చేసేందుకు కథను సిద్ధం చేసే పనిలో ఉన్నాను' అని చెప్పారు.

# చిత్రజ్యోతి

SINCE 1965

## ప్రభాస్ స్పిరిట్.. మరో నాలుగు!




బాలీవుడ్‌లో నిర్మాత భూషణ్‌కుమార్ హవా బాగా నడుస్తోంది. వచ్చే రెండేళ్ల కాలంలో ఏకంగా ఐదు భారీ చిత్రాలు నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. వీటిల్లో మన ప్రభాస్ నటించే 'స్పిరిట్' ఒకటి. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహించే ఈ సినిమా షూటింగ్ ఇంకా ప్రారంభం కాలేదు. అలాగే భూషణ్ ప్లాన్ చేస్తున్న మరో భారీ ప్రాజెక్టు 'ధమాల్ 2'. ఇక నిర్మాణంలో ఆయన చిత్రాల విషయానికి వస్తే అజయ్ దేవగణ్, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా నటిస్తున్న 'దే దే ప్యార్ దే 2' షూటింగ్ పాటియాలాలో జరుగుతోంది. అలాగే దర్శకుడు అనురాగ్ సింగ్ రూపొందిస్తున్న 'బోర్డర్ 2' చిత్రం షూటింగ్ ఝాన్సీలో జరుగుతోంది. సన్నీ డియోల్, వరుణ్ ధావన్ ఇందులో నటిస్తున్నారు. ఇక ముంబై అనురాగ్ బసు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న లవ్‌స్టోరీ షూటింగ్ దశలో ఉంది. కార్తిక్ ఆర్యన్, శ్రీలీల జంటగా నటిస్తున్నారు. మరో చిత్రం 'తేరే ఇష్క్ మే' ఢిల్లీలో షూటింగ్ జరుపుకొంటోంది.

# సీఎం రేవంత్‌కు కనీస అవగాహన లేదు

(మొదటి పేజీ తరువాయి)

దశాబ్దాల కిందట జరిగిన ముంబై పేలుళ్ల కేసులో నిందితుడు అమెరికాలో తలదాచుకుంటే, అతడిని రప్పించడం కోసం ఎంతో పోరాటం చేస్తే, అక్కడి న్యాయస్థానం ఇటీవల అనుమతి ఇచ్చింది. ఇలాంటి నేపథ్యంలో ఏమీ తెలియకుండా నోటికొచ్చినట్లు మాట్లాడటం ఎంత వరకు సమంజసం..? రేవంత్‌కు పాలనా అనుభవం లేకపోవడం, ఆయన దుందుడుకు విధానాలతో తెలంగాణ నష్టపోతోంది. ఆయన వ్యాఖ్యలతో రాష్ట్రం నవ్వులపాలయ్యే పరిస్థితి ఏర్పడింది" అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇస్తే, దానిని తేల్చే బాధ్యత తమదే అని స్పష్టం చేశారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేశారు. రాహుల్ గాంధీ మెప్పు కోసమే సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రధాని మోదీని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ అసమర్థత, చేతగానితనాన్ని బీజేపీపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. మెట్రో ప్రాజెక్టు రెండో దశను తానెక్కడ అడ్డుకున్నానో రేవంత్ చెప్పాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. 'ఆ ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధమైందా..? నిధులు ఎక్కడి నుంచి తెస్తున్నారో చెప్పారా..?' అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ఔటర్ రింగ్‌రోడ్డు, ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంలో జరిగిన అవకతవకలపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ దర్యాప్తుకు డిమాండ్ చేసిన రేవంత్.. సీఎం అయ్యాక మాట మార్చారని విమర్శించారు. కృష్ణా జలాల్లో వాటా కోసం సమష్టిగా, రాజకీయాలకు అతీతంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

### 15 రోజుల్లో రాష్ట్రానికి కొత్త అధ్యక్షుడు..?

రాష్ట్ర బీజేపీకి 15 రోజుల్లో కొత్త అధ్యక్షుడు వచ్చే అవకాశం ఉందని కిషన్‌రెడ్డి వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాలన్నింటికీ కలిపి ఒకేసారి అధ్యక్షుల ఎన్నిక ప్రకటన వెలువడవచ్చని చెప్పారు. రాష్ట్రంలో రబీకి 9.8లక్షల టన్నుల యూరియా అవసరమని కేంద్ర, రాష్ట్ర అధికారుల సంయుక్త సమావేశంలో అంచనా వేయగా.. 10 లక్షల టన్నుల మేర కేంద్రం విడుదల చేసిందని వెల్లడించారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత వల్ల యూరియా కోసం మళ్లీ రైతులు చెప్పులను క్యూలో ఉంచాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. తాను ఆదిలాబాద్ జిల్లాలో ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు ఎరువుల కొరతపై రైతులు ఆవేదన వ్యక్తం చేయగా.. కేంద్ర మంత్రి జేపీనడ్డాతో మాట్లాడి అదనంగా 48వేల టన్నుల ఎరువులను రాష్ట్రానికి ఇప్పించానని చెప్పారు. ఎరువుల కొరత లేదంటూ కొంత మంది ఉన్నతాధికారులు తనకు చెప్పడం విస్మయం కలిగించిందన్నారు.

### ఉద్యోగుల సమస్యలపై మాట్లాడరా..?: ఈటల

హుజూరాబాద్/మద్నూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి సభ పెడితే.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇస్తారేమోనని ఆశించామని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. 317 జీవో సవరిస్తామనో, 5డీఏలు విడుదల చేస్తామనో, హెల్త్ కార్డులు ఇస్తామనో, సీపీఎస్ రద్దు గురించో చెప్తాడనోని భావించామని.. ఒక్క హామీ కూడా ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఈటల మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగికి రావాల్సిన బెనిఫిట్స్ కోసం 8శాతం లంచం ఇవ్వాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతుందని రేవంత్‌రెడ్డికి భయం పట్టుకుందని ఎంపీ డీకే అరుణ ఆరోపించారు.

## బడిలో తెలుగుభాష.. ఇక నిక్కచ్చిగా అమలు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు తగిన పర్యవేక్షణ చేపట్టాలని సూచించింది. విద్యార్థులకు సరళమైన విధానంలో బోధించడం, వారిలో అభిరుచిని పెంపొందించడానికి వీలుగా 9, 10 తరగతుల పాఠ్యాంశంగా 'వెన్నెల' అనే తెలుగు వాచకం పుస్తకాన్ని తీసుకొచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిన 'సింగిడి' పుస్తకం స్థానంలో సరళమైన భాషలో ఈ 'వెన్నెల' పుస్తకాన్ని రూపొందించింది. దీని వినియోగానికి సంబంధించి పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి డా.యోగితా రాణా మంగళవారం మెమో జారీ చేశారు. ఈ పుస్తకం ఆధారంగా సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ బోర్డుల యాజమాన్యాలు 10వ తరగతి పరీక్షలు నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటిలో తెలుగు భాషను తప్పనిసరి చేస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం చట్టం తెచ్చింది. రాష్ట్రంలోని ప్రభుత్వ రంగంలో గల జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలతో పాటు ప్రైవేటు రంగంలోని సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ బోర్డుల అజమాయిషీ కింద గల పాఠశాలల్లో 9, 10 తరగతులకు తెలుగు భాషను తప్పనిసరిగా బోధించాలని చట్టంలో పొందుపర్చింది. ఈ చట్టం 2018 మార్చి 30 నుంచి రాష్ట్రంలో అమల్లోకి వచ్చింది. కానీ... వివిధ కారణాల వల్ల గత బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిని సక్రమంగా అమలు చేయలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. తమ హయాంలో తెలుగు భాషను తప్పకుండా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ బోధించే పాఠశాలల యాజమాన్యాలతో అధికారులు తాజాగా సమావేశాన్ని నిర్వహించారు. చాలావరకు సీబీఎస్సీ పాఠశాలలు తెలుగును అమలు చేస్తున్నాయి. ఇతర సిలబస్ స్కూళ్లలోనూ వందశాతం అమలు లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. వచ్చే విద్యాసంవత్సరం (2025-26) నుంచి 9 తరగతి విద్యార్థులకు, 2026-27 నుంచి 10 తరగతి విద్యార్థులకు 'వెన్నెల' తెలుగు వాచకాన్ని బోధించాలని, దీని ఆధారంగా పరీక్షను కూడా నిర్వహించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తాజా మెమో ద్వారా పాఠశాల యాజమాన్యాలను ఆదేశించింది.

# మాది ఇండియా టీం.. కాంగ్రెస్‌ది పాకిస్థాన్ టీం

## ఎమ్మెల్సీ ఎన్నికల మ్యాచ్‌లో పాక్‌ను చిత్తుగా ఓడిస్తాం

- కేసీఆర్ కుటుంబాన్ని టచ్ చేసే దమ్ము లేదా? : బండి సంజయ్



కరీంనగర్, హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): 'మొన్న జరిగిన చాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై ఇండియా గెలిచింది. బీజేపీది ఇండియా జట్టు. పాకిస్థాన్ గెలిస్తే సంబురాలు చేసుకునే ఎంఐఎంతో అంటకాగుతున్న కాంగ్రెస్‌ది పాకిస్థాన్ జట్టు. గురువారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల మ్యాచ్‌లోనూ గెలుపు బీజేపీదే. పాకిస్థాన్ (కాంగ్రెస్)ను చిత్తు చేసి తీరుతాం' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ 14 నెలల పాలన బాగుందని విర్రవీగుతున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను రెఫరెండంగా తీసుకునేందుకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. ఎమ్మెల్సీ ఎన్నికల క్రికెట్ మ్యాచ్‌లో బీఆర్ఎస్ జట్టే లేదు... ఆ టీంకు సభ్యులే లేక మ్యాచ్ నుండి వైదొలగింది అని ఎద్దేవా చేశారు. మంగళవారం కరీంనగర్‌లో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. 'ఫోన్ ట్యాపింగ్‌కేసుపై హైకోర్టులో పిటిషన్ వేసి సీబీఐ విచారణ జరిపించాలని కోరితే మీ ప్రభుత్వం ఒప్పుకోని విషయం నిజంకాదా? మీరు అధికారంలోకి వచ్చిన తర్వాతే నిందితులు విదేశాలకు పారిపోయింది నిజం కాదా? కేసీఆర్ చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేశామని నిందితులు చెప్పినా ఆయనకు నోటీసు ఎందుకివ్వలేదు' అని ప్రశ్నించారు. 'ఫాంహౌజ్ డ్రగ్స్ కేసులో కేటీఆర్ ఉన్నాడని చెప్పింది మీరు కాదా? ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ వల్లే ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైందని సీఎం హోదాలో చెప్పిన మీరు, ఆయన్ను ఎందుకు అరెస్టు చేయించలేదు? కాళేశ్వరంపై ఏడాది గా విచారణ కమిషన్ గడువును పొడిగిస్తున్నారే తప్ప కేసీఆర్‌ను ఎందుకు విచారించలేదు? విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై లోకూర్ కమిషన్ నివేదిక ఎందుకు బయటపెట్టలేదు? కేసీఆర్ కుటుంబాన్ని టచ్‌చేసే దమ్ము లేదా?' అని నిలదీశారు. కేసును సీబీఐకి అప్పగించాలని, దోషులందరినీ అరెస్టు చేసి బొక్కలో వేస్తామని తేల్చిచెప్పారు.

### చెప్పేందుకు ఏమీ లేకనే హిందూస్థాన్.. పాకిస్థాన్ అంటున్నారు: సీతక్క

చెప్పుకునేందుకు ఏమీలేకనే బండి సంజయ్ నోరు తెరిస్తే హిందుస్థాన్.. పాకిస్థాన్.. హిందూ.. ముస్లిం.. అంటున్నారని మంత్రి సీతక్క అన్నారు. సంజయ్ వ్యాఖ్యలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టభద్రులకు బీజేపీ చేసిందేమీ లేదని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లడిగే నైతిక హక్కు ఆ పార్టీకి లేదని అన్నారు.

### మోదీ పెద్ద బీసీ.. నేను చిన్న బీసీనా?

ప్రధాని మోదీని పెద్ద బీసీ అని, తనను చిన్న బీసీ అని మొత్తం బీసీ సమాజాన్ని రేవంత్‌రెడ్డి అవమానించారన్నారు. మోదీ బీసీయే కాదని చెప్పిన ముఖ్యమంత్రే.. ఇప్పుడు ఆయన పెద్ద బీసీ అంటున్నారని బండి సంజయ్ విమర్శించారు. తెలంగాణలో ఎప్పటి నుంచో దూదేకుల కులానికి రిజర్వేషన్లు అమలవుతున్నాయని, దీనిపై తాము అభ్యంతరం చెప్పలేదన్నారు. కానీ, 12.5 శాతం ఉన్న ముస్లిం జనాభాలో 8.8 శాతం మందిని బీసీల్లో కలుపుతామంటే ఎందుకు ఒప్పుకుంటామని, నూటికి 88 మంది ముస్లింలను బీసీల్లో కలిపి నిజమైన బీసీల పొట్టగొడతారా? అని ప్రశ్నించారు. రూ.15వేల కోట్ల ఖర్చయ్యే మూసీ ప్రక్షాళనను కాంగ్రెస్ అగ్రనేత అల్లుడి కోసం రూ.1.5 లక్షల కోట్లకు పెంచి కమీషన్లు దండుకోవాలనుకుంటే కేంద్రం ఎందుకు సహకరిస్తుందని ప్రశ్నించారు. వెనుకబాటు ఆధారంగా కేంద్రం ఆయా రాష్ట్రాలకు నిధులను పంపిణీ చేస్తుందని గుర్తుచేస్తూ.. తెలంగాణకు రూపాయికి 42 పైసలే కేంద్రం ఇస్తోందంటూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టాలని సీఎం భావిస్తున్నారని విమర్శించారు. ఆదిలాబాద్, ములుగు వంటి వెనుకబడిన జిల్లాలకు అధిక నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయడం లేదా అని ప్రశ్నించారు.

## రెడ్డి సామాజిక వర్గంపై కొందరి విమర్శల్ని తప్పుగా తీసుకోకండి



- కాంగ్రెస్‌లో అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ఉంటుంది
- అందరితో కలిసిపోయే సంప్రదాయం మనది
- పార్టీలోకి మధ్యలో వచ్చిన కొందరు ఇతర కులాల నేతలవి అవగాహన లేని మాటలు
- ముందునుంచీ కాంగ్రెస్‌లో ఉన్న ఇతర కులాల నేతల మాటలు కేవలం భావోద్వేగంతో మాట్లాడినవే
- సామాజికవర్గంపై వ్యతిరేకతతో మాట్లాడినవి కావు
- రెడ్డి సామాజికవర్గం రాష్ట్రంలో నాయకత్వ స్థానంలో ఉంది
- సామాజిక వర్గం వారంతా పెద్ద మనసుతో ఉండాలి
- టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణలోని రెడ్డి సామాజిక వర్గ బంధువులకు, సోదరులకు నా విజ్ఞప్తి! కాంగ్రెస్ పార్టీలోని ఇతర కులాలకు చెందిన కొంతమంది నాయకులు.. రెడ్డి సామాజిక వర్గంపై చేసిన విమర్శలు తప్పుగా తీసుకోకండి. వారి వ్యాఖ్యల పట్ల అన్యథా భావించకుండా.. మన సోదరులు చేసిన వ్యాఖ్యలుగానే భావించండి" అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. కాంగ్రెస్‌లో నాయకులకు తమ అభిప్రాయాలు వెల్లడించే హక్కు, స్వేచ్ఛ ఉంటుందన్నారు. తెలంగాణలోని అన్ని గ్రామాల్లోనూ.. అన్ని కులాలు, మతాల వారితో రెడ్డి సామాజిక వర్గం వారు సఖ్యత, స్నేహంతో కలిసి మెలిసి జీవిస్తారని, ఇది పూర్వం నుంచి వస్తున్న సంప్రదాయమని చెప్పారు. ఆయా వర్గాల వారికి ఎలాంటి సమస్య.. కష్టం వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేసే సామాజిక వర్గం.. రెడ్డి సామాజిక వర్గమన్నారు. అందుకే ఇన్నేళ్లుగా రెడ్డి సామాజిక వర్గం పట్ల ప్రజలు ఇంత ప్రేమ, ఆప్యాయత చూపిస్తున్నారన్నారు. కొంతమంది చేసిన వ్యాఖ్యలకు బాధపడి, తప్పుగా అనుకుని కాంగ్రెస్ పట్ల వ్యతిరేక భావనతో ఉండొద్దన్నారు. కాంగ్రెస్‌లోకి మధ్యలో వచ్చిన కొంతమంది ఇతర కులాల నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, కానీ.. ముందునుంచీ కాంగ్రెస్‌లోనే ఉన్న కొందరు ఇతర కులాల నాయకులు ఇటీవల మాట్లాడిన మాటలు మాత్రం కేవలం భావోద్వేగంతో మాట్లాడినవేనని తెలిపారు. రెడ్డి సామాజికవర్గం ప్రస్తుతం రాష్ట్రంలో నాయకత్వస్థానంలో ఉందని, ఈ సామాజికవర్గం వారంతా పెద్ద మనసుతో.. ఓపికగా ఉండాలని మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు.

## దుబాయ్‌లో తెలుగు సినీ నిర్మాత మృతి

(మొదటి పేజీ తరువాయి)

వేడుకకు పరిశ్రమలోని ముఖ్యులు అనేకులు హాజరైన తరుణంలో ఈ దుర్ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. ఈ వేడుక అనంతరం దుబైలో సోమవారం రాత్రి మిత్రులతో పార్టీకి హాజరైన కేదార్ అనంతరం తన ఫ్లాట్‌లో నిద్రపోయాడు. నిద్రలోనే మృతి చెందాడని సమాచారం. మరణానికి అనారోగ్యమా? మరింకేమైనా కారణం ఉందా? తేలాల్సి ఉంది. కేదార్ నిద్రించిన ఫ్లాట్‌లోనే తెలంగాణకు చెందిన మాజీ ఎమ్మెల్యే కూడా బస చేసినట్లు సమాచారం. ఆ మాజీ ఎమ్మెల్యేను దుబాయి పోలీసులు ప్రశ్నిస్తున్నట్లు ధ్రువీకరించని సమాచారం. మాజీ ఎమ్మెల్యే నాలుగు నెలలుగా దుబాయిలోనే దుబాయి, అమెరికాలో వ్యాపారాలు చేసుకుంటున్నారని అంటున్నారు. దుబాయిలో అత్యంత ఖరీదైన జుమేరియా ప్రాంతంలో కేదార్‌తోనే మాజీ ఎమ్మెల్యే ఉంటున్నాడని సమాచారం. కేదార్ పలువురు సినీ రాజకీయ ప్రముఖుల తరఫున దుబాయిలో స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నట్లు చెబుతున్నారు. కేదార్ ప్రత్యేకంగా ప్రైవేటు విమానాన్ని కూడా వినియోగిస్తారు. సరిగ్గా ఏడాది క్రితం గచ్చిబౌలి పరిధిలోని రాడిసన్ హోటల్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీపై పోలీసులు దాడి చేశారు. ప్రముఖ రాజకీయ నాయకుడి కుమారుడు ఇచ్చిన కొకైన్ పార్టీకి కేదార్‌తో పాటు.. కొందరు సినీ ప్రముఖులు, ఇండస్ట్రీకి చెందిన జూనియర్ మహిళా ఆర్టిస్టులు సైతం హాజరయ్యారని అప్పట్లో పోలీసులు పేర్కొన్నారు. కేదార్‌ను ఆ కేసులో ఏ4 నిందితుడిగా చేర్చారు. ఆ రోజు పార్టీ ఇచ్చిన వివేకానంద, వారికి డ్రగ్స్ సరఫరా చేసిన స్మగ్లర్ సయ్యద్ అబ్బాస్ ఆలీ, నిర్భయ్, కేదార్‌లతో పాటు మరో ఆరుగురిని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. కేదార్‌ను ముందుగా డ్రగ్స్ సరఫరాదారుడిగా అనుకున్న పోలీసులు తర్వాత వినియోగదారుడిగా తేల్చారు. నోటీసులు ఇచ్చి విచారించి వదిలేశారు. గతేడాది ఫిబ్రవరి 26న డ్రగ్స్ కేసులో కేదార్ పేరు వెలుగులోకి రాగా సరిగ్గా ఏడాది తర్వాత ఫిబ్రవరి 25న కేదార్ దుబాయ్‌లో మృతి చెందారు. కేదార్‌కు సినీ పరిశ్రమలోని ప్రముఖ హీరోలు అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండలతో పాటు ఇతర సినీ ప్రముఖులు, నిర్మాతలు, దర్శకులు, రాజకీయ ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. కేదార్ సినీ నిర్మాతగా మారక ముందు నుంచి నగరంలోని ఒక పబ్‌లో భాగస్వామిగా ఉన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కూడా ఉన్నట్లుగా తెలుస్తోంది.

## ఎప్‌సెట్-2025 దరఖాస్తు మార్చి 1కి వాయిదా

- నాన్‌లోకల్ క్యాటగిరీపై స్పష్టత లేకపోవడంతోనే..

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 25న సాయంత్రం నుంచి ప్రారంభం కావాల్సిన టీజీ ఎప్‌సెట్-2025 ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియకు ఆదిలోనే ఆటంకం ఏర్పడింది. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించేందుకు ఎప్‌సెట్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ, నాన్‌లోకల్ క్యాటగిరీలో ప్రవేశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో దరఖాస్తు ప్రక్రియను వాయిదా వేశారు. మార్చి 1వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారు. మరోవైపు ఎప్‌సెట్ దరఖాస్తుకు సమర్పించాల్సిన పత్రాల్లో కీలకమైన ఇంటర్ హాల్ టికెట్లను ఇంటర్ బోర్డు ఇంకా జారీ చేయలేదు. దీంతో పలువురు అభ్యర్థులు తమ కళాశాలలు, మీ సేవాకేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చింది.

# ఎల్‌ఆర్‌ఎస్ రుసుము ఎవరూ కట్టొద్దు

**అధికారంలోకి వస్తే ఉచితంగా క్రమబద్ధీకరణ అన్నారు.. ఇప్పుడేమో ఫీజులు పెంచి వసూళ్లు**

- కాంగ్రెస్ చారణా రిబేట్ ఇస్తే.. ఓటర్లు బారణా ఇస్తారు!
- చిన్నారెడ్డి వ్యాఖ్యలపై ఈడీ, ఐటీ స్పందించడం లేదేం?
- కాంగ్రెస్, బీజేపీయేతర అభ్యర్థుల్లో మంచి వ్యక్తికే ఓటేయండి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు



హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులెవరూ రుసుములు చెల్లించవద్దని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు 25 శాతం రాయితీ అంటూ రుసుములు వసూలు చేయడం సిగ్గుచేటన్నారు. చారణా రిబేట్ ఇచ్చిన కాంగ్రెస్‌కు.. రేపు ఎన్నికల్లో ఓటర్లు బారణా రిబేట్ ఇస్తారని చెప్పారు. బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. మహబూబ్‌నగర్ స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డితో రూ.90 కోట్లు ఖర్చు పెట్టించారని, ఓట్లు కొనుగోలు చేసే క్రమంలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు రూ.5-10 లక్షల వరకు ఇచ్చారని ఆ పార్టీ సీనియర్ నేత చిన్నారెడ్డి బట్టబయలు చేశారని చెప్పారు. ఈడీ, సీబీఐ, ఐటీ, ఈసీ ఈ విషయంపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. సుమోటోగా తీసుకొని కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. చిన్నారెడ్డి వనపర్తిలో ఆవేదనతో చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్న విధానానికి అద్దం పడుతున్నాయని హరీశ్ అన్నారు. ఇందిరమ్మ రాజ్యం పోలీసు రాజ్యమైందని, తమ పార్టీ కార్యకర్తల నుంచి నాయకుల దాకా అక్రమ కేసులు, వేధింపులు సర్వసాధారణమైపోయాయని ఆరోపించారు.

### ఫోన్లు చేసి వెంట పడుతున్నారు..

బీఆర్ఎస్ హయాంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తే.. పేద ప్రజల రక్తం తాగే పథకం అంటూ భట్టి విక్రమార్క, ఉత్తమ్, సీతక్క, కోదండరాం నానా యాగీ చేశారని హరీశ్ గుర్తుచేశారు. తాము అధికారంలోకి వస్తే ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని చెప్పారన్నారు. ఇప్పుడేమో ఫీజులు పెంచి, అధికారులు దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి మరీ ఎల్‌ఆర్‌ఎస్ రుసుము కట్టాలని వెంటపడుతున్నారన్నారు. ఉచితంగా చేస్తామన్నారని.. దానిపై కోదండరాం ఇప్పుడెందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. ఎన్నికల ముందు అంతా ఉచితం అన్నారని.. ఇప్పుడు 25 శాతం డిస్కౌంట్ అని జేబులు ఖాళీ చేసే కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు కట్టవద్దని దరఖాస్తుదారులకు పిలుపునిచ్చారు.

### 27న బీఆర్ఎస్ బృందం ఎస్ఎల్‌బీసీకి..


ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటన చాలా బాధకరమని హరీశ్ అన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కిలోమీటరు కూడా తవ్వలేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని.. ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని తాము 11.48 కి.మీ. తవ్వామని చెప్పారు. కాళేశ్వరం పిల్లర్లు కుంగితే నానా యాగీ చేశారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 14 నెలల్లో ఖమ్మంలో పెద్ద వాగు ప్రాజెక్టు కొట్టుకుపోయిందని, సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిందని, వట్టెం పంప్‌హౌస్ నీట మునిగిందని, ఎస్ఎల్‌బీసీ కూలిందని తెలిపారు. సహాయక చర్యలకు ఆటంకం కలగకూడదనే బీఆర్ఎస్ బృందం ఎస్ఎల్‌బీసీ వద్దకు వెళ్లలేదన్నారు. 27న నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ నేతలతో కలిసి ఎస్ఎల్‌బీసీ వద్దకు వెళతామని హరీశ్ చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీయేతర అభ్యర్థుల్లో మంచి వ్యక్తిని గెలిపించుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

## 27న ఎమ్మెల్సీ ఎన్నికలు... 24 జిల్లాల్లో సెలవు ఇవ్వండి

- కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న జిల్లాల్లో 26, 27 తేదీలు, కౌంటింగ్ జరిగే మార్చి 3న సెలవు ప్రకటించాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాలు, వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఈ నెల 27న ఎన్నిక జరగనుంది. మార్చి 3న కౌంటింగ్ జరగనుంది. 27వ తేదితో పాటు అంతకుముందు రోజు 26న, కౌంటింగ్ జరిగే 3న సెలవు ప్రకటించాలని ప్రభుత్వం ఆదేశించింది.

## ఎమ్మెల్యేల కోటాలో మాకొక ఎమ్మెల్సీ సీటు ఇవ్వాలి



- రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ మాకు హామీ ఇచ్చింది
- రేవంత్ గట్టోడే.. కానీ ఖజానాలో కాసుల్లేవు
- అందుకే హామీలను నెరవేర్చడం లేదు: కె.నారాయణ

వరంగల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణలో ఖాళీ అవనున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీట్లలో తమకు ఒకదాన్ని కేటాయించాలని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ కాంగ్రెస్‌ను కోరారు. కాంగ్రెస్ ఒక సీటు కేటాయిస్తుందని తాము ఆశాభావంతో ఉన్నామన్నారు. మంగళవారం హనుమకొండలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొత్తులో భాగంగా రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇస్తామని కాంగ్రెస్ తమకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ సీట్లకు పోటీ తీవ్రంగా ఉందని, అది ఆ పార్టీ అంతర్గత వ్యవహారమని అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, దానికి కారణం బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులేనని నారాయణ ఆరోపించారు. సీఎం రేవంత్ గట్టోడే.. కానీ, ఖజానాలో కాసులు లేకపోవటంతో హామీలను నెరవేర్చలేకపోతున్నారన్నారు. ఏపీలో జగన్ పార్టీకి ప్రజలు 11సీట్లే ఇచ్చారని, రాజ్యాంగబద్ధంగా ప్రతిపక్ష హోదా జగన్ పార్టీకి రావడం అసాధ్యమని, ప్రతిపక్ష హోదా ఇవ్వకుంటే అసెంబ్లీకి వెళ్లనని చెప్పడం సమంజసం కాదని నారాయణ పేర్కొన్నారు. తెలంగాణలో కేసీఆర్‌కు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చినా అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌లోనే ఉంటానంటే ప్రజాతీర్పును అపహస్యం చేసినట్లేనని విమర్శించారు. రాజకీయాలపైన ఇష్టం లేకుంటే కేసీఆర్ రాజకీయ సన్యాసం తీసుకుని ఫామ్‌హౌస్‌లోనే ఉండాలని సూచించారు.

## మిర్చిని మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనాలి

- క్వింటాకు రూ.25వేలు చెల్లించాలి: ఎర్రబెల్లి దయాకర్

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాకు రూ.25 వేల చొప్పున చెల్లించి కొనుగోలు చేయించాలని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్‌తో కలిసి మంగళవారం ఆయన వరంగల్ వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. గతంలో మిర్చి ధర రూ.30 వేలు పలికేదని, ఇప్పుడు తొమ్మిది వేలే ఉండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మిర్చి ఎగుమతులకు 10% ప్రోత్సాహకం ఇస్తే ధర పెరిగే అవకాశం ఉంటుందని, సీఎం ఆ దిశగా కృషి చేయాలని సూచించారు.

## పీజీ మెడికల్ సీట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం

- జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పీజీ మెడికల్ సీట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం జరుగుతోందని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఒక రిజర్వుడు అభ్యర్థి మెరిట్‌లో సీటు సాధించి, ఆపై సీటును వదులుకుంటే అది ఓసీకే వెళ్తోందన్నారు. ఏపీలో మాత్రం దాన్ని వదులుకున్న వ్యక్తి ఏ వర్గానికి చెందితే అదే వర్గానికి సీటు చెందేలా నిబంధన అమలులో ఉందన్నారు. తెలంగాణలోనూ అలాంటి జీవోను తేవాలని అప్పటి వైద్య మంత్రి ఈటల, ప్రస్తుత ఆరోగ్య మంత్రి రాజనర్సింహాలకు విజ్ఞప్తి చేశామని, అయినా జీవో తీసుకురాలేదన్నారు.

## పదో తరగతి పరీక్షలు ఇక ఏటా రెండు సార్లు

» సీబీఎస్ఈ ప్రతిపాదన.. 2026 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఇకపై ఏటా రెండు విడతలుగా పదో తరగతి పరీక్షలు నిర్వహించాలని సీబీఎస్ఈ ప్రతిపాదించింది. 2026 నుంచి అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన విధి విధానాలను మంగళవారం జనబాహుళ్యంలోకి అందుబాటులో ఉంచింది. వీటిపై మార్చి 9లోగా అభిప్రాయాలు చెప్పాలని కోరింది. ఫిబ్రవరి 17 నుంచి మార్చి 6 వరకు తొలి విడతగా, మే 5 నుంచి 20 వరకు రెండో విడతగా పరీక్షలు జరపాలని ముసాయిదాలో పేర్కొంది. 'ఇంప్రూవ్‌మెంట్' కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ రెండు విడతల్లోనూ పరీక్షలు రాసే అవకాశం ఉంది. ఇంప్రూవ్‌మెంట్ కోసం కొన్ని సబ్జెక్టులను మాత్రమే ఎంచుకునే సౌలభ్యం కూడా ఉంది. రెండు విడతల్లోనూ మొత్తం సిలబస్‌కు పరీక్షలు జరుపుతారు. రెండు విడతలకు కూడా ఒకే పరీక్ష కేంద్రాన్ని కేటాయిస్తారు. ఎలాంటి మార్పులు చేయబోరు. ఈ రెండు విడతలే సప్లిమెంటరీ పరీక్షలుగా కూడా పనిచేస్తాయని, వాటి కోసం మళ్లీ ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించబోరని సీనియర్ అధికారి ఒకరు స్పష్టం చేశారు. 2026 ఫిబ్రవరిలో పరీక్షలు రాసే విద్యార్థుల జాబితాను 2025 సెప్టెంబరు నాటికే తయారు చేస్తారు. ఈ జాబితాలో పేరు ఉన్నవారికి మాత్రమే 2026 మేలో జరిగే పరీక్షలకు అనుమతి ఇస్తారు. ఒక్కసారి జాబితాను ఖరారు చేసిన తరువాత సబ్జెక్టులను మార్చుకునే అవకాశం విద్యార్థులకు ఉండదు. ఒకవేళ సబ్జెక్టును మార్చుకోవాలంటే ఫిబ్రవరిలో జరిగే పరీక్షల్లో దాన్ని విడిచి పెట్టాల్సి ఉంటుంది. దానిని మేలో జరిగే పరీక్షల్లో రాయాల్సి ఉంటుంది. మొదటి విడతలో రాసిన సబ్జెక్టులనే రెండు విడతలోనూ రాయాల్సి ఉంటుంది. మొదటి విడత పరీక్షలు రాసిన తరువాత ఎలాంటి సర్టిఫికెట్లు ఇవ్వరు. మేలో జరిగిన పరీక్షలు పూర్తయిన తరువాతే సర్టిఫికెట్లు ఇస్తారు. ఒకవేళ ఎవరైనా విద్యార్థి రెండు విడతల్లో పరీక్షలు రాస్తే రెండింటిలో వచ్చిన మార్కులను సర్టిఫికెట్‌లో చూపిస్తారు. ఎక్కువ వచ్చిన మార్కులనే పరిగణనలోకి తీసుకుంటారు. అయితే, విద్యాసంవత్సరంలో ఒక్కసారి మాత్రమే ప్రాక్టికల్స్, ఇంటర్నల్ అస్సెస్‌మెంట్‌ను నిర్వహిస్తారు.

### కేంద్ర మంత్రి గోయల్‌తో శశి థరూర్ సెల్ఫీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో సెల్ఫీ దిగారు. దాంతో థరూర్ కాంగ్రెస్‌ను వీడనున్నారని కొంతకాలంగా జరుగుతున్న ప్రచారానికి బలం చేకూరింది. యూకే-భారత్ వాణిజ్య ఒప్పందాలకు సంబంధించిన చర్చ సందర్భంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి గోయల్, బ్రిటన్ ట్రేడ్ సెక్రటరీ జోనాథన్ రోనాల్డ్‌లతో కలిసి దిగిన ఓ సెల్ఫీని థరూర్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీతో ఆయనకు విభేదాలు తలెత్తుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ తనను వద్దనుకుంటే తనకూ ప్రత్యామ్నాయాలు ఉన్నాయని శశి థరూర్ తేల్చిచెప్పారు.

### 25 ఏళ్లలో 299 మంది పిల్లలపై అత్యాచారం

వన్నెస్, ఫిబ్రవరి 25: చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన పిల్లలపై అత్యాచారం చేశాడంటూ ఫ్రాన్స్‌లోని వన్నెస్‌లో సోమవారం ఓ వృద్ధ వైద్యునిపై విచారణ ఆరంభమయింది. దాదాపు 25 ఏళ్ల కాలంలో 299 మందిపై అత్యాచారం చేశాడన్న ఆరోపణలతో జోయల్ లె స్కార్నెక్ (74)పై స్థానిక కోర్టులో విచారణను ప్రారంభించారు. 1989 నుంచి 2014 వరకు 158 మంది బాలురు, 141 మంది బాలికలపై రేప్ చేసినట్టు పోలీసుల కేసు నమోదు చేశారు. బాధితుల నగటు వయసు 11 ఏళ్లని పేర్కొన్నారు. ఆస్పత్రి గదుల్లో వారు ఒంటరిగా ఉన్నప్పుడు ఆ దారుణానికి పాల్పడినట్టు ఆధారాలను సమర్పించారు. తనను అనుచిత రీతిలో తాకాడంటూ 2017లో పొరుగింటికి చెందిన ఆరేళ్ల బాలిక ఫిర్యాదు చేయడంతో మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వైద్యుడు కూడా నేరాలను అంగీకరించాడు.

## ఢిల్లీ లిక్కర్ స్కామ్‌తో..

# సర్కారుకు 2 వేల కోట్ల నష్టం

» ఉత్పత్తి, అమ్మకాల లెక్కలే లేవు: కాగ్

» అసెంబ్లీలో నివేదిక.. ఆప్ గందరగోళం

» 21 మంది ఆప్ ఎమ్మెల్యేల సస్పెన్షన్



ఢిల్లీ అసెంబ్లీలో ఎల్జీ సక్సేనా ప్రసంగిస్తుండగా ఆప్ ఎమ్మెల్యేల ఆందోళన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్‌తో ఢిల్లీ ప్రభుత్వానికి రూ.2002.68 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) స్పష్టం చేసింది. ఢిల్లీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం సీఎం రేఖాగుప్తా కాగ్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన లొసుగులకు సంబంధించి కాగ్ 20 అంశాలను లేవనెత్తగా.. వాటిల్లో ఒకటి– మద్యం విధానం-2021తో నష్టాల చిట్టాపై అసెంబ్లీలో చర్చ జరుగుతుండగా.. ఆప్ ఎమ్మెల్యేలు తీవ్రంగా వ్యతిరేకించారు. వారు గందరగోళం సృష్టించడంతో స్పీకర్ విజేంద్రగుప్తా 21 మంది ఆప్ ఎమ్మెల్యేలు రెండ్రోజులపాటు సస్పెండ్ చేశారు.

### కాగ్ లేవనెత్తిన అంశాలు..

మద్యం పాలసీ-2021లో అడుగడుగునా ప్రభుత్వానికి నష్టం వాటిల్లినట్లు కాగ్ స్పష్టం చేసింది. సరెండర్ చేసిన రిటైల్ లైసెన్స్‌ల స్థానంలో మళ్లీ టెండర్లను ఆహ్వానించలేదని, దీని వల్ల ప్రభుత్వానికి రూ.890.15 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు స్పష్టం చేసింది. జోనల్ లైసెన్సుల మినహాయింపు వల్ల మరో రూ.941.53 కోట్లు, సెక్యూరిటీ డిపాజిట్లను సరిగా వసూలు చేయకపోవడం వల్ల రూ.27 కోట్లు, కొవిడ్ లాక్‌డౌన్ల పేరుతో అడ్డగోలు మినహాయింపులతో ఇంకో రూ.144 కోట్లు.. ఇలా మొత్తం 2002.68 కోట్ల మేర ప్రభుత్వం నష్టపోయినట్లు కాగ్ నివేదిక వెల్లడించింది. "కొత్త మద్యం పాలసీ రూపకల్పనకు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సిఫారసులను అప్పటి ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా విస్మరించారు" అని కాగ్ వివరించింది.

### సగం నాటు మద్యమే

2021 మద్యం పాలసీ తర్వాత ఢిల్లీలో విక్రయించిన మద్యంలో సగం నాటు సరుకేనని కాగ్ తేల్చింది. "అనేక మంది హోల్‌సేల్ మద్యం వ్యాపారులు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) నిబంధనలకు అనుగుణంగా నాణ్యత పరీక్షలను నిర్వహించలేదు. ఎక్సైజ్ ఇంటెలిజెన్స్ సీజ్ చేసిన మద్యంలో సగం నాటు సరుకే ఉంది. అసలు ఎంత ఉత్పత్తి చేశారు? ఎంత మేర విక్రయాలు జరిగాయి? అనే దానికి లెక్కలే లేవు. మద్యం విధానం సాంతం లోపాలమయం" అని కాగ్ నివేదిక వివరించింది. సర్కారు అజమాయిషీలోని హోల్‌సేల్ సంస్థలకు కాకుండా.. ప్రైవేటు కంపెనీలకు పెద్ద ఎత్తున హోల్‌సేల్ లైసెన్సులు ఇచ్చారని, ఎక్సైజ్ సుంకం స్థానంలో భారీ ఎత్తున లైసెన్స్ ఫీజు వసూలు చేశారని ఎత్తి చూపింది. "నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి రెండు దుకాణాలను మాత్రమే కేటాయించాలి. అయితే.. 2021 పాలసీలో 54 రిటైల్ దుకాణాలను కేటాయించారు. ఈ విషయంలో లెఫ్టినెంట్ గవర్నర్ నుంచి లేదా క్యాబినెట్ నుంచి అనుమతులు తీసుకోలేదు. అడ్డగోలుగా రాయితీలు, సడలింపులు ఇచ్చారు. దేశీయ, విదేశీ మద్యం సరఫరాకు హోల్‌సేల్ లైసెన్సులు లేని 14 బడా వ్యాపార సంస్థలకు కేటాయింపులు చేశారు. ఢిల్లీని 32 జోన్లుగా విభజించి, 22 సంస్థలకు రిటైల్ దుకాణాలను కేటాయించారు" అని కాగ్ నివేదిక స్పష్టం చేసింది.

### అంతా కుమ్మక్కయ్యారు

హోల్‌సేల్ లైసెన్సు పొందిన వారు, జోనల్ లైసెన్సులు పొందిన వారు కుమ్మక్కయ్యారని కాగ్ తేల్చింది. హోల్‌సేల్ లైసెన్సులు పొందిన ఇండో స్పిరిట్ సంస్థకు కావోగలి రెస్టారెంట్లు అనుబంధ సంస్థలని, మహాదేవ్ లిక్కర్ అనే హోల్‌సెల్ సంస్థకు భగవతీ ట్రాన్స్‌పోర్టర్ కార్పొరేషన్ అనే సంస్థకు సంబంధాలున్నాయని తెలిపింది. గౌతమ్ వైన్స్ అనే హోల్‌సేల్ సంస్థకు, ఒయాసిస్ బిస్టరీస్, విజేత బేవరేజస్ సంస్థల్లో వాటాలున్నాయని వివరించింది. మొత్తం హోల్‌సేల్ లైసెన్సీలలో అత్యధికంగా 28.4% బ్రిండ్‌కో అనే సంస్థకు, 22.25% మహదేవ్ లిక్కర్‌కు, 21.40% ఇండో స్పిరిట్ సంస్థకు దక్కాయని పేర్కొంది. ఆర్గనామిక్స్ ఎకోసిస్టమ్, నేత్రపతి డిస్టిలరీ అనే సంస్థలకు వైభవ్ అనే వ్యక్తి డైరెక్టర్‌గా కొనసాగారని కాగ్ రిపోర్టు వెల్లడించింది. అయితే, నాటు మద్యాన్ని విక్రయించారనే ఆరోపణలను మాజీ సీఎం ఆతిషి ఖండించారు. తాము గతంలో కంటే నాణ్యమైన మద్యాన్నే సరఫరా చేశామని వ్యాఖ్యానించారు. "గతంలో హరియాణా, యూపీ నుంచి అక్రమంగా మద్యాన్ని సరఫరా చేసేవారు. పాత విధానం వల్ల నష్టాలు వచ్చినందుకే.. మేం కొత్త విధానాన్ని ప్రవేశపెట్టాం" అని ఆమె విమర్శించారు.

## మోదీ ప్రభుత్వం ఫాసిస్టు కాదు!

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీతో సాగిస్తున్న రహస్య మైత్రి బట్టబయలైందని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. తమిళనాడులోని మదురైలో వచ్చే ఏప్రిల్లో సీపీఎం జాతీయ కాంగ్రెస్ జరుగనుంది. అందులో ఆమోదించే విశ్లేషణాత్మక రాజకీయ తీర్మానం ముసాయిదాను కేంద్ర కమిటీ ఇటీవల రాష్ట్ర కమిటీలకు చర్చ కోసం పంపింది. మోదీ సర్కారును సీపీఐ ఫాసిస్టు ప్రభుత్వంగా అభివర్ణిస్తుంటుంది.. భారత్‌లోకి ఫాసిజం వచ్చేసిందని సీపీఐ-ఎంఎల్ అటుంటుంది. ఈ రెండు పార్టీలకు తన వైఖరి భిన్నమని సీపీఎం సదరు ముసాయిదాలో పేర్కొంది. ముస్సోలినీ, హిట్లర్‌ల నాటి ఫాసిజాన్ని క్లాసికల్ ఫాసిజంగా అభివర్ణించింది. తర్వాత వచ్చిన అలాంటి వ్యక్తీకరణలన్నీ 'నియో-ఫాసిజం' కిందకు వస్తాయని తెలిపింది. 'సామ్రాజ్యవాద అంతర్గత వైరుధ్యాల వల్ల క్లాసికల్ ఫాసిజం పుట్టింది. నయా ఉదారవాద సంక్షోభం కారణంగా నయా-ఫాసిజం ఆవిర్భవించింది' అని కొత్తగా నిర్వచించింది. గతంలో ఆర్ఎస్ఎస్‌ను ఫాసిస్టు లక్షణాలున్న సంస్థగా సీపీఎం పేర్కొంది. దాని నియంత్రణలో ఉన్న మోదీ ప్రభుత్వం ఫాసిస్టు పోకడలు పోతోందని గత రెండు పార్టీ కాంగ్రెస్‌లలో ప్రకటించింది. తాజాగా మోదీ ప్రభుత్వాన్ని ఫాసిస్టు కేటగిరీలో చేర్చలేమని.. అలాగే భారతదేశాన్ని నయా ఫాసిస్టుగా చిత్రీకరించరాదని తీర్మానంలో అభిప్రాయపడింది. 'దశాబ్దానికిపైగా మోదీ అప్రతిహత పాలన కారణంగా రాజకీయాధికారం బీజేపీ-ఆర్ఎస్ఎస్ చేతుల్లో నిక్షిప్తమైపోయింది. ఈ కూటమిని అడ్డుకోకపోతే.. హిందూత్వ-కార్పొరేట్ నియంతృత్వం నయా ఫాసిజం వైపు నడుస్తుంది. అయితే నయా-ఫాసిజం పోకడలు అనే పదబంధాన్ని.. ప్రభుత్వం నయా-ఫాసిజం సర్కారుగా లేదా రాజకీయ వ్యవస్థగా రూపాంతరం చెందినట్లుగా అర్థం చేసుకోకూడదు' అని ముసాయిదాలో తెలిపింది. సీపీఎంలో ఈ పరివర్తన సీపీఐకి ఆగ్రహం తెప్పించింది. తీర్మానాన్ని సవరించుకోవాలని సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం అన్నారు. అయితే, మోదీ ప్రభుత్వాన్ని ఫాసిస్టుగా తామెప్పుడూ విశ్లేషించలేదని సీపీఎం సెంట్రల్ కమిటీ సభ్యుడు ఏకే బాలన్ స్పష్టంచేశారు. ఇంకోవైపు.. సీపీఎం ఆలస్యంగానైనా నిజాన్ని గ్రహించిందని, ఈ మార్పును స్వాగతిస్తున్నామని బీజేపీ నేత ఎంటీ రమేశ్ చెప్పారు.

## లోకం తీరు




## కాలుష్య దేశాల్లో..
# భారత్ టాప్-3

» బంగ్లాదేశ్, పాక్‌కు తొలి రెండుస్థానాలు

» ఏక్యూఐ-2024 నివేదికలో వెల్లడి

(సెంట్రల్ డెస్క్)

ప్రపంచంలోనే అత్యంత కాలుష్య దేశాల్లో భారత్ మూడోస్థానంలో ఉన్నట్లు రియల్-టైమ్ గాలి నాణ్యత వివరాలను అందజేసే ఓపెన్‌సోర్స్ సంస్థ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్(ఏక్యూఐ) వెల్లడించింది. 2024 సంవత్సరంలో సగటు ఏక్యూఐ 140తో బంగ్లాదేశ్, 115 ఏక్యూఐతో పాకిస్థాన్ మొదటి రెండు స్థానాల్లో ఉండగా.. 111 గాలి నాణ్యతతో భారత్ మూడోస్థానంలో నిలిచింది. టాప్-10లో మిగతా స్థానాల్లో బహ్రెయిన్(103), నేపాల్(100), ఈజిప్ట్(92), యూఏఈ(90), కువైత్(89), తజకిస్థాన్(89), కిర్గిస్థాన్(87) ఉన్నాయి. ఏక్యూఐ 50లోపు ఉంటే.. కాలుష్యపరంగా సురక్షిత దేశాలుగా పరిగణిస్తారు. ఒక్క ఈజిప్ట్ మినహా.. టాప్-10లో ఆసియా దేశాలే ఉండడం గమనార్హం.! ఏక్యూఐ విడుదల చేసిన టాప్-50 కాలుష్య నగరాల్లో సింహభాగం ఉత్తరభారత దేశంలోనే ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే.. టాప్-12 స్థానాలన్నింటినీ భారతే ఆక్రమించింది. ఏక్యూఐ 169తో దేశ రాజధాని న్యూఢిల్లీ ముందంజలో ఉండగా.. తర్వాతి స్థానంలో గ్రేటర్ నోయిడా(166) ఉంది. బంగ్లాదేశ్ రాజధాని ఢాకా(140) 13 స్థానంలో నిలిచింది. ఏక్యూఐ డేటా పరంగా భారత్‌లోని దక్షిణాది నగరాలు కొంత వరకు సురక్షితమైనవే అయినా.. రియల్-టైమ్ డేటాలో మాత్రం దక్కన్ పీటభూమి దిగువ ప్రాంతాలు టాప్‌లో ఉంటున్నాయి. మంగళవారం సాయంత్రం 6 గంటలకు తమిళనాడులోని తూటికోరిన్(225), దిండిగల్(201), కరూర్(195) టాప్-3లో ఉండగా.. ఏపీలోని జమ్మలమడుగు(189), చిత్తూరు(188) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# మస్క్ అడిగాడు కదా.. చెప్పండి



వాషింగ్టన్, ఫిబ్రవరి 25: ఫెడరల్ ఉద్యోగులంతా గడిచిన వారంలో చేసిన పనుల వివరాలను మెయిల్ చేయాలని, లేనిపక్షంలో ఉద్యోగాలకు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉండాలని అమెరికాలోని డోజ్ విభాగం చీఫ్ ఎలాన్ మస్క్ చేసిన ప్రకటనను అధ్యక్షుడు ట్రంప్ సమర్థించారు. "మీరంతా నిజంగానే పని చేస్తున్నారా.. చేస్తే ఆ పనులేంటో చెప్పండి అని మస్క్ అడుగుతున్నారు. ఒక వేళ సమాధానం ఇవ్వకపోతే మీరు తొలగించాల్సిన ఉద్యోగుల జాబితాలో ఉంటారు" అని ఫెడరల్ ఉద్యోగులను ఉద్దేశించి ట్రంప్ వ్యాఖ్యానించారు. ఫెడరల్ విభాగాల్లో పనిచేస్తున్నట్లుగా ఉన్న చాలా మంది ఉద్యోగులు అసలు ఉనికిలోనే లేరని, లేని ఉద్యోగులకు జీతాలు అందుతున్నాయని ట్రంప్ ఈ సందర్భంగా ఆరోపించారు. ఇలా వందల బిలియన్ల డాలర్ల మోసం జరుగుతోందని చెప్పారు. దీన్ని డోజ్ విభాగం గుర్తించిందన్నారు. మరోవైపు, తన ప్రకటన పట్ల ఫెడరల్ ఉద్యోగుల్లో వ్యతిరేకతపై మస్క్ స్పందించారు. 'కొంచెం జవాబుదారీగా ఉండండి అంటే ద్వేషాన్నంతా వెళ్లగక్కుతున్నారు' అని వ్యాఖ్యానించారు. అధ్యక్షుడికి ఉన్న విచక్షణాధికారంతో ఫెడరల్ ఉద్యోగులకు ఇంకొక అవకాశం ఇస్తామని, అప్పుడు కూడా మెయిల్ పంపకపోతే వారిని కచ్చితంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ఆయన హెచ్చరించారు. అమెరికా కాలమానం ప్రకారం.. సోమవారం రాత్రిలోగా ఫెడరల్ ఉద్యోగులంతా మెయిల్ పంపాలని మస్క్ మూడు రోజుల క్రితం ఆదేశించారు. ఇప్పటికే గడువు ముగిసింది. మరోవైపు, మస్క్‌కు రిప్లై ఇవ్వాల్సిన అవసరం లేదని ఫెడరల్ విభాగాలు తమ ఉద్యోగులకు సూచించాయి.

### పుతిన్ నియంత కాదు

రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను 'నియంత' అని పిలిచేందుకు ట్రంప్ నిరాకరించారు. అలాంటి పదాలను ఎలా ఉపయోగిస్తామని ప్రశ్నించారు. సోమవారం ఆయన అమెరికా పర్యటనకు వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు ఉమ్మడిగా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని 'నియంత' అని గత వారం ట్రంప్ విమర్శించిన నేపథ్యంలో 'పుతిన్‌ను కూడా నియంతగా గుర్తిస్తున్నారా?' అని విలేకరులు అడిగారు. ఇందుకు ట్రంప్ సమాధానం ఇస్తూ 'అంత తేలికగా అలాంటి మాటలను ఎలా అంటాం' అని అన్నారు. శాంతి చర్చలపై మాట్లాడుతూ 'మనం స్మార్ట్‌గా ఉంటే వారంలోనే యుద్ధం ముగిసిపోవచ్చు. స్మార్ట్‌గా లేకపోతే కొనసాగవచ్చు' అని అన్నారు. దీనిపై మేక్రాన్ స్పందిస్తూ శాంతి ఒప్పందం అంటే ఉక్రెయిన్ లొంగిపోవడం కాదని, ఎలాంటి గ్యారెంటీలు లేకుండా కాల్పుల విరమణ జరగకూడదని చెప్పారు.

# మరోసారి భాషా ఉద్యమానికి సిద్ధం

» తమిళ ప్రజలపై హిందీని రుద్దితే ఒప్పుకోం..కుట్రను తిప్పికొడతాం

» తమిళనాడు సీఎం స్టాలిన్



విలేకరులతో మాట్లాడుతున్న స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మరోసారి భాషా యుద్ధానికి తమిళనాడు సిద్ధమని, ప్రజలు అందుకు సిద్ధం కావాలని ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కుట్రలను తిప్పికొడతామన్నారు. ఈ మేరకు ఆయన పార్టీ కార్యకర్తలకు బహిరంగ లేఖ రాశారు. ఆధిపత్య ధోరణిని ప్రతిఘటించడం, మాతృభాషను కాపాడుకోవడం డీఎంకే కార్యకర్తల రక్తంలోనే ఉందన్నారు. ఆ చైతన్యం తుదిశ్వాస వరకూ కొనసాగుతుందని అన్నారు. కేంద్రంలోని పాలకులు తమిళనాడులో హిందీని ఎలాగైనా అమలు చేయాలనే ప్రయత్నిస్తుంటారని, వాటిని డీఎంకే ఎప్పటికప్పుడు తీవ్రంగా వ్యతిరేకిస్తూనే వస్తోందని చెప్పారు. తాజాగా కేంద్రం విద్యారంగానికి కేటాయించాల్సిన నిధులకు-జాతీయ విద్యావిధానం అమలుకు ముడిపెట్టిందని, త్రిభాషా విద్యావిధానాన్ని అమలు చేస్తేనే ఆ నిధులిస్తామంటూ బ్లాక్‌మెయిల్‌కు దిగుతోందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ హిందీ వ్యతిరేకోద్యమం కోసం అంతా నడుం బిగించి సిద్ధంగా ఉండాలని స్టాలిన్ కోరారు. కాగా, 1965లో డీఎంకే నేతృత్వంలో హిందీకి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమం చేసింది.

### మార్చి 5న అఖిలపక్ష సమావేశం

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పేరుతో తమిళనాడులో 8 లోక్‌సభ స్థానాలను తగ్గించేలా కేంద్రప్రభుత్వం కుట్రపన్నుతోందని సీఎం స్టాలిన్ ఆరోపించారు. మంగళవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సందర్భంగా సీఎం మీడియాతో మాట్లాడారు. జనాభా నియంత్రణను సమర్థవంతంగా నిర్వహించి దేశాభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తున్న దక్షిణ భారతదేశంపై నియోజకవర్గాల పునర్విభజన కత్తి వేలాడదీయడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఎంపీ సీట్ల సంఖ్యను తగ్గించకుండా కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు మార్చి 5న అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో తమిళనాడులో ఎంపీ సీట్లు 39 నుంచి 31కి పడిపోతాయని వివరించారు. మరోవైపు, జాతీయ విద్యా విధానంపై తమిళనాట రాజకీయాలు వేడెక్కుతున్న వేళ.. కేంద్రం తీరును నిరసిస్తూ బీజేపీ నేత, నటి రంజనా నట్చియార్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. త్రిభాషా పాలసీని రుద్దడమంటే ద్రవిడ భావజాలాన్ని వ్యతిరేకించడమేనని ఆమె ఎక్స్ వేదికగా విమర్శించారు.

### కర్ణాటక, మహారాష్ట్ర మధ్య తిరగని సర్వీసులు

బెంగళూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని బెళగావి జిల్లాలో కేఎస్ఆర్టీసీ బస్సు కండక్టర్ మరాఠీలో మాట్లాడలేదని జరిగిన దాడి నేపథ్యంతో మూడోరోజు మంగళవారం కూడా మహారాష్ట్ర, కర్ణాటక మధ్య బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. ఘటనపై కన్నడ సంఘాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. కాగా, కండక్టర్‌పై పెట్టిన పోక్సో కేసును వాపసు తీసుకుంటున్నట్టు బాలిక తల్లి ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం బాలిక తల్లి ఒక వీడియో సందేశం విడుదల చేశారు. తాము కన్నడిగులమేననీ, కన్నడ అంటే అభిమానమని, కండక్టర్‌పై ఫిర్యాదు కన్నడ, మరాఠా వివాదంగా మారిందన్నారు. కండక్టర్ మహదేవప్పపై చేసిన ఫిర్యాదును వాపసు తీసుకుంటున్నామన్నారు. టిక్కెట్ కొనుగోలు విషయంలో గొడవ జరిగిందనీ, అది భాషా సమస్యగా మారిందన్నారు.

# భారత్‌కు ట్రంప్ ఝలక్

## మన దేశానికి వ్యతిరేకంగా ఒకేసారి రెండు నిర్ణయాలు

» భారత్‌లోని కొన్ని సంస్థలు, నౌకలపై తాజా ఆంక్షలు

» ఇంధన ట్యాంకర్ల ఆపరేటర్లు, మేనేజర్లపై కూడా

» ఇరాన్‌కు సహకరిస్తున్నారని ఆరోపణ

వాషింగ్టన్, ఫిబ్రవరి 25: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌కు వ్యతిరేకంగా తాజాగా తీసుకున్న రెండు నిర్ణయాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. రహస్యంగా ఇరాన్ పెట్రోలియం ఉత్పత్తుల రవాణా, అమ్మకాల బ్రోకరింగ్ నిర్వహిస్తున్నారంటూ 30 మంది వ్యక్తులపైనా, నౌకలు, సంస్థలపైనా అమెరికా ఆర్థిక, విదేశాంగశాఖలు తాజాగా ఆంక్షలు విధించాయి. భారత్, చైనాలోని ట్యాంకర్ల ఆపరేటర్లు, మేనేజర్లు, యూఏఈ(యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్), హాంకాంగ్‌లోని ఇంధన బ్రోకర్లు, ఇరాన్‌కు చెందిన నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ అధినేత కూడా ఈ ఆంక్షల జాబితాలో ఉన్నారు. ఇరాన్‌కు చెందిన కోట్లాది బ్యారెళ్ల ముడి చమురును ఈ నౌకలు రవాణా చేస్తున్నాయని, ఆ చమురు విలువ వందల కోట్ల రూపాయలు ఉంటుందని అమెరికా ఆర్థికశాఖ తెలిపింది. 'ఇరాన్ చమురుకు సంబంధించిన కార్యకలాపాలు నిర్వర్తించే ఎవరికైనా ఆంక్షల ముప్పు తప్పదు' అని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ తేల్చిచెప్పారు.

### ఆంక్షలు ఈ సంస్థలపైనే...

అమెరికా తాజాగా ఆంక్షలు విధించిన సంస్థల్లో భారత్‌కు చెందిన బీఎంఎస్ మెరైన్ లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్, ఆస్టిన్‌షిప్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, కాస్మోస్ లైన్స్ ఇన్క్ ఉన్నాయి. ఈ సంస్థలు రహస్యంగా ఇరాన్‌కు చెందిన పెట్రోలియం ఉత్పత్తుల కొనుగోలు, మార్కెటింగ్, రవాణా, అమ్మకాలను నిర్వహిస్తున్నాయనేది అమెరికా ఆరోపణ. దీంతోపాటు భారత్‌కు చెందిన ఫ్లక్స్ మారిటైమ్ ఎల్ఎల్‌పీ సాంకేతిక మేనేజర్‌లా వ్యవహరిస్తూ లక్షల బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురును ఒక నౌక నుంచి మరో నౌకకు మళ్లించే కార్యకలాపాలకు పాల్పడుతోందని అమెరికా ఆరోపించింది.

### ఇరాన్‌ను ఆర్థిక దిగ్బంధనం చేసేందుకే..

ఇరాన్‌పై గరిష్ఠంగా ఆర్థికపరమైన ఒత్తిడి తెచ్చేలా అమెరికా ఆర్థిక శాఖ మంత్రిని ఆదేశిస్తూ ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ఈనెల మొదట్లో ట్రంప్ సంతకం చేశారు. ఇరాన్ ఇంధన ఎగుమతులు శూన్యం కావాలని అందులో ఆదేశించారు. ఇరాన్ అణ్వాయుధ దేశంగా అభివృద్ధి చెందకూడదని ట్రంప్ తేల్చిచెప్పారు. అమెరికా నుంచి తీవ్రమైన ఆంక్షలు ఉన్నప్పటికీ ఇంధన ఎగుమతుల ద్వారా 2022లో రూ.4.7 లక్షల కోట్లు(54 బిలియన్ డాలర్లు), 2023లో రూ.4.6 లక్షల కోట్లను ఇరాన్ ఆర్జించినట్టు అమెరికా అంచనా వేసింది.

### విదేశీ సాయం నిలిపేసినా.. పాక్‌కు నిధులు

అప్పుల్లో కూరుకుపోయిన పాకిస్థాన్‌కు ఎఫ్-16 యుద్ధ విమానాల నిర్వహణ కోసం రూ.3,461 కోట్ల(397 మిలియన్ డాలర్ల) నిధులను అమెరికా తాజాగా మంజూరు చేసింది. అమెరికా పర్యవేక్షణ కార్యక్రమం కింద ఈ నిధులను ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లకు ఉపయోగించాలని, ఆ నిధులను భారత్‌కు వ్యతిరేకంగా వినియోగించకూడదని అమెరికా తేల్చిచెప్పినట్టు ఒక ఆంగ్ల వార్తా సంస్థ తాజాగా కథనం ప్రచురించింది. జనవరి 20 అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత విదేశీ సాయాన్ని ట్రంప్ నిలిపివేసినప్పటికీ పాకిస్థాన్‌కు తాజాగా నిధులు విడుదల చేయడం గమనార్హం. ఉగ్రవాదంపై తగిన చర్యలు చేపట్టడం లేదంటూ 2018లో పాకిస్థాన్‌కు రక్షణ సాయాన్ని ట్రంప్ నిలిపివేశారు. ఆ నిర్ణయాన్ని బైడెన్ ప్రభుత్వం ఉపసంహరించుకొంది.

# సిక్కుల ఊచకోత కేసులో సజ్జన్ కుమార్‌కు యావజ్జీవం

» ప్రత్యేక కోర్టు తీర్పు

» ఉరిశిక్ష విధించాలని సిక్కుల డిమాండు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: నాలుగు దశాబ్దాల నాటి సిక్కుల ఊచకోత కేసులో కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ దోషి అని ప్రకటించిన ప్రత్యేక కోర్టు మంగళవారం ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఈ మేరకు ప్రత్యేక జడ్జి కావేరీ బవేజా తీర్పు చెప్పారు. మాజీ ప్రధాని ఇందిర హత్య అనంతరం జరిగిన అల్లర్లలో 1984 నవంబరు ఒకటో తేదీన జశ్వంత్ సింగ్ ఆయన కుమారుడు తరుణ్‌దీప్ సింగ్‌లను హత్య చేయించారంటూ ఆయనపై కేసు నమోదయింది. ఇలాంటి నేరాలకు గరిష్ఠంగా మరణ శిక్ష, కనిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తారు. అల్లర్లలో ఆయన ఒక్కడే పాల్గొనలేదని, కానీ అల్లరి మూకకు అతడే నాయకత్వం వహించాడని కోర్టు గుర్తించింది. సిక్కులపై జరిగిన దాడులకు సంబంధించి నానావతి కమిషన్ దర్యాప్తు చేసింది. మొత్తం 2,733 మంది మరణించగా 587 కేసులు నమోదయ్యాయి. నిందితుల ఆచూకీ దొరకకపోవడంతో 240 కేసులను మూసివేశారు. 250 కేసుల్లో నిందితులను నిర్దోషులుగా విడుదల చేశారు. 400 మందిని దోషులుగా కోర్టులు గుర్తించాయి. హత్యానేరం చేసినట్టు 50 మందిని శిక్షించగా వారిలో సజ్జన్ కుమార్ ఒకరు కావడం గమనార్హం. ప్రస్తుతం ఆయన తిహాడ్ జైలులో ఉన్నారు. మరోవైపు దీనిని అరుదైన కేసుల్లో అత్యంత అరుదైన కేసుగా పరిగణించి మరణశిక్ష విధించాలని డిమాండు చేస్తూ కోర్టు బయట సిక్కులు ప్రదర్శన జరిపారు. తీర్పుపై బీజేపీ ఐ.టి.విభాగం అధిపతి అమిత్ మాలవీయ ఎక్స్‌లో పోస్టు పెడుతూ "రాజీవ్, సోనియాల ప్రధాన అనుచరుడికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. ఈ కేసులోని ఇతర వ్యక్తులకు కూడా ఇదే గతి పడుతుంది" అని వ్యాఖ్యానించారు. ఈ కేసులో జగదీష్ టైట్లర్ కూడా నిందితుడిగా ఉన్నారు.



## అరగంటలో ఢిల్లీ నుంచి జైపూర్‌కు

» తొలి హైపర్‌లూప్ ప్రాజెక్టులో ముందడుగు


» 422 మీటర్ల టెస్ట్ ట్రాక్ సిద్ధం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఢిల్లీ నుంచి రాజస్థాన్‌లోని జైపూర్‌కు దాదాపు 300 కిలోమీటర్లు ఉంటుంది. రోడ్డు, రైలు లేదా విమాన మార్గం ద్వారా ఈ దూరాన్ని అరగంటలో చేరుకోవడం సాధ్యం కాదు. కానీ త్వరలోనే అందుబాటులోకి రానున్న హైపర్‌లూప్ ప్రాజెక్టుతో ఇది సాధ్యమే అంటోంది రైల్వే మంత్రిత్వ శాఖ. ఈ అత్యాధునిక వ్యవస్థను భారత్‌లో తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రైల్వే శాఖ, ఐఐటీ మద్రాస్ కలిసి పనిచేస్తున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా ఐఐటీ మద్రాస్ 422 మీటర్ల పొడవైన హైపర్ లూప్ టెస్ట్ ట్రాక్‌ను సిద్ధం చేసిందని, దీన్ని పరీక్షిస్తామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. సాధారణంగా భూమిపై ప్రయాణించే వాహనాల వేగాన్ని గాలి పీడనం నిరోధిస్తుంది. కానీ, హైపర్ లూప్ ట్యూబ్‌లో గాలి పీడనం ఉండదు. అందులో బోగీని ప్రవేశపెడితే బయటికన్నా వేగంగా వెళ్తుంది. హైపర్ లూప్ అనేది ఒక హైస్పీడ్ రవాణా వ్యవస్థ. దీనిలో 350 కిలోమీటర్ల దూరాన్ని 30 నిమిషాల్లోనే చేరుకోవచ్చు.

# 5 లక్షల కొత్త ఉద్యోగాలు

(మొదటిపేజీ తరువాయి)

ఈ సదస్సును ప్రారంభించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ దిగ్గజ కంపెనీల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. బయో ఏషియా సదస్సు హైదరాబాద్‌ను ప్రపంచ లైఫ్‌సైన్సెస్ రాజధానిగా మార్చిందని పేర్కొన్నారు. ఫార్మా, ఐటీ, డిజిటల్ హెల్త్ రంగాల్లో గడిచిన 25 ఏళ్లుగా హైదరాబాద్‌ను ఒక పవర్ హౌజ్‌గా నిలబెట్టిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ఫార్మా, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్, బయోటెక్ కంపెనీలెన్నో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయని గుర్తుచేశారు. బయో సైన్సెస్‌లో పరిశోధనలు, సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్న దార్శనికతతో ప్రభుత్వం ముందు నుంచి పనిచేస్తోందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో రాష్ట్రంలో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో త్వరలో లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీని నెలకొల్పనున్నట్టు ప్రకటించారు. దేశ విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించడంలో భారతదేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని సీఎం గుర్తుచేశారు. "రాష్ట్రంలో అత్యల్ప ద్రవ్యోల్బణం, అత్యధిక ఉద్యోగాల కల్పన ఉంది. ఇటీవల దావో‌స్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో తెలంగాణ రూ. 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. వాటివల్ల విభిన్న రంగాలలో దాదాపు 50 వేల ఉద్యోగాలు రానున్నాయి. అలాగే, కిందటి సంవత్సరం లైఫ్ సైన్సెస్ రంగంలో రూ.40వేల కోట్లకు పైగా పెట్టుబడులను విజయవంతంగా ఆకర్షించాం. దాదాపు 150 పైగా ప్రాజెక్టుల్లో ఈ పెట్టుబడులు వచ్చాయి" అని ఆయన వివరించారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో భాగంగా గ్రీన్ ఫార్మా సిటీ వేగంగా అభివృద్ధి చెందుతోందని, అతిపెద్ద ఫార్మాస్యూటికల్ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలపై సంతకం చేశాయని తెలిపారు. "వచ్చే పదేళ్లలో తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే కాక.. చైనా ప్లస్ వన్ (అంతర్జాతీయ కంపెనీలు తమ ఉత్పత్తిని చైనాతోపాటు మరో చోట కూడా ప్రారంభించే దిశగా చేస్తున్న యోచన) ఆలోచనలకు సరైన ప్రత్యామ్నాయ కేంద్రంగా తెలంగాణను అభివృద్ధి చేస్తున్నాం." అని వివరించారు. కాగా.. ఈ సదస్సులో భాగంగా జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డ్-2025ను సింగపూర్‌కు చెందిన ప్రిసిషన్ హెల్త్ రిసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్యాట్రిక్ టాన్‌కు బహూకరించారు. అలాగే.. సదస్సు తొలిరోజునే 11 ఫార్మా కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం రూ.5400 కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలు కుదుర్చుకుంది.



క్వీన్స్‌లాండ్ ప్రతినిధులతో కరచాలనం చేస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి దుద్దిళ్ల

### 2 లక్షల ఉద్యోగాలు: మంత్రి దుద్దిళ్ల

ప్రభుత్వం త్వరలో ఏర్పాటుచేయనున్న లైఫ్ సైన్సెస్ వర్సిటీలో సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రపంచ స్థాయి నిపుణులను తయారు చేసే కోర్సులకు రూపకల్పన చేయబోతున్నట్టు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతి.. ప్రపంచపటంలో తెలంగాణను ప్రత్యేక స్థానానికి తీసుకెళ్లిందని ఆయన పేర్కొన్నారు. ఈ స్ఫూర్తితో తెలంగాణ బ్రాండ్‌ను మరింత విశ్వవ్యాప్తం చేస్తామన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణను నంబర్‌వన్‌గా మార్చడంలో జీనోమ్ వ్యాలీ పాత్ర కీలకమని కొనియాడారు. రాష్ట్రంలో ఉపాధి కల్పనలో లైఫ్ సైన్సెస్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని.. ప్రత్యక్షంగా 51 వేల మందికి, పరోక్షంగా 1.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందని వెల్లడించారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమైన, నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు.

### క్వీన్స్‌లాండ్ ప్రతినిధులతో భేటీ

బయో ఏషియా సదస్సు ప్రారంభం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు.. ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ రాష్ట్రానికి చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. తెలంగాణలో ఉన్న సానుకూల వాతావరణం, పెట్టుబడులకు కల్పించిన అనుకూల పరిస్థితుల గురించి సీఎం వారికి వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులపై క్వీన్స్‌ల్యాండ్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

## పర్సనలైజ్డ్ మెడిసిన్ వినియోగం పెరగాలి

ఏకేటీ హెల్త్ ప్రధాన వైద్యాధికారి మిట్సుహిరో మరుమొటొ



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తికీ తన శరీర తత్వాన్ని బట్టి.. ఎదుర్కొంటున్న అనారోగ్యానికి తగిన పర్సనలైజ్డ్ మెడిసిన్‌పై దృష్టిపెట్టాల్సిన అవసరముందని ఏకేటీ హెల్త్ సంస్థ చీఫ్ మెడికల్ అధికారి మిట్సుహిరో మరుమొటొ అన్నారు. హెచ్ఐసీసీలో మంగళవారం ప్రారంభమైన బయో ఏషియా సదస్సులో పాల్గొన్న ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. "మనిషి చేతి వేళ్లు ఒకే తీరుగా ఉండని విధంగా.. ప్రతి ఒక్కరి శరీర తత్వం వేర్వేరుగా ఉంటుంది. ఒక ఔషధం ఒకరికి మంచి ఫలితాలు ఇస్తే, అదే మందు మరొకరికి అంత ప్రయోజనం ఇవ్వకపోవచ్చు" అని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే పలుదేశాల్లో పర్సనలైజ్డ్ మెడిసిన్ వినియోగం పెరుగుతోందని.. ఇండియాలో ఇప్పుడిప్పుడే దీనిపై అవగాహన పెరుగుతోందని వివరించారు. టార్గెటెడ్ మెడికేషన్‌తో రోగి త్వరగా కోలుకుంటాడని, యాంటిబయాటిక్స్ వినియోగాన్ని తగ్గించవచ్చని మరుమొటో వివరించారు.

## నొప్పిలేని, మెరుగైన, చౌక వైద్యం.. ఏఐతో సాధ్యం

### బయోఏషియా చర్చాగోష్ఠిలో నిపుణులు

క్యాన్సర్ సహా పలు ప్రాణాంతక వ్యాధులకు చేసే చికిత్సలు, సర్జరీలు.. నొప్పితో కూడుకున్నవి. కొన్ని సందర్భాల్లో అసలు వ్యాధి నిర్ధారణలోనే కచ్చితత్వం కొరవడుతోంది. పలు దేశాల్లో వైద్యం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారింది. ఈ సమస్యలన్నిటికీ కృత్రిమ మేధ (ఏఐ) పరిష్కారం చూపిస్తోందని బయో ఏషియా సదస్సులో పాల్గొన్న నిపుణులు పేర్కొన్నారు. 'ఏఐతో వైద్య రంగంలో మార్పులు' అనే అంశంపై మంగళవారం నిర్వహించిన చర్చాగోష్ఠిలో పలువురు ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. 70 వ్యాధులకు సంబంధించి తాము ఏఐ సహాయంతో 5 కొత్త థెరపీలను అభివృద్ధి చేశామని.. వాటితో నొప్పిరహిత, మెరుగైన, చవకైన వైద్యం అందించవచ్చని మెడ్‌ట్రానిక్స్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ డాక్టర్ కెన్ వాషింగ్టన్ తెలిపారు. ఏఐ టెక్నాలజీ వైద్యులకు ప్రత్యామ్నాయం కాకపోయినా.. ఏఐతో వైద్యులు కచ్చితత్వంతో కూడిన వైద్యం అందించే అవకాశం ఏర్పడిందని ఏఐజి ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. అయితే, రోగుల డేటా ఆన్‌లైన్లో అందుబాటులో ఉండడంవల్ల సైబర్ దాడుల ప్రమాదం కూడా పెరిగిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇక.. ఏఐ, బిగ్‌డేటాతో భారత వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని యూకేలోని ఇమేజ్ అనాలిసిస్ గ్రూప్ ప్రెసిడెంట్ డాక్టర్ ఓల్గా కుబసోవా అన్నారు.



జీనోమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సింగపూర్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ ప్రొఫెసర్ ప్యాట్రిక్ ట్యాన్‌కు జీనోమ్ వ్యాలీ ఎక్స్‌లెన్స్ అవార్డును అందిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు

## మనసులు నచ్చితే కాదు.. జన్యువులు నప్పితేనే పెళ్లి, పిల్లలు!

- సింగపూర్‌లో జంటలకు ఉచిత జెనెటిక్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్
- పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తేలాకే ముందుకు
- 'బయో ఏషియా'లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ప్రజంటేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేయాలంటే ఏడేడు తరాలు.. ఇటేడు తరాలు చూడాలని మన పెద్దలు చెబుతారు! అదే సింగపూర్‌లో అయితే.. అమ్మాయి, అబ్బాయి జన్యువుల స్క్రీనింగ్ చేస్తారు. ఇద్దరికీ పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా పుడతారని ఆ పరీక్షలో తేలితేనే సంబంధం విషయంలో ముందుకెళ్తారు. లేదా ఏవైనా జన్యు సమస్యలు వచ్చేప్రమాదం ఉందని తేలితే.. మరో సంబంధం చూసుకుంటారు. వినడానికి కాస్త విచిత్రంగా ఉన్నా.. సింగపూర్‌లో ఈ విధానం ఇప్పటికే అమల్లో ఉంది. ఈ జెనెటిక్ స్క్రీనింగ్‌లో కృత్రిమ మేధ (ఏఐ)ది కీలక పాత్ర. వైద్య రంగంలో ఏఐ టెక్నాలజీతో తమ దేశం సాధిస్తున్న విజయాల గురించి, ఈ స్క్రీనింగ్ గురించి.. జీనోమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సింగపూర్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ ప్రొఫెసర్ ప్యాట్రిక్ ట్యాన్ బయో ఏషియా సదస్సులో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వివాహం అయ్యాక, గర్భం దాల్చేందుకు సిద్ధమవుతున్న దంపతులు సైతం ఈ కార్యక్రమంలో భాగంగా ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చని ఆయన వెల్లడించారు. సింగపూర్ ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపడుతున్న జెనెటిక్ స్క్రీనింగ్ ప్రోగ్రాంతో ఇప్పటివరకు 39వేల మంది లబ్ధి పొందినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇదేకాదు.. సింగపూర్‌లో ప్రతి పౌరుడి ఆరోగ్య వివరాలనూ ఆన్‌లైన్లో ఉంచాలన్న లక్ష్యంతో అక్కడి ప్రభుత్వం 2011లో నేషనల్ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్ (ఎన్ఈహెచ్ఆర్) ప్రాజెక్ట్ ప్రారంభించింది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులతో పాటు చిన్నపాటి క్లినిక్‌కు వెళ్లినా.. పౌరుల ప్రతీ రికార్డు ఆన్‌లైన్లో నమోదుచేస్తారు. ప్రతి పౌరుడి వైద్య చరిత్రతోపాటు జన్యుపరంగా అతడి తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన వ్యాధుల వివరాలు, గత రోగాలు, శస్త్రచికిత్సలు, అనారోగ్య సమస్యలన్నీ ముందుగానే ప్రభుత్వం సేకరించింది. ఈ వివరాలను ఆసుపత్రులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుంటాయి. పౌరుడు చిన్నపాటి అనారోగ్య సమస్యతో చిన్నపాటి క్లినిక్‌కు వెళ్లినా.. వారి వివరాలన్నీ ఆన్‌లైన్లో చేరిపోతాయి. దీంతో గత రోగాల ఆధారంగా భవిష్యత్తులో తలెత్తబోయే ప్రాణాంతక వ్యాధులనూ గుర్తించే వీలుంటుందని ప్యాట్రిక్ ట్యాన్ తెలిపారు. ఈ ప్రాజెక్టుతో తమ దేశ జనాభాలో దాదాపు 50శాతం మంది పౌరులకు లబ్ధి కలిగిందని.. తల్లిదండ్రుల రోగ చరిత్రను విశ్లేషించి, పిల్లలకు సంక్రమించే అవకాశాలున్న వ్యాధులను ముందస్తుంగా గుర్తించి, చికిత్స తీసుకునే అవకాశాలు ఏర్పడ్డాయని ఆయన వివరించారు.



అమరుడు సురేందర్ తల్లిదండ్రులు పి.యాదయ్య, లింగమ్మల కాళ్లు కడుగుతున్న మంత్రి దామోదర తదితరులు

## వర్గీకరణపై త్వరలోనే చట్టం:దామోదర

- మాదిగ అమరుల కుటుంబ సభ్యుల కాళ్లు కడిగిన మంత్రి

హైదరాబాద్/పంజాగుట్ట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఏక సభ్య కమిషన్ అద్భుతమైన నివేదిక ఇచ్చిందని, అందులో వంకలు పెట్టడానికి ఏమీ లేదని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా, అన్ని విధాలుగా అధ్యయనం చేసి.. అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా కమిషన్ నివేదిక ఇచ్చిందని పేర్కొన్నారు. రాజకీయం కోసం దీనిపై విమర్శలు చేయడం తగదన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణపై త్వరలోనే చట్టం చేస్తామని వెల్లడించారు. ఆ తర్వాత పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీ కూడా చేపడతామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అమరులైన వారి సంస్మరణ సభ మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అధ్యక్షతన మంగళవారంబేగంపేటలోని టూరిజం ప్లాజాలో జరిగింది. తొలుత ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అమరులైన పి.సురేందర్ మాదిగ, ఎన్. దామోదర్ మాదిగ, మహేష్ మాదిగ, భారతి మాదిగ, బి.ప్రభాకర్ మాదిగ, సీహెచ్. నాగేశ్వరరావు మాదిగ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం మంత్రి రాజనర్సింహ.. అమరుల కుటుంబ సభ్యుల కాళ్లు కడిగి సన్మానించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్నీ అందించారు. ం ఉన్నా ఆదుకునే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని పేర్కొన్నారు.

## స్టాంప్ డ్యూటీ బకాయిలు 2,694 కోట్లు విడుదల

పట్టణ ప్రాంతాలకు ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్టాంప్‌డ్యూటీ బకాయిలు రూ.2,694 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను 142 మునిసిపాలిటీలకు సర్దుబాటు చేశారు. నిధుల్లో జీహెచ్ఎంసీ ఖాతాలోకే రూ.2,300 కోట్లు వెళ్లాయి. అత్యధికంగా రూ.281.46 కోట్లు నార్సింగ్ మునిసిపాలిటీకి వచ్చాయి. ఈ నిధులు అందడంతో మునిసిపాలిటీల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సిబ్బంది వేతనాలను చెల్లించే వెసులబాటు కలిగిందని అధికారులు తెలిపారు. 2019 నుంచి స్టాంప్ డ్యూటీ పరంగా రావాల్సిన నిధులు పెండింగ్‌లో ఉన్నాయి.

## 3 కేసులు కొట్టివేయాలని కేటీఆర్ క్వాష్ పిటిషన్లు

- ఒక కేసు విచారణ నుంచి తప్పుకొన్న జస్టిస్ లక్ష్మణ్

ఎన్నికలతోపాటు వివిధ సందర్భాల్లో నమోదైన కేసులను కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైకోర్టులో మూడు వేర్వేరు క్వాష్ పిటిషన్‌లు దాఖలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తనను ఓడించేందుకు ఫేక్ వీడియోలు వైరల్ చేశారని పేర్కొంటూ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు గతేడాది మే నెలలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సైతం నిందితులుగా చేర్చారు. ఆ కేసు కొట్టేయాలని కోరుతూ కేటీఆర్, జగదీశ్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఇది జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఈ కేసు విచారణ నుంచి తాను తప్పుకొంటున్నానని, వేరే ధర్మాసనానికి బదిలీ చేయాలని ఆయన సూచించారు. దీంతో విచారణ వాయిదాపడింది. గతేడాది సీఎం రేవంత్‌నుద్దేశించి 'చీఫ్ మినిస్టర్' 'ఢిల్లీ గులాం' అంటూ ట్విట్టర్ ఖాతాలో కేటీఆర్ పోస్టు పెట్టడంపై మరో కేసు నమోదయింది. కాంగ్రెస్ నేత ఆత్రం సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉట్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఇంకో కేసు నమోదైంది. ఈ కేసులు కూడా కొట్టివేయాలని కేటీఆర్ పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని పేర్కొంటూ పోలీసులు, ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది.

# ఊబకాయానికి టీకాతో చెక్?

## ముఖం చూసి జబ్బులు చెప్పే కృత్రిమ మేధ.. ఆటిజం, డౌన్ సిండ్రోమ్ పిల్లలకు 'విజన్ నానీ'

### బయో ఏషియా సదస్సులో పలు ఆసక్తికర ఆవిష్కరణలు

రాజధాని హైదరాబాద్‌లో ప్రారంభమైన బయో ఏషియా సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ ట్రేడ్ షోలో పలు ఆసక్తికర ఆవిష్కరణలు కనిపించాయి. వాటిలో మచ్చుకు కొన్ని..

### ఆటిజం పిల్లలకు తోడు.. విజన్ నానీ

కంటిచూపు సమస్యలన్నీ కంటికి మాత్రమే పరిమితమై ఉండవు. చాలామందికి మెదడులో సమస్యల వల్ల కూడా చూపు తేడా వస్తుంది. ఆటిజం, డౌన్ సిండ్రోమ్ వంటివాటితో బాధపడేవారిలో ఈ సమస్యలు మరింత ఎక్కువగా ఉంటాయి. కళ్లు ఏం చూస్తున్నాయో అర్థం చేసుకోవడంలో వీరి మెదడు ఇబ్బంది పడుతుంటుంది. ఇలాంటి సెరెబ్రల్ విజువల్ ఇంపెయిర్‌మెంట్ (సీవీఐ) బాధితుల కోసమే విజన్ నానీ సంస్థ ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సోర్స్ ప్లాట్‌ఫామ్‌తో ముందుకొచ్చింది. ఆటిజం తదితర సమస్యలతో బాధపడే చిన్నారులకు శిక్షణ ఇచ్చే టీచర్లతో పాటుగా పిల్లలకు కూడా ఇది ఉపయోగపడుతుందని, ఖర్చు సగం తగ్గడంతో పాటుగా ఐదు రెట్లు వేగంగా పిల్లలు స్పందించడం సాధ్యమవుతుందని, థెరపిస్టుకు మూడు గంటల సమయం కూడా ఆదా అవుతుందని చెబుతున్నారు సంస్థ ప్రతినిధి ప్రత్యూష.

### దాతలను ఆపన్నులను కలిపేస్తుంది!

సహాయం కోసం ఎదురుచూసే వారు ఎంతోమంది ఉంటారు. సహాయం అందిస్తామనే వారూ చాలా మందే ఉంటారు. ఈ రెండు వర్గాల వారినీ కలిపేందుకు.. సోలిక్స్ అనే సంస్థ 'టచ్ ఏ లైఫ్ ఫౌండేషన్ (టీఏఎల్)' పేరిట ఒక స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తోంది. పలు రంగాల్లోని కంపెనీలకు అవసరమైన విస్తృతస్థాయి డేటాను అందించే ఈ సంస్థ, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా టీఏఎల్ హాస్పిటల్స్‌ను తీసుకువచ్చింది. అవసరార్థులైన రోగులను డాక్టర్లతో వర్చువల్‌గా కలుపుతోంది. అదీ ఉచితంగా! అంతేనా, ఆర్థిక సహాయం అవసరమైన వారికి క్రౌడ్ ఫండింగ్ సహాయమూ అందిస్తామంటున్నారు ఈ సంస్థ ప్రతినిధులు.




ఊబకాయం.. ప్రపంచాన్ని వేధిస్తున్న అతి పెద్ద సమస్యలలో ఒకటి. ఈ ఊబకాయం కారణంగానే మధుమేహం, గుండె జబ్బులు, ఫ్యాటీ లివర్ లాంటి సమస్యలూ వస్తుంటాయి. ఈ సమస్యకు విరుగుడుగా.. వ్యాయామాలు, ఆకలిని మందగింపజేసే ఔషధాలు.. అవి ఫలితం ఇవ్వకపోతే లైపోసక్షన్, బేరియాట్రిక్ సర్జరీ వంటివి అందుబాటులో ఉన్నాయి. ఈ బాధలేవీ లేకుండా ఒక్క వ్యాక్సిన్‌తో ఊబకాయానికి చెక్ పెట్టలేమా అని అంటే.. ప్రస్తుతానికి లేదు కానీ మరో నాలుగైదేళ్లలో ఆ కల సాకారం కాబోతుందని చెబుతున్నారు యుటోపియా థెరపాటిక్స్ సంస్థ ప్రతినిధులు. డ్రగ్ డిస్కవరీలో అపార అనుభవం కలిగిన గోపి కడియాల నేతృత్వంలోని బృందం ఇప్పటికే ఈ వ్యాక్సిన్ అభివృద్ధిలో ముందంజ వేసిందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ టీకా ఆకలిపై కాక.. ఫ్యాట్ మెటబాలిజమ్‌ను లక్ష్యంగా చేసుకుని పనిచేస్తుందని వారు వివరించారు. కాలేయం, శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా నిరోధించడంతో పాటు ట్రై గ్లిజరైడ్స్, విజరల్ ఫ్యాట్‌ను సైతం తగ్గిస్తుందని ప్రీక్లినికల్ ట్రయల్స్‌లో వెల్లడైనట్టు తెలిపారు. ఈ సంవత్సరమే మొదటి దశ క్లినికల్ ట్రయల్స్‌కు ప్రణాళికలు రచిస్తున్నట్టు చెప్పారు.

### ఊబకాయులూ ఊపిరిపీల్చుకోండి!

### ఇంపాక్ట్ చూపుతోంది


దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారు ప్రతి సమస్యకూ హాస్పిటల్‌కు పరుగుపెట్టాలంటే కష్టం. కానీ, రోగి ఆరోగ్యస్థితిని బట్టి ఓ 10-18 గంటలు ముందుగానే ఫలానా సమస్య వచ్చే అవకాశం ఉందనే హెచ్చరిక చేసే ఏర్పాటు ఉంటే? అదే చేస్తున్నామంటోంది ఏకేటీ హెల్త్ ఎనలిటిక్స్. 'ఇంపాక్ట్ హెల్త్' పేరిట.. ఈసీజీ మానిటర్, వేరబల్ టెంపరేచర్ మానిటర్, రెస్పిరేటరీ, బీపీ స్థాయులను తెలిపే వేరబుల్ మెడికల్ ఉపకరణాలను ఈ సంస్థ విడుదల చేసింది.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్ సిటీ



### ముఖం చూసి రోగం చెప్పేస్తుంది

గతంలో వైద్యులు నాడి చూసి రోగం చెప్పేసేవారు. కళ్లు, నాలుక చూసి.. పేషెంట్ ఆరోగ్య సమస్యలను గుర్తించేవారు. ఇప్పుడు సాంకేతికతతో అదే పనిచేస్తామని సియానా హెల్త్ అనే సంస్థ చెబుతోంది. జెనెటిక్స్, ఏఐ సాయంతో.. ఒక వ్యక్తి ముఖం చూసి 88% కచ్చితత్వంతో అతడి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేస్తామంటోంది. సియానా హెల్త్ యాప్ ద్వారా మన ముఖాన్ని స్కాన్ చేస్తే చాలు.. 25 రకాల హెల్త్ పారామీటర్లను (బీఎంఐ, మధుమేహ ముప్పు వంటివి) అంచనా వేసి చెబుతుంది. అంతేనా, మందులు ఏ సమయంలో వేసుకోవాలి లాంటి వాటి గురించి అప్రమత్తం చేస్తుంది.



### ఏఐతో క్యాన్సర్ గుర్తింపు

క్యాన్సర్ నిర్ధారణ కొంచెం క్లిష్టమైన పని. దాన్ని సులభతరం చేసేందుకు అమర్‌నాథ్ మెడికల్స్ అనే సంస్థ ఒక ఏఐ టూల్‌ను రూపొందించింది. కణజాలంలోని ప్రతి కణాన్నీ విశ్లేషించి క్యాన్సర్‌ను నిర్ధారించడంతోపాటు అది ఏ స్టేజ్‌లో ఉందనే విషయాన్ని కచ్చితంగా తెలుపుతుంది. ఏఐ వినియోగంతో.. క్యాన్సర్ నిర్ధారణ సమయం తగ్గడంతో పాటు, ఫలితాలు కచ్చితంగా ఉంటాయని నిర్వాహకులు శశాంక్ గుప్తా తెలిపారు.

# ప్రచారానికి తెర.. ప్రలోభాల ఎర!

(మొదటిపేజీ తరువాయి)

నిమగ్నమయ్యారు. మండలాలు, నియోజకవర్గాల వారీగా, వృత్తుల వారీగా సమావేశాలు నిర్వహించి.. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల; నల్లగొండ- ఖమ్మం- వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సాధారణ ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలను తలపించే విధంగా మారడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ సీఎం రేవంత్‌తోపాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ప్రచారం నిర్వహించారు. బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి పక్షాన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రచారం చేశారు. బీఎస్పీ తరఫున ప్రసన్న హరికృష్ణ బరిలో ఉన్నారు. ప్రచారం ముగియడంతో అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టే పనులు ప్రారంభించారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి సంబంధించి ఒక అభ్యర్థి ఓటరుకు రూ.5 వేల చొప్పున, మరో అభ్యర్థి రూ.3 వేల చొప్పున పంపిణీ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో పంపిణీ ఇప్పటికే పూర్తయిందని సమాచారం. పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి బుధవారం రాత్రి వరకు పంపిణీ పూర్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటుకు రూ.1000-5000 వరకు, గ్రాడ్యుయేట్ అభ్యర్థులు ఓటుకు రూ.1000-2000 వరకు పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలిసింది. డబ్బు పంపిణీతో పాటు వీలైన చోట్ల 10-20 మంది పట్టభద్రుల ఓటర్లకు విందులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది.

● నల్లగొండ- ఖమ్మం- వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓట్ల కోసం ప్రలోభాలు షురూ అయ్యాయి. ఈ నియోజకవర్గంలో 19 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో కీలకమైన పోటీదారులకు సంబంధించిన ప్రతినిధులు ఎక్కడికక్కడ ఉపాధ్యాయులకు, వారి కుటుంబ సభ్యులకు దావత్‌లు ఇస్తున్నట్లు సమాచారం. మరోవైపు మంగళవారమే ఇద్దరు అభ్యర్థులకు సంబంధించి ఓటర్లకు డబ్బుల పంపిణీ మొదలుపెట్టినట్లు ప్రత్యర్థి సంఘాలకు చెందిన సోషల్‌మీడియా గ్రూపుల్లోనూ వైరల్‌గా మారింది. ఒక ప్రధాన అభ్యర్థి తరఫున ప్రతినిధులు దావత్‌లతో పాటు కవర్లలో ఓటుకు రూ.2 వేల చొప్పున అందిస్తున్నారని తెలిసింది. మరో అభ్యర్థి తరఫున సైతం ఇదే తరహాలో విందులు, ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా రూ.2 వేల వరకు పంపిస్తున్నారని చెబుతున్నారు. మరో అభ్యర్థి తరఫున బుధవారం లేదంటే పోలింగ్ సమయానికి నగదు అందేలా ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఈ అభ్యర్థి తరఫున రూ.4 వేల వరకు డబ్బులిచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# నేడు ప్రధానితో సీఎం రేవంత్ భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రధాని మోదీని కలవనున్నారు. ఈ మేరకు ఆయన అపాయింట్‌మెంట్ ఖరారు కావడంతో మంగళవారం సాయంత్రమే సీఎం ఢిల్లీకి బయలుదేరి వెళ్లిపోయారు. వాస్తవానికి రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులకు కేంద్రం నుంచి ఆర్థిక సాయాన్ని కోరేందుకు ప్రధాని సమయాన్ని సీఎం కార్యాలయం గతంలోనే కోరింది. దీనికితోడు ఆదివారం ఎస్సెల్బీసీ సొరంగం ప్రమాదం గురించి ప్రధాని మోదీ రేవంత్‌రెడ్డికి ఫోన్ చేసినపుడు టన్నెల్ నిర్మాణం దశాబ్దాలుగా కొనసాగుతున్న విషయం చర్చకు వచ్చింది. ఈ నేపథ్యంలో పెండింగ్ ప్రాజెక్టుల గురించి వివరించేందుకు అపాయింట్‌మెంట్ కావాలని రేవంత్‌రెడ్డి ప్రధానిని అడిగారు. ప్రధాని హామీ మేరకు అపాయింట్‌మెంట్ బుధవారం ఖరారు కావడంతో రేవంత్ ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అయితే ప్రధానిని సీఎం ఒక్కరే కలుస్తారా? లేక బుధవారం ఉదయం కల్లా ఒకరిద్దరు మంత్రులూ ఢిల్లీకి వెళ్లి ఆయనతో పాటుగా ఉంటారా? అన్నది స్పష్టత రాలేదు. ప్రధానంగా రీజనల్ రింగ్‌రోడ్డు, మెట్రో విస్తరణ ప్రాజెక్టులకు కేంద్ర సాయంపైన ప్రధానితో సీఎం రేవంత్ చర్చించనున్నట్లు చెబుతున్నారు. వీటితో పాటుగా వివిధ ప్రాజెక్టులకు పెండింగ్ నిధులూ విడుదల చేయాలని కోరనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. స్థానిక సంస్థలతో పాటుగా, విద్యా ఉద్యోగాల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు పెంచాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రిజర్వేషన్లను పెంచుకునేందుకు వీలుగా రాజ్యాంగాన్ని సవరించి, 9వ షెడ్యూల్‌లో ఈ మేరకు మార్పులు చేయాలనీ ప్రధానిని ముఖ్యమంత్రి కోరే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్లు విడుదలైన నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం పెద్దలనూ కలిసి చర్చించేందుకు ఆస్కారం ఉన్నట్లు చెబుతున్నారు. రెండో విడత కులగణన సర్వే ఈ నెల 28తో పూర్తి కానున్న నేపథ్యంలో తాజా వివరాలనూ క్రోడీకరించి నివేదికను అసెంబ్లీకి ప్రభుత్వం సమర్పించనుంది. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా నిపుణులతో చర్చించే అవకాశం ఉందంటున్నారు. సీఎం బుధవారం సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు.

### 2న వనపర్తికి సీఎం

వనపర్తిలో మార్చి 2న జరిగే స్కిల్ డెవలప్‌మెంట్ మేళాలోను, బహిరంగ సభలోను సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నట్లు పార్టీ ఎంపీ మల్లు రవి తెలిపారు. సీఎం రేవంత్‌ని మంగళవారంఆయన నివాసంలో కలిసిన మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి ఈ మేరకు ఆహ్వానపత్రం అందించారు.

## అప్పు తీర్చాలని బ్యాంకు సిబ్బంది ఒత్తిడి.. రైతు ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమం !

గుర్రంపోడు, యాచారం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రుణం చెల్లించకపోతే భూమిని స్వాధీనం చేసుకుంటామని బ్యాంకు అధికారులు హెచ్చరించడంతో ఓ రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం తేనపల్లితండాకు చెందిన రైతు వడ్త్యా జవహర్‌లాల్(35) మండల కేంద్రంలోని కేంద్ర సహకార బ్యాంకులో భూమిని తనఖా పెట్టి నాలుగేళ్ల క్రితం రూ.15లక్షలు అప్పు తీసుకున్నాడు. రెండు కిస్తీలను చెల్లించకపోవడంతో మంగళవారం బ్యాంకు సిబ్బంది రైతు ఇంటికి వెళ్లి అప్పు చెల్లించని పక్షంలో భూమిని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. మనోవేదనకు గురైన వడ్త్యా జవహర్‌లాల్ బ్యాంకు సిబ్బంది ఎదుటే గడ్డి మందు తాగాడు. నల్లగొండ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే, రంగారెడ్డి జిల్లా యాచారం మండలం గడ్డమల్లయ్యగూడకు చెందిన ఇక్కె మల్లమ్మకు మేడిపల్లిలోని సర్వే నం.95లో మూడెకరాల భూమి ఉంది. దీనిపై సొసైటీలో ఆమె రూ.4.28 లక్షల రుణం తీసుకుంది. ఈ భూమిని ఫార్మాసిటీకి కోసం గతంలో ప్రభుత్వం తీసుకోవడంతో పరిహారం వస్తుందని, రైతు రుణమాఫీ అవుతుందన్న ఉద్దేశంతో మల్లమ్మ రుణం చెల్లించలేదు. దీంతో వడ్డీతో కలిపి అప్పు రూ.7.28 లక్షలకు చేరింది. బాకీ చెల్లించడం లేదన్న కారణంతో మంగళవారం మల్లమ్మ ఇంటికి వచ్చిన బ్యాంకు అధికారులు అక్కడే ఉన్న బైక్‌ను తీసుకెళ్లిపోయారు. కాగా, తీసుకున్న రుణంలో రూ.2.60 లక్షల బాకీ చెల్లించామని, అయినా బాకీ పడ్డామని బైక్ తీసుకెళ్లడం అన్యాయమని, పైగా ఆ బైక్ కూడా తనది కాదని పొలం పనులకు వచ్చే కూలీదని మల్లమ్మ కుమారుడు పర్వతాలు ఆవేదన వ్యక్తం చేశాడు.

## నన్ను గెలిపించండి! మహిళా టీచర్లకు ఎలక్ట్రిక్ బైక్‌లు ఇస్తా

» బాండ్ రాసి ఇస్తున్న స్వతంత్ర అభ్యర్థి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తనను గెలిపిస్తే ఆరు నెలల్లో మహిళా ఉపాధ్యాయులందరికీ ఎలక్ట్రిక్ బైక్‌లు అందజేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి మామిడి సుధాకర్ రెడ్డి హామీ ఇస్తున్నారు. ఓటర్లకు ఆయన ఈమేరకు బాండ్ పేపర్ రాసి ఇస్తున్నారు. మెదక్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన బాండ్ పేపర్‌ను ప్రదర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఆశీర్వదించి శాసన మండలికి పంపిస్తే వారి గొంతుకగా మారతానని హామీ ఇచ్చారు.

## 10 రోజుల్లో పెళ్లి అనగా.. మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పది రోజుల్లో పెళ్లి చేసుకుని కొత్త జీవితంలోకి అడుగుపెట్టాల్సిన ఓ మహిళా కానిస్టేబుల్ బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ విషాద ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. కుటుంబసభ్యులు ఇష్టం లేని పెళ్లి చేస్తుండడంతోనే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వర్గల్ గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ మామిడి అనూష(30) భువనగిరిలోని జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. స్థానిక విద్యానగర్‌లో మరో ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నారు. అనూషకు కుటుంబ సభ్యులు ఈనెల 14న నిశ్చితార్థం చేసి, మార్చి 6న పెళ్లికి ముహూర్తం నిర్ణయించారు. ఈ క్రమంలో మంగళవారం అనూష తను అద్దెకు ఉంటున్న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. అయితే కుటుంబసభ్యులు తనకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని అనూష తన సహచర ఉద్యోగుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

## రెడ్డి వర్సెస్ బీసీగా ఎమ్మెల్సీ ఎన్నికలు

» పూల రవీందర్, ప్రసన్న హరికృష్ణ మల్క కొమురయ్యలకు మద్దతు: జాజుల

పంజాగుట్ట/సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలను రెడ్డి వర్సెస్ బీసీగా భావిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులు పూల రవీందర్, ప్రసన్న హరికృష్ణ, మల్క కొమురయ్యలకు మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. పోటీలో అనేక మంది బీసీ అభ్యర్థులున్నా.. అందులో విజయావకాశాలు ఎక్కువగా ఉన్న వారికే తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. బీసీ అభ్యర్థులను గెలిపించాలని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పట్టభద్రులకు రాసిన బహిరంగ లేఖను జాజుల శ్రీనివాస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి తదితరులు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విడుదల చేశారు. తాము మద్దతు ఇస్తున్న అభ్యర్థుల గెలుపు ఖాయమైపోయిందని.. కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోయినా ప్రభుత్వానికి వచ్చే ప్రమాదం ఏమీ లేదని సీఎం స్వయంగా చెప్పారని జాజుల పేర్కొన్నారు. మరోవైపు సంగారెడ్డిలో జాజుల విలేకరులతో మాట్లాడుతూ.. రెడ్డి సామాజిక వర్గమంటే తమకు ద్వేషం లేదని, కానీ కాంగ్రెస్, బీజేపీలు బీసీ సామాజిక వర్గానికి అన్యాయం చేశాయని అన్నారు. బీసీలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు ఓటు వేసి బీసీల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

## జూరాలకు 2,800 క్యూసెక్కుల వరద

అమరచింత, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేసవికి ముందే అడుగంటుతున్న జూరాల ప్రాజెక్టుకు కర్ణాటక నుంచి నీరు రావడం ఊరటనిచ్చింది. కర్ణాటక ప్రభుత్వం నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి సోమ, మంగళవారాల్లో ఒక టీఎంసీ నీటిని వదలగా.. మంగళవారం గద్వాల జిల్లాలోని జూరాలకు 2,800 క్యూసెక్కుల నీరు వచ్చింది. గత నెలలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను కలిశారు. వేసవిలో ఉమ్మడి జిల్లా సాగు, తాగునీటి అవసరాల కోసం 6 టీఎంసీల నీటిని వదలాలని కోరారు. దీంతో నాలుగు టీఎంసీలను వదలడానికి కర్ణాటక ప్రభుత్వం అంగీకరించింది. ప్రస్తుతం ఒక టీఎంసీ నీటిని వదలగా అందులో 2,800 క్యూసెక్కుల నీరు చేరింది.

## ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై జ్యుడీషియల్ కమిషన్ వేయాలి : కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒకవైపు సహాయక చర్యలు మరింత వేగవంతంగా కొనసాగిస్తూనే జరిగిన ప్రమాదంపై, అందుకు బాధ్యులైన వారిపైనా విచారణ చేపట్టాలని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం వల్ల ప్రభుత్వానికి వందలకోట్ల నష్టం జరిగిందన్నారు. ఇంతకుముందు సుంకిశాల, పెద్దవాగు ప్రమాదాలు జరిగినపుడు కూడా ప్రభుత్వం ఎలాంటి దర్యాప్తు చేపట్టలేదని, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకొచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు.. దమ్ముంటే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసి గెలిచి చూపించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి కేటీఆర్ సవాల్ విసిరారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు మాజీ జడ్పీటీసీ సభ్యుడు కీర్తి వెంకటేశ్వర్లు, మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు కార్యకర్తలు మంగళవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నుంచి వలసలు మొదలయ్యాయని, ఇందుకు స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలే సాక్ష్యమని చెప్పారు. రేవంత్‌రెడ్డి చేతకానితనం వల్ల 48 గంటల్లో ఏడుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ఈ మరణ మృదంగానికి ముఖ్యమంత్రిదే పూర్తి బాధ్యత అని ఎక్స్ వేదికగా కేటీఆర్ పేర్కొన్నారు.

# శివరాత్రికి సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

రామేశ్వరుడు, ఆలంపూర్ నవబ్రహ్మేశ్వరాలయం.. ఇలా ప్రసిద్ధ శైవక్షేత్రాల్లో శివరాత్రి ఉత్సవాలు, రుద్రయాగాలు, పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాలు ఊపందుకున్నాయి. కీసరగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి భవానీశివదుర్గ సమేత రామలింగేశ్వర స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వం తరపున చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొని, పట్టువస్త్రాలు సమర్పించారు. వేల సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. బుధవారం శివరాత్రి సందర్భంగా.. ప్రభుత్వం ఆలయంలో ఏర్పాట్లను పూర్తిచేసింది. శివరాత్రి సందర్భంగా భక్తులకు ఆన్‌లైన్ ద్వారా దర్శనం టోకెన్లు ఇచ్చే ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, న్యాయమూర్తులు, ఇతర ముఖ్యులకు ప్రొటోకాల్ లైన్, వీఐపీ పాసులతో మరో లైన్ ఏర్పాటు చేశారు. వీఐపీ క్యూలో వచ్చే భక్తులకు టైం స్లాట్ విధించారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా.. 1,200 మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. అటు రంగారెడ్డిజిల్లా శ్రీ శివగంగ రాజరాజేశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. యాదాద్రి-భువనగిరిలోని యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దివ్యక్షేత్రంలో.. పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరుడి శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. ఆది దంపతులకు అర్చకులు పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలను సమర్పించారు. యాదగిరిగుట్ట క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఈ సందర్భంగా నాగవల్లి దళార్చనలు, నరసింహస్వామికి నిత్యకల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. రాజన్న-సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న క్షేత్రంలోనూ మహాశివరాత్రి వేడుకలు మొదలయ్యాయి. స్వామివారికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టువస్త్రాలు సమర్పించారు.



విద్యుత్ దీపకాంతుల్లో యాదాద్రి ఆలయం

### మల్లెల తీర్థం సందర్శనకు అనుమతి

మన్ననూర్: నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ పులుల అభయారణ్యంలోని మల్లెలతీర్థం జలపాతాల సందర్శన మంగళవారం ప్రారంభమైంది. 28 వరకు భక్తులు మల్లెలతీర్థాన్ని, అక్కడి మల్లికార్జున సన్నిధిని సందర్శించవచ్చు.

# పాపకు 3 లక్షలు.. బాబుకు 5 లక్షలు

» అప్పుడే పుట్టిన చిన్నారుల అక్రమ రవాణా

» గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు తరలించి విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా ఆట కట్టు!

» 11 మంది అరెస్ట్.. నలుగురు చిన్నారులను రక్షించిన రాచకొండ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పొత్తిళ్లలో పసిబిడ్డలను అపహరించి.. రాష్ట్రాలు దాటించి.. వారిని అమ్మి సొమ్ము చేసుకుంటున్న అంతర్రాష్ట్ర ముఠాను రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు! గుజరాత్ నుంచి పసిపిల్లలను అక్రమంగా రవాణా చేసి ఆడపిల్లలైతే రూ.3 లక్షలకు.. మగపిల్లలను రూ.5 లక్షలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి, చైతన్యపురి పోలీసుల సహకారంతో ఆ ముఠాకు చెందిన వారిని కటకటాల వెనక్కి నెట్టారు. ఇటీవలే వారు విక్రయించిన నలుగురు పసికందులను(ఇద్దరు పాపలు, ఇద్దరు బాబులు) కాపాడి.. వారిని కొనుగోలు చేసినవారిని సైతం అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం 11 మంది నిందితులను అరెస్ట్ చేసినట్టు రాచకొండ సీపీ సుధీర్‌బాబు మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్యపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బస్టాపు సమీపంలో మంగళవారం ఉదయం.. ఒక పసిపిల్లవాడిని విక్రయిస్తున్నారని మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం అందింది. దాంతో డీసీపీ రమణారెడ్డి, అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ జానయ్య బృందం రంగంలోకి దిగింది. చైతన్యపురి పోలీసులతో కలిసి దాడిచేసిన ఆ బృందం.. చిన్నారిని విక్రయిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకుంది. ఆ ముఠాలోని కోల కృష్ణవేణి, సావిత్రి దేవి, సంపత్ కుమార్‌ను పోలీసులు ప్రశ్నించగా వారి అకృత్యాలన్నీ వెలుగులోకి వచ్చాయి. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన సావిత్రిదేవి అక్కడి నుంచి ఒక చిన్నారిని అక్రమ రవాణా చేసి చైతన్యపురికి వచ్చింది. నగరంలో ఈ ముఠాను నడిపిస్తున్న సూరారం వాసి కోల కృష్ణవేణి, కొత్తపేటకు చెందిన బట్టు దీప్తి కవాడిగూడకు చెందిన సందీప్ కుమార్.. అక్కడికి చేరుకొని ఆ చిన్నారిని తీసుకున్నారు. ఆ బాబును రూ.4.2 లక్షలకు మహబూబాబాద్ జిల్లా కేసముద్రానికి చెందిన దంపతులకు విక్రయించడానికి తెప్పించినట్లు పోలీసుల విచారణలో తేలింది. అహ్మదాబాద్‌లో ఉండే వందన అనే మహిళ ఈ ముఠాకు నాయకురాలుగా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆమె ఆదేశాలతోనే సావిత్రి అహ్మదాబాద్ నుంచి పిల్లలను తెచ్చి కృష్ణవేణి ముఠాకు అందజేసి డబ్బులు తీసుకొని వెళ్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

### హైదరాబాద్‌లో కృష్ణవేణి కీలకం..

హైదరాబాద్‌లో ఈ ముఠాకు నాయకత్వం వహిస్తున్న కృష్ణవేణి గతంలోనూ చిన్నారులను విక్రయిస్తూ గోపాలపురం పోలీసులకు దొరికిపోయింది. బీఎస్సీ చదివిన కృష్ణవేణి.. రవికుమార్ అనే వ్యక్తిని 2019లో పెళ్లి చేసుకుంది. అయితే కృష్ణవేణికి పిల్లలు పుట్టకపోవడంతో ఆమెకు భర్త విడాకులు ఇచ్చాడు. అప్పటి నుంచి ఒక ప్రైవేటు కంపెనీలో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా ఉద్యోగం చేస్తోందామె. ఈ క్రమంలోనే.. పిల్లలు లేని దంపతులు కొందరితో ఆమెకు పరిచయమైంది. ఎవరైనా అమ్మితే పిల్లలను కొనుక్కొని సాదుకోవడానికి తాము సిద్ధమని వారు చెప్పారు. అదే సమయంలో కృష్ణవేణికి సోషల్ మీడియా ద్వారా.. పిల్లలను విక్రయించే గుజరాతీ మహిళ వందనతో పరిచయం ఏర్పడింది. చిన్నారులను కొనుక్కొనేందుకు తనకు తెలిసిన కొందరు సిద్ధంగా ఉన్నట్టు కృష్ణవేణి వందనకు చెప్పింది. అందుకు అంగీకరించిన వందన.. అహ్మదాబాద్‌కు చెందిన సావిత్రి, సునీతా సుమన్ అనే ఇద్దరు మహిళల ద్వారా కృష్ణవేణికి పసిపిల్లలను చేరవేసేది. పాపకు రూ.1.5 లక్షలు, బాబుకు రూ.2.5 లక్షల చొప్పున వసూలు చేసేది. ఆ పిల్లలను కృష్ణవేణి రెట్టింపు ధరలకు విక్రయించేది. వచ్చిన డబ్బులో వందనకు ఇవ్వాల్సిన డబ్బును ఆమెకు పంపి.. తాను రూ.50-60 వేలు తీసుకుని, మిగిలిన డబ్బును తన అనుచరులైన దీప్తి, శ్రవణ్‌కుమార్, శారద, సంపత్‌కుమార్‌కు పంచేది. కొంత డబ్బును ఖర్చులకు వినియోగించేది.

### పిల్లల స్వాధీనం..

కృష్ణవేణి ముఠాను అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారించగా.. జనవరి 28న ఒక పాపను విజయవాడకు చెందిన దంపతులకు రూ. 2.7 లక్షలకు విక్రయించినట్లు తేలింది. ఆ తర్వాత ఫిబ్రవరి 4న మరో పాపను సైదాబాద్‌కు చెందిన దంపతులకు రూ. 2.5 లక్షలకు విక్రయించారు. ఫిబ్రవరి 12న ఒక బాబును మహబూబాబాద్‌కు చెందిన వ్యక్తికి రూ.4.8 లక్షలకు అమ్మేశారు. ఫిబ్రవరి 25న మరో బాబును విక్రయించడానికి అహ్మదాబాద్‌ను తెప్పించి.. అంతలోనే దొరికిపోయారు. కాగా, కొనుగోలుదారులకు ఎలాంటి అనుమానం రాకుండా ఉండేందుకు.. ఆ చిన్నారులకు నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు, వారి తల్లిదండ్రులకు సంబంధించి నకిలీ ఆధార్‌కార్డులను సైతం సృష్టించేందుకు ఈ ముఠా ప్రయత్నించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ప్రస్తుతం ముఠాలో కృష్ణవేణి, దీప్తి, సావిత్రిదేవి, శ్రవణ్‌కుమార్, శారద, సంపత్ కుమార్‌తో పాటు.. చట్ట విరుద్ధంగా చిన్నారులను కొనుగోలు చేసిన ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీపీ వెల్లడించారు.

## భక్తులపై మదగజాల పంజా

ముగ్గురి దుర్మరణం.. నలుగురికి గాయాలు

తలకోన అడవిలో అర్ధరాత్రి బీభత్సం

శివరాత్రి ఉత్సవాలకు వెళ్తుండగా పెను విషాదం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన ఆ శివయ్యను దర్శించుకుందామని తలకోనకు నడచి వెళుతున్న భక్తులపై ఏనుగుల గుంపు దాడి చేయడంతో ముగ్గురు భక్తులు అక్కడిక్కడే దుర్మరణం పాలయ్యారు. నలుగురు గాయపడ్డారు. అన్నమయ్య జిలా ఓబులవారిపల్లె మండల పరిధిలో ఉన్న గుండాలకోన నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని శేషాచల అడవిలో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వేకోడూరు మండలంలోని ఉర్లగట్టుపోడు అరుంధతివాడ, కన్నెగుంట గిరిజన కాలనీలకు చెందిన భక్తులు 30 మంది తిరుపతి జిల్లా నెరబైలు సమీపంలో ఉన్న తలకోనలోని శ్రీసిద్ధేశ్వర స్వామి దర్శనం కోసం కాలినడకన సోమవారం రాత్రి 7 గంటల శేషాచలం అడవిలోని అడ్డదారిలో బయలుదేరారు. రాత్రి సుమారు 2 గంటల సమయంలో గుండాలకోనకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఏనుగుల మంద తారసపడింది. శబ్దం చేస్తే వెళ్లిపోతాయన్న ఉద్దేశంతో 30 మందిలో ఒకరు స్టీలు టిఫిన్ బాక్సుతో శబ్దం చేయడంతో ఆగ్రహంతో ఏనుగులు ఒక్కసారిగా భక్తులపై దాడి చేశాయి. ఏనుగుల దాడిలో ఉర్లగట్టుపోడుకు చెందిన పుణెలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వంకాయల దినేశ్ (34) మృతి చెందాడు. ఇతడికి పది రోజుల క్రితమే కొడుకు పుట్టడంతో తలనీలాలు ఇచ్చేందుకు వెళుతూ మృత్యువాతపడ్డాడు. అలాగే కన్నెగుంట గిరిజన కాలనీకి చెందిన తుపాకుల మణెమ్మ (40), తిరుపతి చెంగ్రాయుడు (35)లను ఏనుగులు తొక్కి చంపేశాయి. గాయపడినవారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

## దేవుడి పేరిట బీజేపీ ఓట్ల వేట

» మతవిద్వేషాలు రెచ్చగొట్టడం ఆ పార్టీకి అలవాటు

» టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

కరీంనగర్/హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రతీ ఎన్నికల్లో ఓట్ల కోసం బీజేపీ దేవుడి పేరును వాడుకొని లబ్ధి పొందుతోందని, మతవిద్వేషాలతో ఎన్నికల్లో లబ్ధి కోరుకోవడం దేశాభివృద్ధికి విఘాతమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ విమర్శించారు. కరీంనగర్‌లోని డీసీసీ కార్యాలయంలో మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలప్పుడు మతవిద్వేషాలను రెచ్చగొట్టడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. ఫార్ములా ఈ రేసు అవినీతిలో కేటీఆర్‌పై కేసు నమోదై, విచారణ జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు కూడా ఇవ్వలేదని బండి సంజయ్ వ్యాఖ్యలు చేయడం భావ్యం కాదన్నారు. విదేశాల్లో తలదాచుకున్న ఫోన్‌ట్యాపింగ్ కేసు నిందితులను రప్పించడానికి కేంద్రమే చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న పరిమితి తెలియదా అని ప్రశ్నించారు. కాగా రాష్ట్ర ప్రజలకు మహేష్‌కుమార్ గౌడ్ శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు.. బండి సంజయ్ కేంద్ర మంత్రిగా ఉండి మతత్వాన్ని రెచ్చగొట్టడం సరికాదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ పార్టీని పాకిస్థాన్‌తో పోల్చడానికి కొంచమైనా సిగ్గుండాలని ఒక ప్రకటనలో మండిపడ్డారు.

## 28న టీపీసీసీ విస్తృత సమావేశం

టీపీసీసీ విస్తృత సమావేశం గాంధీభవన్‌లో శుక్రవారం జరగనుంది. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొంటారు. రాష్ట్ర, జాతీయ రాజకీయాలతో పాటుగా సంస్థాగతంగా పార్టీ బలోపేతంపైన చర్చించనున్నారు.

## ఐటీ బ్రదర్.. ఫ్యాటీ లివర్!

(మొదటిపేజీ తరువాయి)

తేలింది. ఈ పరిణామాలు ఫ్యాటీ లివర్, అధిక రక్తపోటు, మధుమేహం వంటి ప్రమాదకర పరిస్థితులకు ఆస్కారమిస్తాయి. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రి హెపటాలజిస్ట్ డాక్టర్ పీఎన్ రావు బృందం, హెచ్‌సీయూ రిసెర్చ్ స్కాలర్ల బృందం సంయుక్తంగా చేసిన ఓ అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఈ అధ్యయనం కోసం దేశవ్యాప్తంగా 758 మంది ఐటీ ఉద్యోగులను ఎంపిక చేయగా.. వారిలో 363 మంది పరిశోధకులు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. 345 మంది కాలేయ ఆరోగ్యం తెలుసుకునేందుకు అవసరమైన వివిధ వైద్య పరీక్షలు చేయించుకునేందుకు కూడా ముందుకొచ్చారు. కాగా, జీవక్రియపై ఒత్తిడి కారణంగా కాలేయంలో ఐదు శాతం కంటే ఎక్కువ కొవ్వు పేరుకుపోయినప్పుడు అది ఫ్యాటీ లివర్‌కు దారి తీస్తుందని పరిశోధకులు పేర్కొన్నారు. అధిక పని గంటలు, ఒత్తిడి, రకరకాల పని వేళలు, ఎక్కువ సేపు ఒకే చోట కూర్చోని ఉండడం వంటివి కాలేయ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని తెలిపారు. అంతేకాక, నిద్రలేమి, అనారోగ్యకరమైన చిరుతిళ్లు, శారీరక శ్రమ లేకపోవడం కూడా సమస్యకు కారణాలని పేర్కొన్నారు. ఫ్యాటీ లివర్ సమస్యను గుర్తించకపోతే అది తీవ్రమైన అనారోగ్యానికి దారి తీస్తుందని, కాలేయ మార్పిడి దాకా వెళ్లే ముప్పు ఉందని పరిశోధకులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఐటీ సంస్థలే తమ ఉద్యోగుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ అధ్యయనంలో హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్లు కల్యాణ్కర్ మహదేవ్, అనిత, రీసెర్చ్ స్కాలర్లు బారం భార్గవ, నందితా ప్రమోద్ పాల్గొన్నారు. తమ అధ్యయనాన్ని పీర్ రివ్యూడ్ జర్నల్‌లో ప్రచురించేందుకు నేచర్ పబ్లిషర్స్ నుంచి ఆమోదం లభించిందని ప్రొఫెసర్ కల్యాణ్కర్ మహదేవ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.